ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 19.11.2025 | సంపుటి :12 సంచిక : 119 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


## ఆదివాసీ యోధుడు, మావోయిస్టు నేత

# హిడ్మా ఎన్‌కౌంటర్



## మారేడుపల్లిలో ఎదురుకాల్పులు

## ఘటనలో అగ్రనేత, ఆయన సహచరితో సహా ఆరుగురు సభ్యుల మృతి

- ఛత్తీస్‌గఢ్ నుంచి ఆంధ్రాలోకి ప్రవేశిస్తుండగా ఘటన
- 17 ఏళ్ల వయసులోనే ఉద్యమంలో కలిసి అనతి కాంలోనే కేంద్రకమిటీ సభ్యుడిగా ఎదిగిన వైనం
- ఛత్తీస్‌గఢ్‌లోనూ ఎన్‌కౌంటర్.. మావోయిస్టు మృతి

**మారేడుమిల్లి(జనంసాక్షి):** అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు-మావోయిస్టుల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా, ఆయన భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ



అలియాస్ సురేశ్, టెక్ శంకర్ ఉన్నారు. మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మావోయిస్టుల మృతదేహాలను తీసుకొచ్చిన నేపథ్యంలో మార్చురీ వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఆ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామంలో జన్మించిన మద్వి హిడ్మా.. బస్తర్ ప్రాంతంలో దళంలో కీలక సభ్యుడిగా ఎదిగారు. చిన్నవయసులోనే కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరుపొందారు. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు.

మిగతా 2లో..

## ఆంధ్రాలో మావోయిస్టుల అలజడి

- ఏపీలో 31 మంది సభ్యుల అరెస్ట్
- ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్‌చంద్ర లడ్డా



2లో..



## జలసంరక్షణలో తెలంగాణే ఫస్ట్

- జల్ సంచయ్ జన్ భాగీదారీ అవార్డుల్లో అగ్రస్థానంలో నిలిచిన తెలంగాణ రాష్ట్రం
- కేంద్ర జలశక్తి శాఖ ప్రకటన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** జల్‌సంచయ్ జన్‌భాగీదారీ విభాగంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన ఆరో జాతీయ జల అవార్డులు- 2024లో జాతీయ స్థాయిలో తెలంగాణ తొలి ర్యాంకును సాధించింది. కేంద్ర ప్రభుత్వం- 2024లో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 5,20,362 పనులని పూర్తిచేసింది.

మిగతా 2లో..


## వికసిత్ భారత్ కోసం

# కృషిచేద్దాం

### వేగంగా అనుమతులు లభిస్తేనే పురోగతి సాధ్యం

- కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో మేమూ భాగస్వామ్యం
- 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో 10శాతం ఉంటాం
- ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్ ఆర్, మూసీ రివర్ ఫ్రంట్‌తో మార్పు
- గుజరాత్‌కు మోదీ ఇచ్చిన సహకారాన్నే మేమూ కోరుతున్నాం
- పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో రేవంత్ రెడ్డి

2లో..






## కోటి మంది మహిళలకు కోటి చీరలు

- అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీర
- నేడు ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పంపిణీ ప్రారంభం
- చీరలపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** కోటి మంది మహిళలకు కోటి చీరలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ చీరలకు సంబంధించి మంగళవారం మంత్రి సీతక్కతో కలిసి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరను అందించాలని అధికారులకు సూచించారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా

మిగతా 2లో..

## శాసనమండలి పునరుద్ధరణ పనులు పరిశీలించిన సీఎం

2లో..

## కామన్‌వెల్త్ లర్నింగ్‌తో ఓపెన్ వర్సిటీ ఒప్పందం

సీఎం సమక్షంలో కుదిరిన అవగాహన





## పదేళ్ల క్రితం నిర్వహించిన గ్రూప్-2 ఫలితాలు రద్దు

- పునర్ మూల్యాంకనం చేసి అర్హుల జాబితా నిర్ణయించాలి
- 8 వారాల్లో ప్రక్రియ ముగించాలి
- తెలంగాణ హైకోర్టు ఆదేశం




వార్త 2లో

## ఐ-బొమ్మ కేసు.. రంగంలోకి ఈడీ

నాలుగు ఖాతాల్లో రూ.20 కోట్ల లావాదేవీలు..

రవిని ఎన్‌కౌంటర్ చేయాలి : నిర్మాత సి. కల్యాణ్

**హైదరాబాద్(జనంసాక్షి):** ఐ-బొమ్మ కేసులో ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. ఈమేరకు కేసు వివరాలివ్వాలని హైదరాబాద్ సీపీకి ఈడీ లేఖ రాసింది. ఐ-బొమ్మ వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగినట్టు ఈడీ అనుమానిస్తోంది. నిందితుడు ఇమంది రవి బ్యాంకు ఖాతాల నుంచి పోలీసులు ఇప్పటికే రూ. 3.5కోట్లు ఫ్రీజ్ చేసిన విషయం తెలిసిందే. బెట్టింగ్ యాప్స్ నుంచి ప్రకటనల రూపంలో రవికి నిధులు అందినట్టు దర్యాప్తులో తేలింది. క్రిప్టోవాలెట్ నుంచి రవి ఎన్నారై ఖాతాకు నెలకు రూ. 15 లక్షలు బదిలీ అయ్యాయి.

మిగతా 2లో..

# పోలవరం -బనకచర్లను పేరు మార్చి నిర్మిస్తున్నారు

- ఈ ప్రాజెక్టుకు తెలంగాణతో పాటు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలూ వ్యతిరేకం
- ఆ నిర్మాణాన్ని పరిగణనలోకి తీసుకోవద్దని కేంద్రమంత్రిని కోరాం
- ఆల్మట్టి ఎత్తు పెంచేందుకు భూ సేకరణ కోసం జీవో జారీ చేసిన కర్ణాటక
- కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రితో భేటీ అనంతరం మీడియాతో మంత్రి ఉత్తమ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం పేరు మార్చి చేపడుతోందని, ఆ ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకించామని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రితో భేటీ అనంతరం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. "ఏపీ ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఆ ప్రాజెక్టును పరిగణనలోకి తీసుకోవద్దని కేంద్రమంత్రిని కోరాం. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు భూ సేకరణ కోసం కర్ణాటక జీవో జారీ చేసింది. 519 మీటర్లకంటే ఎక్కువ ఎత్తు పెంచవద్దని సుప్రీంకోర్టు స్టే ఉంది. స్టే ఉండగానే కర్ణాటక ప్రభుత్వం ఎత్తు పెంచేందుకు చర్యలు చేపట్టింది. కర్ణాటక ప్రభుత్వం తెచ్చిన జీవోను కేంద్రజల్‌శక్తి మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. తెలంగాణలోని పలు ఇరిగేషన్ ప్రాజెక్టులను నిధులివ్వాలని కోరాం. మా ప్రభుత్వంలో కేఆర్ఎంబీ టెలీమెట్రీ స్టేషన్



పనుల్లో పురోగతి వచ్చింది. కేఆర్ఎంబీ టెలీమెట్రీ స్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాని అడిగాం.. మరో 20 టెలీమెట్రీ స్టేషన్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఫేజ్-2లో 9, ఫేజ్-3లో 11 నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు" అని ఉత్తమ్ తెలిపారు.

## వాట్సాప్‌లో 'మీ-సేవ' పోర్టల్

- అన్ని రకాల సేవలు నేరుగా పొందేలా అవకాశం
- ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో మీ సేవ సేవలు అందుబాటులోకి వచ్చాక కుల, ఆదాయ వంటి ఇతరత్రా సర్టిఫికెట్స్ పొందడం ఈజీ అయిపోయింది. అయితే ఈ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పదే పదే మీ-సేవ కేంద్రాలకు వెళ్లే శ్రమ తగ్గించడానికి, మీ-సేవకు సంబంధించిన అన్ని సేవలను ఇకపై వాట్సాప్ ద్వారానే అందించనుంది. తెలంగాణలో ఇకపై

మిగతా 2లో..



## తెలంగాణ రైజింగ్ ఉత్సవాల్లో

# పెద్దఎత్తున పాలసీలు

- ఆధునిక, సమగ్ర, భవిష్యత్తుకు సిద్ధమయ్యే తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మిద్దాం
- హ్యామ్ ద్వారా 13 వేల కిలోమీటర్ల అంతర్గత రహదారుల నిర్మాణం
- దీంతో మారనున్న రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రం
- 47వ ఎస్ఎల్‌బిసి త్రైమాషిక సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్(జనంసాక్షి):** 2047 తెలంగాణ రైజింగ్ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించబోతోంది, అన్ని రకాల పాలసీలను ప్రకటిస్తామని ఈ భారీ కార్యక్రమంలో బ్యాంకర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం ఆయన బేగంపేటలోని ఓ ప్రైవేటు హోటల్లో నిర్వహించిన బ్యాంకర్స్ 47వ త్రైమాషిక సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ

మిగతా 2లో..






## 21న జాతీయ రహదారుల దిగ్బంధం

- పత్తి, సోయాబిన్ పంటలను వెంటనే కొనాలి
- పత్తి రైతులకు అండగా ప్రభుత్వం నిలవాలి
- ఆదిలాబాద్ పత్తి మార్కెట్ సందర్శించిన కెటిఆర్

**ఆదిలాబాద్(జనంసాక్షి):** అన్నదాతలకు మద్దతుగా ఈ నెల 21న జాతీయ రహదారుల దిగ్బంధం నిర్వహించనున్నట్లు కెటిఆర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ అన్నదాతలు భారీగా తరలి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతాంగం ముఖ్యంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఆందోళన చేపడుతున్నామని అన్నారు. ఈ క్రమంలో కేటీఆర్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులో పత్తి, సోయా రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మిగతా 2లో..

## రాష్ట్రంలో ప్రతిపక్షం అన్నింటా విఫలం

- తుమ్మల లాంటి నేతలను వదులుకోవడం తప్పే
- అందుకే బీఆర్ఎస్ మూడోసారి మట్టి కరిచింది
- ఇప్పుడా బాధ్యతను జాగృతి పోషిస్తుంది
- కవిత సంచలన వ్యాఖ్యలు

**ఖమ్మం(జనంసాక్షి):** రాష్ట్రంలో అధికార పక్షం, ప్రతిపక్షం బాధ్యతగా వ్యవహరించటంలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన బలమైన నేత తుమ్మల నాగేశ్వరావును బీఆర్ఎస్ వదులుకోవడంతోనే మూడోసారి అధికారంలోకి రాకుండా పోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. తుమ్మల

మిగతా 2లో..




## ఎస్ఐ పరుగో పరుగు

రూ.40వేలు లంచం డిమాండ్..

- సొమ్ము తీసుకుంటుండగా ఏసీబీ అధికారులను చూసి పొలాల్లోకి పరుగెత్తిన మెదక్ జిల్లా టేక్మాల్ ఎస్సై రాజేశ్
- పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ జరిపిన అధికారులు
- ఎస్సై ఏసీబీ అధికారులకు చిక్కడంతో స్టేషన్ ఎదుట టపాసులు కాల్చి గ్రామస్థుల సంబరాలు

**టేక్మాల్(జనంసాక్షి):** మెదక్ జిల్లా టేక్మాల్ ఎస్సై రాజేశ్ ఏసీబీ వలకు చిక్కాడు. ఓ కేసు విషయంలో రూ. 40వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు ఎంట్రీ ఇచ్చారు. వారిని చూసిన ఎస్సై పొలాల్లోకి పరుగెత్తాడు. దీంతో అతడిని వెంబడించి పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారిస్తున్నారు. ఎస్సై అధికారులకు చిక్కడంతో పోలీస్ స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో చేరుకున్న స్థానికులు.. పోలీస్ స్టేషన్ ముందు టపాసులు కాల్చారు. లంచగొండి ఎస్ఐని శిక్షించాలని కోరారు.

జనంసాక్షి www.janamsakshi.org
బుధవారం 19.11.2025

# జల సంరక్షణలో తెలంగాణే ఫస్ట్

జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం పురస్కారాలు ప్రదానం చేశారు. జల్ సంచయ్ జన్ భాగీదారీని ఉత్తమంగా అమలు చేసిన రాష్ట్రాలు, జిల్లాలు, స్థానిక సంస్థలకు కేంద్రప్రభుత్వం 100 అవార్డులను ప్రకటించింది. ఇందులో మూడు రాష్ట్రాలు, 67 జిల్లాలు, 6 మున్సిపల్ కార్పొరేషన్లు, ఒక పట్టణ స్థానిక సంస్థ, రెండు భాగస్వామ్య మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రెండు పరిశ్రమలు, మూడు ఎన్జీఓలు, ఇద్దరు దాతలు, 14 మంది నోడల్ అధికారులు ఉన్నారు. క్షేత్రస్థాయిలో జల సంరక్షణలో ప్రజలు, సంఘాలు, కార్పొరేట్ సంస్థలను భాగస్వాములను చేసే లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. రాష్ట్రాలను ఐదు జోన్లుగా విభజించారు. ప్రతి ఒక్కరూ కనీసం 10 వేల కృత్రిమ రీఛార్జి, స్టోరేజ్ నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశిరచారు. ఇందులో రూఫ్‌టాప్ వాన నీటి సంరక్షణ, చెరువులు, కుంటలు, బావుల పునరుద్ధరణ కార్యక్రమాలను చేర్చారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మున్సిపల్ కార్పొరేషన్లను మూడు కేటగిరీలుగా విభజించి అవార్డులు ప్రకటించారు. మొదటి కేటగిరీలో ఎంపికైన వాటికి రూ.2 కోట్లు, రెండో కేటగిరీలో కోటి రూపాయలు, మూడో కేటగిరీలో రూ.25 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. జిల్లాల విభాగంలో కేటగిరీ-1 కింద దక్షిణ జోన్ నుంచి మూడు జిల్లాలను ఎంపిక చేయగా.. ఆ మూడింటినీ తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. ఒక్కో జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున మొత్తం రూ.6 కోట్ల నగదు బహుమతి అందజేసింది. ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలు ఈ నగదు బహుమతిని సాధించాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఏరియాలో జల సంరక్షణ చర్యలు చేపట్టినందుకు.. హైదరాబాద్ మెట్రో కార్పొరేషన్ నీటి సరఫరా, మురుగునీటి బోర్డు మున్సిపల్ కార్పొరేషన్ల విభాగంలో రెండో ర్యాంకు సాధించింది. రూ.2 కోట్ల నగదు బహుమతిని సొంతం చేసుకొంది. ఈ విభాగంలో కేటగిరీ-2లో వరంగల్, నిర్మల్, జనగామ, జిల్లాలు దక్షిణ జోన్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచి రూ.కోటి చొప్పున బహుమతి గెలుచుకున్నాయి.కేటగిరీ-3లో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ 1, 3 ర్యాంకుల్లో నిలిచి.. రూ.25 లక్షల చొప్పున నగదు బహుమతి సొంతం చేసుకున్నాయి. ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కుమురం భీం ఆసిఫాబాద్, మెదక్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలకు నోడల్ అధికారిగా వ్యవహరించిన కేంద్ర జల సంఘానికి చెందిన ఎ.సతీశ్‌కు కూడా అవార్డు దక్కింది.

# ఐ-బొమ్మ కేసు.. రంగంలోకి ఈడీ

నిందితుడి బ్యాంకు ఖాతాల నిర్వహణపై ఈడీ అధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయనున్నారు. ఐ- బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి కేసు దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఐ బొమ్మ సైట్లో బెట్టింగ్ యాప్స్ ప్రకటనలు ప్రదర్శిస్తూ రూ.కోట్లు ఆర్జించాడు. రవికి చెందిన నాలుగు ఖాతాల్లో రూ.20కోట్ల లావాదేవీలను పోలీసులు గుర్తించారు. బెట్టింగ్ యాప్ ప్రకటనల ద్వారా వచ్చిన డబ్బుతో హైదరాబాద్, కరీబియన్ దీవుల్లో ఇళ్లు కొనుగోలు చేసినట్టు దర్యాప్తులో తేలింది. ట్రావెలింగ్, విలాస జీవితం అనుభవించడమే అలవాటు చేసుకున్నాడు. బెట్టింగ్ యాప్ డబ్బుల ద్వారా రెండు నెలలకో దేశం తిరిగాడు. సినిమాల పైరసీ ద్వారా నెలకు రూ.11లక్షల వరకు సంపాదించాడు. వన్ ఎక్స్ బెట్, వన్ విన్ బెట్టింగ్ యాప్‌ల ద్వారా రవికి భారీగా డబ్బు సమకూరింది. యూరోపియన్ దేశాలు తిరగడం తనకు ఇష్టమని, స్నేహితులు, బంధువులతో ఎలాంటి సంబంధాలు లేవని విచారణలో రవి పోలీసులకు తెలిపాడు. అరెస్టు సమయంలో గంటన్నరపాటు డోర్లు తెరవకుండా.. టెలిగ్రామ్ డేటా, మొబైల్ డేటా క్లియర్ చేశాడు. ల్యాప్‌టాప్‌ను బాత్‌రూమ్ రూఫ్ కింద, సెల్ ఫోన్‌ను అల్మారాలో పెట్టినట్టు పోలీసులు గుర్తించారు.ఇమంది రవిని 5 రోజులు కస్టడీకి ఇవ్వాలని నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. కస్టడీ పిటిషన్‌పై విచారణను కోర్టు రేపటికి వాయిదా వేసింది.

ఐ- బొమ్మ రవిని ఎన్‌కౌంటర్ చేయాలి: సి. కల్యాణ్

ఐ- బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవిని ఎన్‌కౌంటర్ చేయాలంటూ నిర్మాత సి. కల్యాణ్ వ్యాఖ్యానించారు. రవి అరెస్టు నేపథ్యంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు.కడుపు మంటతో, బాధతో మాట్లాతున్నానని పేర్కొన్నారు. ఒకవేళ అదే జరిగితే.. ఇలాంటి పనులు చేయాలంటే మరొకరు భయపడతారని అన్నారు. ఎంతగానో శ్రమించి రవిని పట్టుకున్న పోలీసు అధికారులను ఛాంబర్ తరఫున త్వరలో సత్కరిస్తామని చెప్పారు. "నేను తెలుగు ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీగా ఉన్న సమయంలో.. యాంటీ వీడియో పైరసీ సెల్ ఏర్పాటైంది. పైరసీని అరికట్టడం సాధ్యమేనా? అని అప్పుడు చాలామంది సందేహించారు. మన ఇండస్ట్రీని మనం కాపాడుకోవాలన్న బాధ్యతతో దానిని ప్రారంభించాం. కొందరు విశ్రాంత పోలీసు అధికారులు అందులో భాగమయ్యారు. హాలీవుడ్ చిత్రాల పైరసీని అరికట్టాం. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కృషిని స్కాట్లాండ్ పోలీసులు గుర్తించి, ప్రశంసించారు. కొంతకాలం ఫండ్ కూడా పంపించారు. ఆస్ట్రేలియా కేంద్రంగా సినిమాలను పైరసీ చేసిన ఓ వ్యక్తిని పట్టించాం. దేశంలో యాంటీ వీడియో పైరసీ సెల్‌ను నిర్వహిస్తోంది తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఒక్కటే. ఒకానొక సమయంలో దానిని క్లోజ్ చేయాల్సిన పరిస్థితి ఎదురైనా.. కొనసాగిస్తున్నాం" అని వివరించారు.

# 21న జాతీయ రహదారుల దిగ్బంధం

ఈ సందర్భంగా రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని కేటీఆర్‌కు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రైతన్నలకు ఇచ్చిన హామీలన్నింటిని పక్కన పెట్టిందని, కనీసం పండిన పంటలను అమ్ముకోవడంలో కూడా సహకారం అందించడం లేదని తెలిపారు. రైతన్నల సమస్యల పరిష్కారానికి పోరాటాలు మాత్రమే మార్గం. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు అన్ని రకాల పోరాటాలను చేసేందుకు మా పార్టీ సంసిద్ధంగా ఉన్నది. పార్టీ రైతన్నలకు అండగా ఉంటుంది. మొన్న ఆత్మహత్య చేసుకున్న హడావు దీపక్ కుటుంబానికి పార్టీ తరఫున కొంత ఆర్థిక సహాయం చేస్తాం. వెంటనే ప్రభుత్వం పంటల కొనుగోలు కోసం ఫింగర్ప్రిం÷-రట్ల నిబంధన, కేవలం 12 శాతం తేమ ఉండాలన్న నిబంధన, ఎకరానికి ఏడు క్వింటాల మాత్రమే కొంటామన్న నిబంధన ఇవన్నీటిని వెంటనే ఎత్తివేయాలి. కిసాన్ కపాస్ యాప్ సంబంధం లేకుండా పంట కొనుగోలు చేయాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.రైతులతో మాట్లాడిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు అని అంటే ఎందుకు ఈ రోజు అదిలాబాద్ మార్కెట్ యార్డ్‌ని బంద్ పెట్టారు. మార్కెట్ యార్డులో రైతన్నలను కలుస్తామంటే ప్రభుత్వం ఎందుకు అడ్డంకులు కల్పించింది. చరిత్రలో ఎప్పుడు లేనంత దారుణంగా పత్తి కొనుగోలు సోయా రైతుల పరిస్థితి మారింది. కిసాన్ కపాస్ మొబైల్ అప్లికేషన్ అని తీసుకువచ్చి దాని ద్వారానే పంటలు కొంటాం అంటున్నారు. మరి కనీసం ఫోన్లు లేని రైతన్నల పరిస్థితి ఏమిటి? ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ నెట్‌వర్క్ కనెక్టివిటీ అన్నిచోట్ల ఉండదు. మరి ఇలాంటి సందర్భంలో రైతన్నల పరిస్థితి ఏమిటో చెప్పాలి అని కేటీఆర్ అడిగారు. రాష్ట్రంలో భారీగా అకాల వర్షాలు పడినందు వలన పత్తి తేమశాతం ఎక్కువగా ఉన్నది. చలి కూడా గతంలో కంటే ఎక్కువగా ఉన్నది అందుకే పత్తిలో తేమశాతం ఉన్నది. గతంలో మా ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్రం పైన ఒత్తిడి తీసుకొచ్చి 20 నుంచి 22 శాతం తేమ ఉన్న పంటను కూడా కొనిపించాము. కానీ ఇప్పుడు కేవలం 12 శాతం తేమ ఉంటే కూడా కొనుగోలు చేయము అని చేతులు ఎత్తేసింది. రైతులు పంటలు అమ్ముకోలేక ఆత్మహత్యలు చేసుకుంటే కూడా పట్టించుకునే వారు లేరు కనీసం అడిగే వారు కూడా లేరు. కనీసం ఇప్పటిదాకా లక్ష క్వింటాళ్ల పంట కూడా కొనలేదు. ప్రైవేట్ వాళ్లతో ప్రభుత్వం కుమ్మక్కై రైతుల పంటను దోచుకుంటున్నది అని అనిపిస్తున్నది. లేకుంటే రైతన్నలకు ఎన్ని సమస్యలు వచ్చిన స్పందించకుండా ఉండదు అని కేటీఆర్ పేర్కొన్నారు. కనీస మద్దతు ధర రూ. 8,100 రైతుకు దక్కాల్సింది కానీ ఐదారు వేలు కూడా దక్కడం లేదు. సోయాబీన్ అమ్మకానికి సంబంధించి ఫింగర్ ప్రింట్ కావాలని చెప్పి ఒక నిబంధన పెట్టి అనేక ఇబ్బందులు గురి చేస్తున్నారు. సొంత తల్లిదండ్రుల పేరు మీద ఉన్న పంటలు బిడ్డలు అమ్మాలంటే కూడా కొనుగోలు చేయడం లేదు. పత్తి పంట ఎకరానికి కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే కొంటామనే ఒక అర్థరహితమైన నిబంధన పెట్టారు.

## ఆదివాసీ యోధుడు, మావోయిస్టు నేత

# హిడ్మా ఎన్‌కౌంటర్

కాగా వ ంరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోనూ ఎదురు కాల్పులు జరిగాయి. మంగళవారం ఉదయం ఎర్రబో రు ప్రాంతంలో మావోయిస్టులు- భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెం దాడు. ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు కొనసాగు తున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు.

**17 ఏళ్ల వయసులో ఉద్యమం వైపు..**

వరుస ఎదురుదెబ్బలతో ఉక్కిరిబిక్కిరవుతున్న మావోయిస్టులకు తాజాగా మరో గట్టి షాక్ తగిలింది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత మద్వి హిడ్మా అలియాస్ సంతోష్ మృతి చెందాడు. మావోయిస్టు పార్టీలో భీకర గెరిల్లా దాడులకు వ్యూహకర్తగా పేరొందిన హిడ్మా మృతి చెందడం.. భద్రతాదళాలకు భారీ విజయనే చెప్పాలి. భద్రతా బలగాలపై కనీసం 26 సాయుధ దాడులకు ఇతడు పథక రచన చేసినట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పూవర్తి గ్రామానికి చెందిన హిడ్మాకు పార్టీలో విలాస్, హిడ్మాల్, సంతోష్ అనే పేర్లు ఉన్నాయి. మావోయిస్టు ఉద్యమం వైపు ఆకర్షితుడై 17 సంవత్సరాల వయసులోనే పార్టీలో చేరాడు. మురియా తెగకు చెందిన హిడ్మాకు ఇంగ్లీష్, హిందీ, గోండు, తెలుగు, కోయ, బెంగాలీ భాషల్లో పట్టుంది. దండకారణ్యంలో పార్టీశ్రేణుల్ని ముందుండి నడిపించడంలో ఆరితేరారు. భారీ దాడులకు వ్యూహకర్తగా గుర్తింపు ఉంది. అడవుల్లోని కేంద్ర బలగాల క్యాంపులపై మెరుపు దాడులు నిర్వహించడంలో నిష్ణాతుడు. ఈ క్రమంలోనే మిలిటరీ దాడులకు మారుపేరైన పీఎల్‌జీఏలో ఒకటో బెటాలియన్‌కు సారథ్యం వహిస్తున్నారు. ప్రతి భారీ దాడిలో స్వయంగా పాల్గొంటూ కేంద్ర బలగాలకు మోస్ట్ వాంటెడ్‌గా మారారు. కొంతకాలం క్రితం కేంద్ర కమిటీలో స్థానం సంపాదించాడు. సాధారణంగా ఈ కమిటీలో తెలుగు రాష్ట్రాల వారు అత్యధికంగా ఉంటారు. కానీ, సుక్మా నుంచి ఈ స్థానంలోకి వెళ్లిన తొలి వ్యక్తి ఇతడే. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) నంబర్ 1 బెటాలియన్‌కు హిడ్మా నేతృత్వం వహిస్తున్నాడు. దీనిలోని సభ్యులు అత్యాధునిక ఆటోమేటిక్ ఆయుధాలను వినియోగిస్తారు. ఈ బెటాలియన్‌లో 350 వరకు ఉంటారని సమాచారం. దళాలపై దాడులు చేశాక.. అపహరించిన అత్యాధునిక ఆయుధాలు, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లను ఈ బెటాలియన్ ఎక్కువగా వాడుతుంటుంది. వీరు పూర్తిగా యూనిఫామ్‌లో ఉంటారని సమాచారం. హిడ్మా నేతృత్వంలో జరిగే దాడుల్లో భద్రతా దళాలకు జరిగే నష్టంతో పోలిస్తే మావోల వైపు 10శాతం కంటే తక్కువ ప్రాణ నష్టం ఉంటుందనే పేరుంది. రెండు దశాబ్దాలుగా ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఇతడి ప్రమేయంతోనే చాలా దాడులు జరిగినట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి. చింతల్నార్, డోర్నాపాల్, తాడిమెట్ల, మినప.. ఇలా భారీగా ప్రాణనష్టం జరిగిన అనేక ఆపరేషన్లలో హిడ్మా స్వయంగా పాల్గొని 200 మందికి పైగా పోలీసు సిబ్బంది మృతికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమయ్యాడని సమాచారం. యుద్ధ నైపుణ్య మెలకువల్ని కేడర్‌కు అలవోకగా నూరిపోస్తుంటాడనే పేరుంది. కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించే పోలీసు బలగాలపై, సీఆర్పీఎఫ్ శిబిరాలపై మెరుపుదాడులు నిర్వహించడంలో కీలకంగా వ్యవహరిస్తుంటాడు. ఆర్అండ్‌డీ విభాగం ఇతడి కనుసన్నల్లోనే పనిచేస్తుంది.

**హిడ్మా జరిపిన దాడుల్లో కొన్ని..**

2010లో దంతెవాడలో జరిగిన దాడిలో 76 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు 2013లో జైరామ్ ఘాటీలో జరిపిన మెరుపుదాడిలో 27 మంది మరణించారు. వీరిలో పలువురు కాంగ్రెస్ నాయకులు కూడా ఉన్నారు. 2021లో సుక్మా-బీజాపుర్‌లో జరిగిన మెరుపుదాడిలో 22 మంది భద్రతా సిబ్బంది మృతిచెందారు. హిడ్మా స్థానిక ఆదివాసీ తెగకు చెందిన వ్యక్తి కావడంతో అతడికి గ్రామస్థుల మద్దతు లభించేది. దీంతో బలమైన ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొన్నాడు. అతడు ఉన్న ప్రాంతానికి కొన్ని కిలోమీటర్ల అవతల భద్రతా దళాల కదలికలు కూడా అతనికి తెలిసిపోతాయి. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశాకు తేలిగ్గా వెళ్లే జంక్షన్‌లో ఉండటం కూడా అతనికి కలిసి వస్తోందని గతంలో ఓ భద్రతా అధికారి వెల్లడించారు. కేవలం 7వ తరగతి వరకే చదివిన హిడ్మా ఇంగ్లిష్ మాత్రం చక్కగా మాట్లాడగలడని 2015 ఫిబ్రవరిలో అతన్ని ఇంటర్వ్యూ చేసిన ఓ విలేకరి పేర్కొన్నారు.

**కర్రెగుట్టల దాడితో ఆంధ్రాకు వచ్చి..**

హిడ్మా కోసం కొన్నేళ్లుగా ఛత్తీస్‌గఢ్ పోలీసుల తోపాటు సీఆర్పీఎఫ్ కోబ్రా బలగాలు, తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలు విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో కర్రెగుట్టల నుంచి మొదలుకొని అబూజ్‌మడ్ పర్వతాలతోపాటు నేషనల్ పార్కులో భద్రతా దళాలు అణువణువూ జల్లెడ పట్టాయి. దండకారణ్యంలో వేలాదిగా సాయుధ బలగాలు కూంబింగ్ నిర్వహించగా.. అనేకమంది మావోయిస్టు అగ్రనేతలు వరుసగా ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు హిడ్మా కూడా తన బెటాలియన్‌తో కలిసి నేషనల్ పార్క్‌లోనే ఉన్నట్లు నిఘా వర్గాలు అనుమానించాయి. ఆ సమయంలో అతడి తాజా ఫొటో ఒకటి బయటకు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది.అయితే, జనవరిలో భద్రతా బలగాలు తన స్థావరాన్ని చుట్టుముట్టడానికి కొన్ని గంటల ముందే హిడ్మా అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు నిఘా వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత సమీపంలోని ఓ కొండల ప్రాంతంలో నక్కినట్లు తెలిసింది. ఓ సమయంలో హిడ్మా లొంగిపోనున్నాడనే ప్రచారం కూడా జరిగింది. భద్రతా బలగాల కూంబింగ్ నిరంతరం కొనసాగుతుండటంతో హిడ్మా బృందం.. ఛత్తీస్‌గఢ్ నుంచి మకాం మార్చేందుకు ఆంధ్రా సరిహద్దులను పరిశీలించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.



## ఆంధ్రాలో మావోయిస్టుల అలజడి

**రంపచోడవరం(జనంసాక్షి):** అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారని ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్‌చంద్ర లడ్డా తెలిపారు. మంగళవారం ఉదయం 6.30-7.00 గంటల మధ్య భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయని చెప్పారు. ఎన్‌కౌంటర్ వివరాలను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్‌తో కలిసి ఆయన వెల్లడించారు. గత రెండు రోజులుగా ఇంటెలిజెన్స్ సమాచారంతో గాలింపు చర్యలను విస్తృతంగా చేపట్టామని మహేశ్‌చంద్ర లడ్డా తెలిపారు. కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోందని చెప్పారు. మావోయిస్టుల నుంచి వివిధ రకాల ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.మరోవైపు కృష్ణా జిల్లాతో పాటు విజయవాడ, కాకినాడలో మొత్తం 31 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఏడీజీ మహేశ్ చంద్ర లడ్డా తెలిపారు. వీరిలో 9 మంది కేంద్ర కమిటీ సభ్యులు ఉన్నారని వివరించారు.

# వాట్సాప్‌లో మీ సేవ పోర్టల్

వాట్సాప్‌లోనే మీ-సేవ సర్టిఫికెట్లు అందనున్నాయి. వాట్సాప్ మీసేవ సర్వీసులను(మీ సేవ సర్వీసెస్ ఆన్ వాట్సాప్) బంజారాహిల్స్ లోని తాజ్ కృష్ణలో మంత్రి శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. 38 ప్రభుత్వ విభాగాలకు చెందిన 580కి పైగా మీ సేవా సర్వీసులను వాట్సాప్ ద్వారా పొందే విధంగా ఏర్పాట్లు చేశారు. మెటా, మీ సేవ సంయుక్త భాగస్వామ్యంతో ఈ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. మీ సేవ సెంటర్స్ చుట్టూ తిరిగే పని లేకుండా సేవలను సులభతరం చేసింది తెలంగాణ ప్రభుత్వం.. వినియో గదాలు వాట్సాప్ లోనే సర్టిఫికెట్స్ పొందే అవకాశం కల్పించింది. మీ-సేవ సెంటర్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత దానికి సంబంధించిన తాజా అప్‌డేట్స్ అన్నీ వాట్సాప్‌లోనే చెక్ చేసుకోవచ్చు. దరఖాస్తు చేసిన సర్టిఫికెట్ ఆమోదం పొందితే ఆ సర్టిఫికెట్‌ను వాట్సాప్ ద్వారానే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు.

# పదేళ్ల క్రితం నిర్వహించిన గ్రూప్-2 ఫలితాలు రద్దు

**హైదరాబాద్(జనంసాక్షి):**పదేళ్ల క్రితం నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ఎంపిక జాబితాను తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. 2015- 16లో నిర్వహించిన గ్రూప్-2లో ఎంపికైన వారి జాబితాను రద్దు చేస్తూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. హైకోర్టు ఆదేశాలను టీజీపీఎస్సీ ఉల్లంఘించిందని, పరిధిదాటి వ్యవహరించిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పునర్ మూల్యాంకనం చేసి అర్హుల జాబితా నిర్ణయించాలని, ఈ ప్రక్రియ 8 వారాల్లో ముగించాలని హైకోర్టు ఆదేశించింది.వైట్నర్, దిద్దుబాటు ఉన్న జవాబుపత్రాల మూల్యాంకనంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ట్యాంపరింగ్ జరిగినట్లు తెలిసినా.. మూల్యాంకనం చేయడం చట్టవిరుద్ధమని కోర్టు పేర్కొంది. సాంకేతిక కమిటీ సూచన ప్రకారం పునర్మూల్యాంకనం చేయాలని ఆదేశించింది. 2015లో టీజీపీఎస్సీ గ్రూప్-2 నోటిఫికేషన్ జారీ చేసింది. 2016 నవంబర్‌లో రాతపరీక్షలు నిర్వహించింది. 2019లో గ్రూప్-2 నియామకాలు చేపట్టింది. దీనిపై పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక తీర్పు వెలువరించారు.



నెల్లూరులో మావోయిస్టులు తలదాచుకున్నది ఈ భవనంలోనే..

# చిన్నారుల మిస్సింగ్ కేసుల పెరుగుదల ఆందోళనకరం

- దత్తత ప్రక్రియ నిబంధనలు కఠినంగా ఉన్నాయి
- అందుకే పిల్లలు లేనివారు చట్టవిరుద్ధమైన
- మార్గాలను ఎంచుకుంటున్నారు: సుప్రీం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశంలో చిన్నారుల మిస్సింగ్ కేసులు రోజురోజుకు పెరుగుతుండడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి 8 నిమిషాలకు ఒక చిన్నారి తప్పిపోతున్నట్లు వచ్చిన మీడియా కథనాన్ని ప్రస్తావిస్తూ.. మిస్సింగ్ కేసులు దేశంలో తీవ్రమైన సమస్యగా మారుతున్నాయని పేర్కొంది. దత్తత ప్రక్రియ కఠినంగా ఉన్నందువల్ల.. పిల్లలు లేనివారు చట్టవిరుద్ధమైన మార్గాలను ఎంచుకుంటున్నారని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. సంక్లిష్టంగా ఉన్న దత్తత ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, అక్రమ దత్తతను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశంలో పిల్లలను దత్తత తీసుకునే విధానం ఎక్కువయ్యిందని.. దత్తత ముసుగులో చిన్నారుల అక్రమ రవాణా, అమ్మకాలు పెరిగిపోతున్నాయని ఓ స్వచ్ఛంద సంస్థ వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

# తెలంగాణ రైజింగ్ ఉత్సవాల్లో పెద్దఎత్తున పాలసీలు

లక్ష్యంగా 13 శాతం జీడీపీ పెరుగుదల టార్గెట్ గా 2047 రోడ్ మ్యాప్ ను విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం 10 శాతం చొప్పున పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ ను దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన విద్యుత్తు సరఫరా లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు.మొదటి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ఏ కార్యక్రమాలు చేసిందో వివరించాం రెండవ సంవత్సరం చేసిన కార్యక్రమాలు వివరించడం తోపాటు తెలంగాణ రాష్ట్రం పట్ల మా కల ఏంటి, ఆ కలను సాధించేందుకు ఎలాంటి ప్రణాళికలతో ముందుకు పోతున్నాం అనేది తెలంగాణ రైసింగ్ ఉత్సవంలో వివరించబోతున్నామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్డు ఔటర్ రింగ్ రోడ్డును కలుపుతూ అనేక ఇండస్ట్రియల్ కారిడార్ల నిర్మాణం, మూసి పునర్జీవనం వంటి అంశాలను వివరించి ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడిదారులను పెద్ద ఎత్తున ఆకర్షించబోతున్నామని తెలిపారు. హైదరాబాద్ మహానగరం తో పాటు తెలంగాణ రాష్ట్రం వ్యూహాత్మకంగా, వాతావరణం, భాష, భూమి, తక్కువ ధరలకే నైపుణ్యంతో కూడిన మానవ వనరులు, బలమైన విద్యుత్ సరఫరా వ్యవస్థ వంటి అంశాలను వివరించి పెట్టుబడిదారులను ఆకర్షించినట్టు తెలిపారు. బ్యాంకర్లు కార్పొరేట్ సంస్థలతోపాటు స్వయం సహాయక సంఘాలు, సూక్ష్మ మధ్యతరహా, చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలని డిప్యూటీ సీఎం కోరారు. ఈ రెండు రంగాలను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి లభించడంతోపాటు సంపద సృష్టించబడుతుంది అన్నారు, తద్వారా జిడిపి పెరుగుతుంది అని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యం అంశాలపై ప్రధానంగా దృష్టి సారించిందని బ్యాంకర్లు సి ఎస్ ఆర్ నిధులను చీఫ్ సెక్రటరీ మొదలు కలెక్టర్ వరకు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నీ సంప్రదించి ఈ రంగాల్లో సిఎస్ఆర్ నిధులను ఖర్చు చేయాలని సూచించారు.



# వికసిత్ భారత్ కోసం కృషిచేద్దాం

**హైదరాబాద్(జనంసాక్షి):**హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంతో పాటు కొత్త నగరాన్ని నిర్మించాలని భావిస్తున్నట్లు సిఎం రేవంత రెడ్డి వెల్లడించారు. ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 పేరుతో కొత్త ప్రణాళిక రూపొందించాం. ప్ర పంచంలోనే ఆర్థికంగా ఎదిగిన దేశంగా భార త్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోం ది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల్లో తె లంగాణ కూడా భాగమవుతుం దన్నారు. అ యితే తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రా జెక్టులకు కేంద్రం త్వరగా అనుమతులు మంజూ రు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ప్రా జెక్టులకు వేగంగా అనుమతులు లభిస్తే హైద రాబాద్ అభివృద్ధి చెందుతుందని.. తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థలో మరింత కీలకంగా మారుతుం దని చెప్పారు. హోటల్ ఐటీసీ కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాం తీయ సమావేశంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే దేశాభివృద్ధి మరిం త వేగవంతమవుతుంది. కేంద్రం నిర్దేశించుకున్న 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో రాష్ట్ర వాటా 10 శాతం ఉండాలని భావిస్తున్నట్లు ఈ సందర్భంగా సిఎం వెల్లడించారు. జీడీపీలో ప్రధానంగా 5 మెట్రోపాలిటన్ నగరాలైన దిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయి. కేంద్రం సహకరించకుంటే రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. గుజరాత్‌కు మోదీ ఇచ్చిన సహకారాన్నే మేం తెలంగాణకు కోరుతున్నాం అని వివరించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం అని అన్నారు. తరవాత అభివృద్ధి గురించే మాట్లాడుతామని అన్నారు. అభివృద్ధిలో దూసుకు వెళ్లాలలన్నదే తమ అభిమతమని అన్నారు. మా పోటీ ఇతర రాష్ట్రాలతో కాదని, టోక్యో, సింగపూర్ లాంటి వాటితోనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ఏపీ మంత్రి పొంగూరు నారాయణ, గుజరాత్ మంత్రి కనుభాయ్ మోహన్‌లాల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

## కోటి మంది మహిళలకు కోటి చీరలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించనున్నారు. చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేస్తున్నారు. ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఉత్పత్తికి అనుగుణంగా రెండు దశలుగా చీరల పంపిణీ చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. తొలి దశలో గ్రామీణ ప్రాంతాల్లో చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందిరా గాంధీ జయంతి నుంచి డిసెంబరు 9 తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. రెండవ దశలో పట్టణ ప్రాంతాల్లో మార్చి 1నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చీరల నాణ్యత విషయంలో రాజీపడొద్దని, మహిళలకు నాణ్యమైన చీరలను అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సాంకేతికను వినియోగించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా గంటలకు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు.

## శాసనమండలి పునరుద్దరణ పనులు పరిశీలించిన సీఎం

**హైదరాబాద్(జనంసాక్షి):** శాసనమండలి భవనం పనులు చివరిదశకు చేరాయి. పాత శాసనసభ భవనాన్ని అందంగా తీర్చి ముస్తాబు చేస్తున్నారు. దీంట్లో మండలి కార్యకలాపు జరుగనున్నాయి. దీంతో రెండు సభలు ఒకే ప్రాంగణంలోకి అందుబాటులోకి రానున్నాయి. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి అసెంబ్లీ ఆవరణ లోని శాసన మండలి మరమ్మతు పనులు పరిశీలి స్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. పనులను సమీక్షించిన సిఎం పలు సూచనలు చేశారు. తుదిదశకు చేరుకున్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు మండలిని జూబ్లీహాల్‌లో నిర్వహిస్తున్నారు. దీంతో మండలికి వెళ్లాలంటే మంత్రులకు ఇబ్బందికరంగా మారింది.

# కామన్‌వెల్త్ లర్నింగ్‌తో ఓపెన్ వర్సిటీ ఒప్పందం

**హైదరాబాద్(జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ ఏర్పాటుకు కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ తో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవగాహన ఒప్పందంతో ప్రముఖ డిజిటల్ విశ్వవిద్యాలయంగా ఓపెన్ వర్సిటీ అభివృద్ధి చెందనున్నది. బోధన, అభ్యాసం, పరిశోధనలను మెరుగుపరచడానికి అత్యాధునిక డిజిటల్ హబ్‌గా పనిచేస్తుంది. టెక్నాలజీ ద్వారా నాణ్యమైన విద్యను అందించనున్నది. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలను బలోపేతం చేయడంతో పాటు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఒక నాలెడ్జ్ హబ్ గా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ మేరకు దాని సిఇవో అధ్యక్షుడు పీటర్ స్కాట్ కు ముఖ్యమంత్రి వివరించారు. ఈ సమావేశంలో కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు పీటర్ స్కాట్, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, వైస్ చాన్స్ లర్ ఘంటా చక్రపాణి, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ప్రతిపక్షం అన్నింటా విఫలం

బయటకు వెళ్లడంతోనే రాష్ట్రంలో గులాబీ పార్టీ పరిస్థితి తలకిందులైందన్నారు. తుమ్మల లాంటి నేతను బీఆర్ఎస్ వదులుకోవడం నూటికి నూరు శాతం పెద్ద తప్పే అని అన్నారు. తెలంగాణలో ప్రతిపక్షం ఫెయిల్ అయ్యిందని.. తన బాధ్యతను నిర్వర్తించలేకపోతోందని వ్యాఖ్యలు చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను భవిష్యత్తులో తాము పోషించబోతున్నామన్నారు. కొత్త రాజకీయ పార్టీ గురించి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. తనను ఏ విధంగా పార్టీ నుంచి బయటకు పంపారనే విషయాన్ని తెలియజేశారు. రాజకీయ పార్టీ గురించి ఇప్పుడప్పుడే ఆలోచన చేయటం లేదని కవిత అన్నారు. బీఆర్ఎస్‌లో నుంచి తనను సస్పెండ్ చేశారని.. ఆ పార్టీతో తనకెటువంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. కుట్రతో బీఆర్ఎస్ నుంచి తనను బయటికి పంపించారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది కుట్ర చేసి తనను.. తన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీకి దూరం చేశారన్నారు. తన జీవితంలో చిన్న పొరపాటు కూడా చేయలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తనకు ఎక్కడా ఎటువంటి అవకాశం ఇవ్వలేదని.. కనీసం ఒక టీచర్ పోస్ట్ కూడా ట్రాన్స్ఫర్ చేయించుకోలేకపోయానని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌లో జాగృతి కార్యకర్తలకు అన్యాయం చేశారని... కనీస గుర్తింపు ఇవ్వలేదని కవిత సంచలన కామెంట్స్ చేశారు. కవిత ఇంకా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులు ఊదిన జిల్లా ఖమ్మం జిల్లా అని జాగృతి అధ్యక్షురాలు అన్నారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఖమ్మం జిల్లా పూర్తిగా మారిపోయిందని గుర్తుచేశారు. వెంగళరావు హయాంలో జిల్లా విశేషంగా అభివృద్ధి చెందిందన్నారు. ఆ తరువాత పెద్దలు తుమ్మల నాగేశ్వరావు ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ఖమ్మం అభివృద్ధి కోసం ఎవరి ప్రయత్నం వారు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదని అన్నారు. ఇంకా ఖమ్మం అభివృద్ధి చెందాల్సి ఉందని.. సీతారామ ప్రాజెక్టును కూడా వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక తెలంగాణ రావాలన్నదే తన ఆశయమని.. అవకాశం, అధికారం, ఆత్మగౌరవం కోసమే తన పోరాటమని కవిత స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి విప్లవాత్మక మైన మార్పులు రావాలని.. అన్ని వర్గాలకు అధికారం అందాలని ఆకాంక్షించారు. బీసీలకు భిక్షం వేయొద్దని.. భిక్షం వేస్తే తీసుకోవడానికి వాళ్ళు బిచ్చగాళ్ళు కాదన్నారు.

# సాంఘిక దురాచారాలపై సంఘటితంగా పోరాడాలి

- సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి పిలుపు
- ప్రజా భవన్ లో సీఎం ప్రజావాణి లీగల్ క్లినిక్ ప్రత్యేక కార్యక్రమం
- రాష్ట్ర వ్యాప్తంగా 55 బాధిత కుటుంబాల హాజరు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** శాస్త్ర సాంకేతిక రంగంలో దూసుకుని వెళ్తున్న ప్రస్తుత ఆధునిక కాలంలోనూ దళితులు, గిరిజనులు, మహిళల పట్ల వివక్షత కొనసాగడం బాధాకరమని, సాంఘిక దురాచారాలపై సంఘటితంగా పోరాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఎం ప్రజావాణి ఇన్చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో సీఎం ప్రజావాణి, దళిత స్త్రీ శక్తి సంస్థ సంయుక్తంగా నిర్వహించిన లీగల్ క్లినిక్ ప్రత్యేక కార్యక్రమంలో చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలు, మహిళల పట్ల జరుగుతున్న వివక్షత, అత్యాచారాలకు గురైన మహిళల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని, పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలు, మహిళల పట్ల జరిగిన దాడులు, అన్యాయాలను మానవతా దృక్పథంతో పరిష్కరించి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు చేపడుతామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 55 మంది బాధితులు వచ్చి తమ సమస్యలు చెప్పి పునరావాసం కల్పించాలని, పరిహారం ఇప్పించాలని, నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సమావేశంలో కోరారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ఎన్ఆర్ఐ అడ్వైజర్ కమిటీ చైర్మన్ అంబాసిడర్ వినోద్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ క్షితిజ, గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ కమిషనర్ సర్వేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, విజయేందర్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సత్యనారాయణ, మూడు పోలీస్ కమీషనరేట్స్ నుంచి సీనియర్ పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం ప్రజావాణిలో 298 దరఖాస్తులు



మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 298 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 90, రెవెన్యూ శాఖకు సంబంధించి 54, ఇందిరమ్మ ఇండ్ల కోసం 90, మున్సిపల్ శాఖకు 17, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 45 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# చారిత్రక విశేషాలు అరచేతిలో..!

- క్యూఆర్ కోడ్ స్కాన్ తో కోటలోని సమస్త కట్టడాల సమాచారం
- కేంద్ర పురావస్తు శాఖ సాంకేతిక చర్యకు మంచి స్పందన



**వరంగల్ ఈస్ట్, నవంబర్ 18 (జనం సాక్షి) :** చారిత్రక ఖిలావరంగల్ కోటను సందర్శించే పర్యాటకులు ఇకపై కాకతీయుల చరిత్ర, కోట విశేషాలను సులభంగా తెలుసుకునేందుకు వీలుగా కేంద్ర పురావస్తుశాఖ కీలక చర్యలు చేపట్టింది. కోటలోని కట్టడాల వద్ద తాజాగా శాశ్వత ప్రాతిపదికన క్యూఆర్ (క్యూఆర్) కోడ్‌లతో కూడిన పోల్స్‌ను ఏర్పాటు చేశారు. గతంలో తాత్కాలికంగా కట్టడాలపై అతికించిన క్యూఆర్ కోడ్‌లకు బదులుగా, ఇప్పుడు ప్రత్యేక లోహంతో తయారు చేసిన శాశ్వత పోల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మొదటి పోల్‌ను చారిత్రక కీర్తి తోరణాల నడుమ బిగించారు.?పర్యాటకులు తమ మొబైల్ ఫోన్ లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో సమాచారం తెలుసుకునే వెసులుబాటును కేంద్ర పురావస్తు శాఖ కల్పించింది. ఇకనుంచి పర్యాటకులు తమ వెంట తెచ్చుకున్న ఒక ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ తో కోటలోని అన్ని చారిత్రక కట్టడాలు, ఆలయాల విశేషాలు, చరిత్రను స్వతహాగా తెలుసుకునేందుకు క్యూ ఆర్ కోడ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి జిల్లాలో లేదా కోటలో గాని పర్యాటకులు సెలెక్ట్ చేసుకున్న కట్టడాలను వీక్షించేందుకు గూగుల్ మ్యాప్ ద్వారా లొకేషన్ కు వెళ్లే మార్గం, దూరం వంటి వివరాలు తెలుసుకోవచ్చు. కేంద్ర పురావస్తుశాఖ తీసుకున్న ఈ సాంకేతిక చర్యకు మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా విదేశీ పర్యాటకులు ఈ క్యూఆర్ కోడ్‌ల ద్వారా చరిత్ర తెలుసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. స్విట్జర్లాండ్ నుండి మంగళవారం వరంగల్ కోట సందర్శనకు వచ్చిన పర్యాటకులు కూడా, తాజాగా ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ల ద్వారా కోట చరిత్రను తెలుసుకున్నారు. గైడ్ సహకారం లేకుండానే చరిత్రను ఆలయాల కట్టడాల విశేషాలు తెలుసుకొని సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు.ఖిలా వరంగల్ కోటలో చరిత్రను, ఆధునిక సాంకేతికతను మేళవించిన ఈ కొత్త ప్రయత్నం పర్యాటక రంగానికి మరింత ఊపునిస్తుందని స్థానికులు, పర్యటకులు భావిస్తున్నారు.

# బూటకపు ఎన్‌కౌంటర్లతో మానవ హననం

- కేంద్రానివి జంగిల్‌రాజ్ విధానాలు: కూనంనేని

**హైదరాబాద్, నవంబర్18 (జనంసాక్షి) :** మావోయిస్టులను చంపుకుంటూ పోవడమంటే మానవ హననం తప్ప మరొకటి కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు జంగిల్ రాజ్ పరిపాలనకు పరాకాష్ట అని పేర్కొన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల పోలీసులు కూడా ఇందులో పావులుగా మారారని ఆయన మండిపడ్డారు. ఈ రోజు మారేడుమిల్లిలో జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్, అంతకుముందు మావోయిస్టులపై జరిగిన ఎన్‌కౌంటర్స్ మొత్తం ఫేక్ అని కూనంనేని అన్నారు.బూటకపు ఎన్ కౌంటర్స్‌తో మనుషులను చంపుకునే వ్యవస్థ ప్రపంచంలో ఎక్కడా లేదని కూనంనేని సాంబశివ రావు ఫైర్ అయ్యారు. మావోయిస్టులు ఏదైనా నేరాలు చేసివుంటే వారిని అరెస్టు చేసి, చట్టబద్దంగా విచారణ జరిపించాలే తప్ప ఇలాంటి ఫేక్ ఎన్‌కౌంటర్‌లు చేయడం విచారణకరమన్నారు. మావోయిస్టులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపించాలని కూనంనేని సాంబశివ రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నిండుగర్భిణీ మృతి.. తట్టుకోలేక భర్త ఆత్మహత్య

- శోకసంద్రంలో కుటుంబం

**హైదరాబాద్, నవంబరు18 (జనంసాక్షి) :** సంతానం కలగాలని ఐవీఎఫ్ చికిత్స తీసుకుని, కవల పిల్లల కోసం ఆనందంగా ఎదురుచూస్తున్న ఆ దంపతుల జీవితం, కొద్ది గంటల్లోనే విషాదాంతమైంది. కడుపులోనే కవలలు కన్నుమూయడంతో ఆ షాక్‌కు తట్టుకోలేక నిండు గర్భిణి అయిన భార్య కూడా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. అయితే ప్రేమగా చూసుకున్న భార్య, కలలుగన్న కవలలు కనుమరుగు కావడంతో ముత్యాల విజయ్ అనే యువకుడి గుండె పగిలిపోయింది. శోకసంద్రంలో మునిగిన ఆ భర్త తన జీవితం ఇక శూన్యమని భావించి, శంషాబాద్‌లోని తమ ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడిన హృదయ విదారక ఘటన ఆ ప్రాంతాన్ని కన్నీటిలో ముంచేసింది. బెంగళూరుకు చెందిన ముత్యాల విజయ్ (40), అతని భార్య శ్రావ్య (35) ఏడాదిన్నర కిందట శంషాబాద్‌కు వలస వచ్చి స్థిరపడ్డారు. విజయ్ ఎయిర్‌పోర్టులో ఉద్యోగం చేస్తున్నాడు. సంతానం లేని ఈ దంపతులు ఐవీఎఫ్ చికిత్స తీసుకోవడంతో భార్య గర్భం దాల్చారు. అందులోనూ కవలలు పెరుగుతున్నారని తెలియడంతో వారి ఆనందానికి అవధులు లేవు. దాదాపు ఎనిమిది నెలల గర్భిణి అయిన శ్రావ్యతో ఆ ఇల్లు సంతోషంతో నిండిపోయింది. కవలల రాక కోసం ఇద్దరూ ఎన్నో ప్రణాళికలు వేసుకున్నారు. అయితే, 16వ తేదీ రాత్రి, శ్రావ్యకు అకస్మాత్తుగా కడుపు నొప్పి మొదలైంది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే అత్తాపూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు చెప్పిన విషయం ఆ దంపతులకు పిడుగుపాటు లాంటిది. గర్భంలో పెరుగుతున్న కవలలు ఇద్దరూ మృతి చెందారని వైద్యులు ధృవీకరించారు. ఈ వార్త తెలుసుకుని తట్టుకోలేక శ్రావ్య అక్కడే స్పృహ కోల్పోయింది. మెరుగైన వైద్యం కోసం ఆమెను గుడిమల్కాపూర్‌లోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూనే శ్రావ్య తుదిశ్వాస విడిచింది. ప్రేమగా చూసుకున్న భార్య, కలలుగన్న కవలలు కొద్ది గంటల వ్యవధిలోనే దూరమవడంతో భర్త ముత్యాల విజయ్ పూర్తిగా కుంగిపోయాడు. తన జీవితాన్ని ముందుకు నడపడానికి ఉద్దేశించిన నాలుగు ప్రాణాలు కళ్లముందే కనుమరుగు కావడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. ఈ తీరని బాధతో శంషాబాద్‌లోని తమ ఇంట్లోనే విజయ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. దంపతు మృతితో వారి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# మహిళా జర్నలిస్టులను బెదిరిస్తే కటకటాలే!

- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్





**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహిళా జర్నలిస్టులపై ఆన్‌లైన్‌లో వస్తున్న బెదిరింపులు, దుర్భాషలపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్ హామీ ఇచ్చారు. స్వతంత్ర జర్నలిస్టు తులసి చందు సహా పలువురు మహిళా జర్నలిస్టులు మంగళవారం కమిషనర్‌కు ఫిర్యాదు సమర్పించారు. తమపై జరుగుతున్న నిరంతర ట్రోలింగ్, వేధింపులు, బెదిరింపులు, అసభ్య దాడుల వివరాలను వారు అందించారు.

### ట్రోలింగ్ వీడియోలు చూపించిన జర్నలిస్టులు

జర్నలిస్టుల ప్రతినిధి బృందం ట్రోలింగ్ స్వరూపాన్ని చూపించే అనేక వీడియోలను కమిషనర్‌కు ప్లే చేసి చూపించింది. పలు సోషల్ మీడియా హ్యాండిల్లు నిరంతరం విద్వేష వ్యాఖ్యలు, అసభ్య పోస్టులు, దాడులు చేస్తూ మహిళా జర్నలిస్టులను అవమానించాలని, భయపెట్టాలని చూస్తున్నాయని వారు తెలిపారు. సజ్జనార్ అందుబాటులో ఉన్న లింకులు, స్క్రీన్‌షాట్లు, వీడియోలను తన కార్యాలయానికి ఇవ్వాలని కోరారు. "చర్యలు తీసుకుంటాం. మీరు త్వరలో చూస్తారు. చర్యల తర్వాత మళ్లీ మాట్లాడుతాను," అని ఆయన జర్నలిస్టులకు చెప్పినట్లు తెలుస్తోంది.

రాతపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదులో మహిళా జర్నలిస్టులు తమపై "క్రమబద్ధమైన ఆన్‌లైన్ వేధింపుల ధోరణి" కొనసాగుతోందని తెలిపారు. కొన్ని హ్యాండిల్లు, ఉద్దేశపూర్వకంగా అసభ్య వ్యాఖ్యలు, ప్రాణహానికర బెదిరింపులు, అవహేళనాత్మక పోస్టులు, వీడియోలు షేర్ చేస్తున్నాయని చెప్పారు. తమ నివాస చిరునామాలు తెలుసునని కొందరు బహిరంగంగా చెప్పిన విషయాన్ని కూడా వారు ఫిర్యాదులో చేర్చారు. ఈ ట్రోలింగ్ భయం కలిగించడం, తమ వృత్తిపరమైన పనిని అడ్డుకోవడమే లక్ష్యంగా కనిపిస్తోందని వారు పేర్కొన్నారు. విద్వేషపూరిత, మతపరమైన ఉద్రిక్తత కలిగించే కంటెంట్‌ను కూడా ఈ హ్యాండిల్లు విస్తృతంగా పోస్ట్ చేస్తున్నాయని తెలిపారు. సంబంధిత హ్యాండిల్లు, వ్యక్తులపై దర్యాప్తు చేసి, ఐపీసీ, ఐటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆన్‌లైన్-భౌతిక రక్షణను కల్పించాలని కోరారు. ఈ వేధింపులు మీడియా స్వేచ్ఛపై దాడి మాత్రమేనని, మహిళా జర్నలిస్టుల గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్ సిటీ పోలీసులు సమర్పించిన సమాచారాన్ని పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

# వైకాపా అధికార ప్రతినిధి కారుమూరు అరెస్ట్

- కూకట్‌పల్లిలో అదుపులోకి తీసుకున్న తాడిపత్రి పోలీసులు

**హైదరాబాద్, నవంబర్18 (జనంసాక్షి) :** వైకాపా అధికార ప్రతినిధి కారుమూరు వెంకట్‌రెడ్డిని ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో తాడిపత్రి పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. వెంకట్‌రెడ్డిపై ఏపీలో పలు కేసులు నమోదయ్యాయి. తిరుమల పరకామణి కేసులో ఫిర్యాదుదారు సతీశ్‌కుమార్ ఈనెల 14న తాడిపత్రి సమీపంలో రైల్వేట్రాక్ పక్కన హత్యకు గురయ్యారు. దీనిపై ఏపీ పోలీసుల దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహారం చడంతో పాటు సీఎం చంద్రబాబుపై వెంకట్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కర్నూలు బస్సు ప్రమాద ఘటన తర్వాత ఓ టీవీ ఛానల్ డిబేట్‌లో రాష్ట్ర ప్రభుత్వం, సీఎంపై వెంకట్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తాడిపత్రి తెదేపా నేత ప్రసాదనాయుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా కూకట్‌పల్లిలోని మెరీనా స్కైస్ అపార్ట్‌మెంట్‌లో కారుమూరు వెంకట్‌రెడ్డి ఉన్నట్లు గుర్తించారు. మంగళవారం ఉదయం అక్కడికి వెళ్లి అరెస్ట్ చేశారు.

# డ్రగ్స్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యం

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్




**హైదరాబాద్ (జనంసాక్షి) :** డ్రగ్ ఫ్రీ హైదరాబాదే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన నషా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, హైద్రాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన పాల్గొని మాదక ద్రవ్యాల నివారణపై ప్రభుత్వ కట్టుబాటును పునరుద్ఘాటించారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ హైదరాబాద్ లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి తెలిపారు. గాంధీ మెడికల్ కాలేజీలో డ్రగ్ డి -ఏడిక్షన్ కల్చరల్ ప్రోగ్రామ్, వీధి నాటకాలు నిర్వహించారు. వీటితో పాటు అవగాహన, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 3వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొనారు. కార్యక్రమానికి రాష్ట్ర నార్కోటిక్స్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, కార్యదర్శి అనిత రామచంద్రన్, సంచాలకులు బి.శైలజ, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన పాల్గొనారు.

# అగ్నిప్రమాదంలో అంబులెన్స్ దగ్ధం

- నవజాత శిశువు, ఓ వైద్యుడు సహా మొత్తం నలుగురు మృతి

**గాంధీనగర్, నవంబర్18 (జనంసాక్షి) :** గుజరాత్ లో ఘోర ప్రమాదం సంభవించింది. అంబులెన్స్ లో మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో నవజాత శిశువు, ఓ వైద్యుడు సహా మొత్తం నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌లోని అర్వల్లి జిల్లాలో గల మోడసా పట్టణ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అప్పుడే పుట్టిన శిశువు అనారోగ్యంతో బాధపడుతుండటంతో చిన్నారిని మోడసాలోని ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం అహ్మదాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 1 గంట ప్రాంతంలో మోడసా-ధన్సురా రహదారిపై అంబులెన్స్‌లో మంటలు చెలరేగాయి ఆ సమయంలో అంబులెన్స్‌లో శిశువు తండ్రి జిగ్నేష్ మోచి (38), అహ్మదాబాద్‌కు చెందిన వైద్యుడు శాంతిలాల్ రెంటియా (30), నర్సు భూరిబెన్ మనత్ (23) ఉన్నారు. ఈ ప్రమాదంలో వారు సజీవదహన మైనట్లు పోలీసులు వెల్లడించారు. అంబులెన్స్ డ్రైవర్, మరో ముగ్గురు ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డారు.

# పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే ఎర్ర రాజశేఖర్ హత్య

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



**షాద్‌నగర్ (జనంసాక్షి) :** పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే ఎర్ర రాజశేఖర్ హత్య జరిగిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులే బాధితులను చిత్రహింసలు పెట్టడం ఏంటనీ ప్రశ్నించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో కుల దురహంకారానికి బలైన ఎర్ర రాజశేఖర్ కుటుంబాన్ని సీపీఐ(ఎం) కార్యదర్శి జాన్‌వెస్లీ, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఆ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఏ. నరసింహ, షాద్‌గర్ డివిజన్ కార్యదర్శి ఎన్.రాజు తదితరులు పరామర్శించారు. మృతుని భార్య వాణి, తండ్రి మల్లేష్‌ని ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాన్‌వెస్లీ మీడియాతో మాట్లాడారు. దళిత యువకుడు ఎర్ర చంద్రశేఖర్ బీసీ యువతిని ప్రేమ వివాహం చేసుకుంటే అతని సోదరుడు ఎర్ర రాజశేఖర్‌ను కిడ్నాప్ చేసి హత్య చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం మేజర్లయిన యువతీ, యువకులు పెండ్లి చేసుకునే హక్కు వారికి ఉందన్నారు. దీన్ని జీర్ణించుకోలేని వధువు తండ్రి కావలి వెంకటేశ్.. మొయినాబాద్ పోలీసుల సహాయంతో పోలీస్‌స్టేషన్‌లోనే ఎర్ర చంద్రశేఖర్ తండ్రిపై, అన్న జగన్‌ను బెదిరించి చిత్రహింసలు పెట్టారని అన్నారు. ఎర్ర రాజశేఖర్‌ని కిడ్నాప్ చేసిన విషయాన్ని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం వహించారని తెలిపారు. సకాలంలో పోలీసులు స్పందించి ఉంటే రాజశేఖర్ హత్య జరిగేది కాదని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### నేడు జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు

ఎల్లంపల్లి గ్రామంలో చోటుచేసుకున్న హత్యను నిరసిస్తూ మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలకు సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది. పార్టీ నాయకులు, అనుబంధ సంఘాలు, ప్రజాసంఘాలతో కలిసి ప్రభుత్వ వైఫల్యాన్ని, పోలీసుల నిర్లక్ష్యాన్ని ఎండకడతామని పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తెలిపారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు బిసా సాయిబాబు, శ్రీనునాయక్, కొంగరి నర్సింలు, శ్రీకాంత్, ఈశ్వర్‌నాయక్, బేరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కలర్ ఫుల్‌గా ఖిలా వరంగల్...







**వరంగల్ ఈస్ట్, నవంబర్ 18 (జనం సాక్షి) :** ఈనెల 19 నుండి 25 వరకు కేంద్ర పురావస్తుశాఖ లో బాగాంగా ప్రపంచ వారసత్వ వారోత్సవాల( వరల్డ్ హెరిటేజ్ వీక్) లో బాగంగా చారిత్రక ఖిలా వరంగల్ కోట లో 19న ఒక రోజు ఉచిత ప్రవేశం ఉంది అని వరంగల్ జిల్లా కేంద్ర పురావస్తుశాఖ అధికారి ఒక ప్రకటనలో తేలిపారు. అదేవిధంగా ప్రపంచ వారసత్వ వారోత్సవాలను పురస్కరించుకొని కిలా వరంగల్ లోని శిల్పాల మధ్య, అలాగే కీర్తి కాకతీయ తోరణాలను రంగురంగుల విద్యుత్తు లైట్ల నడుమ సుందరంగా దేదీప్యమనంగా అలంకరించారు. దీంతో పర్యాటకులకు కను విందుగా కలిగిస్తుంది.

# ఎన్‌కౌంటర్లు కావు హత్యాకాండలే



గత 50 ఏళ్ళుగా ప్రభుత్వాలు విప్లవోద్యమ నిర్మాణాలను కాల్చి చంపి ఎన్‌కౌంటర్లుగా ప్రకటిస్తూ వస్తున్నది. అలాగని ఈ బూటకపు ఎన్‌కౌంటర్ హత్యాకాండ ఇప్పటికి కూడా ఆగలేదు. కాకపోగా వివిధ మిలటరీ ఆపరేషన్ల పేరుతో సామూహిక హత్యాకాండనే ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తున్నది. దానికి గ్రీన్‌హంట్ సమాధాన్, ప్రహార్, నేడు కొనసాగుతున్న కగార్. ప్రజల సమస్య ల పట్ల ప్రభుత్వాలకు అసలు పట్టింపే లేదు. ప్రజలు సాధించుకున్న రాజ్యాంగ హక్కుల పట్ల కూడా బాధ్యత లేదు. ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో జరుగు తున్న ఉద్యమాలకు అటవీ హక్కుల చట్టం 2006, 1996 పేసా చట్టం, 5వ షెడ్యూలు, 6వ షెడ్యూలు, గ్రామసభ తీర్మాణాల నిరాదరణ నుంచే ఉద్యమా లు పుట్టుకొస్తున్నాయి. వాటికి మావోయిస్టు ఉద్యమం తోడవుతున్నాయి. దాన్ని పట్టించుకోకపోగా మావోయిస్టులు ఉన్నారని అణచివేతనే ప్రధానం చసుకుంటూ ప్రభుత్వాలు ఎప్పుడు కూడా ప్రజాస్వామికంగా పరిపాలన కొనసాగించలేవు. మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలించినప్పటికి కూడా మళ్ళీ ఉద్యమాలు నిలదొక్కుకుంటూనే ఉంటాయి. ఎందుకంటే ప్రజల సమస్యలు పరిష్కారం కానంత వరకు ప్రజా ఉద్యమాలు బలంగా ముందుకు వస్తాయి. ప్రజా ఉద్యమాల గురించి మోడీ షా ప్రభుత్వం కనీస ప్రకటన కూడా చేయడం లేదు. అదీ గాక అఖిల భారత స్థాయిలో బుద్ధిజీవులు మేధావులందరు కలిసి మధ్యభారతంలో ఉన్న కోట్లాది విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించడం కోసం ఆదివాసీల నెత్తురును అడవి అంతా పారిస్తున్నారు. చివరికి వారిని ఉద్యమకారులుగా, మావోయిస్టులుగా, నక్సలైట్లుగా ముద్ర వేస్తూ వాళ్ళ హత్యకు చట్టబద్ధత పొందాలనే ప్రయత్నం చేస్తున్నది. కానీ బలంలేని ప్రజలు పార్టీలు బుద్ధిజీవులందరు కూడా ప్రభుత్వం చేస్తున్న హత్యలని బలంగా విశ్వసిస్తున్నాయి. అయితే మాట్లాడే, ప్రశ్నించే గొంతులపై ఫాసిజం దాడి కొనసాగుతున్న నేపథ్యంలో ఆ గొంతులు కూడా బయటికి రావడం చాలా కష్టమైపోతున్నది. మతోన్మాదాన్ని, ఫాసిజాన్ని వ్యతిరేకించిన గొంతులను డా॥ దభోల్కర్ నుంచి గౌరీలంకేష్ వరకు ఎంత కిరాతకంగా హత్య చేశారో ప్రజలందరు చూసి ఉన్నారు. అదీ కాక భీమా కొరెగావ్ ఉపా కుట్ర కేసు 2018 నుంచి ప్రజల కోసం బాధ్యతపడిన మేధావులందరిని ఏ విధంగా జైలుపాలు చేసి నిర్బంధాలకు గురి చేశారో మనందరికి అర్థమవుతున్నది. దీంతో బహిరంగంగా ప్రశ్నించే గొంతుకకు బలం లేకుండా పోతున్నది. అదీ ప్రభుత్వాలకు అవకాశంగా మారిపోయి ఎంతటి అత్యాచార కాండకైనా, హత్యాకాండకైనా ప్రభుత్వాలు సిద్ధమైపోతున్నాయి. చివరికి న్యాయవ వ్యవస్థ కూడా వారి గుప్పెట్లోకి వెళ్ళిపోయింది. అందుకే ప్రభుత్వాలను చూసి ప్రజలు భయపడుతున్నారు. అధికారం ఉందని ప్రజలపై ఎంతటి అగాయిత్యాలకైనా సిద్ధపడుతున్నాయి. అందులో భాగంగా బుల్డోజర్ విధ్వంసాన్ని భారత ప్రజలందరూ చూడగలుగుతున్నారు. అదే స్థాయిలో కాశ్మీర్ నుంచి మొదలు పెడితే కేరళ వరకు వామపక్ష ఉగ్రవాదం పేరుతో ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి ఎన్‌కౌంటర్లను సాయుధ బలగాలను ప్రభుత్వాలు రాజ్యాంగ విరుద్ధంగా వాడుతున్నాయి. దీనితో ప్రజలకు ప్రభుత్వాలంటే అసహ్యం ఏర్పడుతున్నది. ప్రభుత్వాలు మొత్తంగా కూడా పోలీసు సైన్యవ్యవస్థలపై వారితో ప్రజల అణచివేత మీదనే ఆధారపడి పాలన చేస్తున్నాయి. అందుకే ప్రజల సమస్యలు ఆకాంక్షలు ఎక్కడ కూడా ఎజెండాలోకి రాకుండా ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలు సంస్కరణలో ఉచితాలు మాత్రమే ఎజెండా మీదికి వస్తున్నాయి. నిజమైన సమస్యల కోసం ప్రశ్నించినా మాట్లాడినా ప్రజలను ఈ రోజు ఎన్‌కౌంటర్ పేరుతో ఎలాగైతే మాడివి హిడ్మాను చంపేసారో అదే విధంగా 5 దశాబ్దాలుగా ఉద్యమ నాయకత్వాలను ఎన్‌కౌంటర్ పేరుతో హతమారుస్తున్నాయి. ప్రభుత్వాలు రాజ్యాంగ బద్ధంగా పాలన చేయడం లేదు. రాజ్యాంగాన్ని అమలు చేసి ప్రజలు మాత్రమే పాటించాలనడం ఎలా ప్రజాస్వామ్యమవుతుంది. ప్రజాస్వామ్యంలో పాలకులు ప్రజలు అందరూ సమానంగానే ఉండాలి. కాని పాలకులుగా మారినంత మాత్రాన వాళ్ళకు ఎక్కువ హక్కులు అధికారాలు ఉంటాయని ప్రజలు పాలకు లు ఎవరు కూడా భావించకూడాదు. అదే రాజ్యాంగ స్ఫూర్తి అనే విషయాన్ని గుర్తించాలి. రాజ్యాంగాన్ని కార్పొరేట్లకు, పాలకులకు అనుకూలంగా ఎన్నో రకాలుగా మార్పులు చేర్పులు చేసుకుంటున్నారు తప్ప ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులను మాత్రం ప్రభుత్వం అమలు చేయలేక పోతున్నది. ఇదే ప్రధాన వైరుధ్యంగా ప్రజల పోరాటానికి పునాదిగా మారుతుంది. దీన్ని అర్థం చేసుకోలేనంత కాలం దీన్ని పరిగణలోనికి తీసుకోనంత కాలం ప్రభుత్వాలు అణచివేతనే ఏకైక ఆయుధంగా పెట్టుకొని ప్రజాస్వామిక పాలన బదులు నక్సలైట్లకన్న ఎక్కువగా ప్రభుత్వాలు తుపాకిలను నమ్ముకొని పాలన చేస్తాయి. ఇది మనమెవరం ఆహ్వానించదగ్గ పరిణామం కాదు. అందుకు ప్రజలందరు కూడా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోగలం.

అల్లూరి జిల్లా – మారెడుమిల్లి టైగర్ జోన్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగిందని భద్రతా బలగాలు, పోలీసుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారని, మృతుల్లో కేంద్ర కమిటి సభ్యుడు హిడ్మా అతని సహచరి ఉందని ప్రచారం జరుగుతుంది. కానీ ఆపరేషన్ కగార్ మొదలైనప్పటి నుండి 80కి పైగా జరిగిన ఎన్‌కౌంటర్లన్నీ బూటకమే అని అందులో భాగంగానే ఈ ఎన్‌కౌంటర్ కూడా బూటకమేనని మేము భావిస్తున్నాము. మొత్తంగా అతనితో పాటు చాలా మందిని అదుపులోకి తీసుకొని దఫదఫాలుగా చిత్రహింసలు పెట్టి కాల్చి చంపుతున్నారు. తరువాత ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తున్నారు. రెండురోజుల క్రితమే చత్తీస్‌ఘడ్ డిప్యూటీ సిఎం హిడ్మా తల్లిని కలిని నీ కొడుకును సరెండర్ చేయించాలని చెప్పి ప్రకటన ఇప్పించాడు. గతంలో ఇలాగే ఇదే మారెడ్‌మిల్లిలో గాజర్ల రవి, అరుణ, అంజూలను ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపారు. అప్పుడు కూడా వారి వారి కుటుంబ సభ్యులతో పోలీస్ అధికారులు సిబ్బందిని బంధించి మీ వాళ్ళను లొంగిపోయేలా చేస్తారా, వాళ్ళెకడ ఉన్నారో తెలిసింది అని సమాచారం ఇవ్వడం జరిగింది. అదే విధంగా ఇప్పుడు కూడా ఒక వైపు హిడ్మా తల్లితో లొంగిపోయే విధంగా ప్రకటన చేయిస్తూనే మరోవైపు చిత్రహింసలకు గురి చేసి కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తున్న హిడ్మా ఫొటోలను చూస్తున్నాం. ఏదేమైనప్పటికి ఈరోజు జరిగిన మారెడ్‌మిల్లి ఎన్‌కౌంటర్ కూడా బూటకమే. హిడ్మా ఫొటోను చూస్తేనే చాలా చిత్రహింసలకు గురి చేసినట్లుగా కనిపిస్తున్నది. ఒక్కరిద్దరు ఫొటోలను మినహాయించి మిగతా అందరిని చూస్తుంటే చిత్రహింసలకు గురి చేసినట్టుగానే ఉంది. ఇప్పటి వరకు ఎవరి లొంగుబాటుకైనా అనుమతి ఉంటుందేమో కాని హిడ్మా లొంగుబాటుకు అనుమతి ఉండదని, ఖచ్చితంగా చంపేస్తామని అక్కడక్కడ మాటలు వినబడుతున్నాయి. కాబట్టి హిడ్మాను టార్గెట్ చేసుకొని బంధీగా మార్చుకొని కాల్చి చంపినట్లుగా అనిపిస్తుంది. ఇంకా కూడా 15 మంది వరకు పోలీసుల అదుపులో ఉన్నట్లుగా సమాచారం వస్తున్నది. వారికి ఎటువంటి ప్రాణహాని తలపెట్టకుండా వారిని కూడా కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించకుండా వెంటనే కోర్టులో హాజరు పరచి వారి జీవించే హక్కును కాపాడాల్సిన అవసరం ఉంది. గతంలో జరిగిన అన్ని ఎన్‌కౌంటర్లు కూడా ఈ విధంగా జరిగినవే. కాబట్టి ప్రభుత్వాలు ఇప్పటికైనా ఎన్‌కౌంటర్ హత్యాకాండను ఆపి రాజ్యాంగబద్ధంగా పాలన చేయడం ద్వారానే ప్రజలను గెలుచుకోగలుగుతారు. ఆదివాసీల నుంచి వచ్చిన హిడ్మానే నాయకుడిగా ఎదిగిన అతన్ని కూడా చంపిన స్థితిలో, ఇప్పటికైనా ఆపరేషన్ కగార్‌ను ఆపి, చర్చలను కొనసాగించి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి.




**ఎన్ నారాయణరావు**
పౌరహక్కుల సంఘం
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

# ఆచరణే జ్ఞానానికి మూలం.. అవకాశమే సామర్థ్యానికి బాట!



ఈ రోజుల్లో జ్ఞాన పరిశ్రమ అంటే కేవలం పుస్తకాలు మాత్రమే కాదు. మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, స్వయం సహాయ గ్రంథాలు, ఆన్‌లైన్ కోర్సులు, యూట్యూబ్ ఛానెళ్లు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, ఇన్‌ఫ్లుఎన్సర్ల లైవ్ సెషన్స్, లక్షల రూపాయల ఫీజు వసూలు చేసే కోచింగ్ సెంటర్లు %–% ఇవన్నీ కలిపి దేశవ్యాప్తంగా లక్షల కోట్ల రూపాయల టర్నోవర్‌ను సృష్టిస్తున్నాయి. ఇంటర్మీడియట్ పూర్తవగానే ఎంట్రెన్స్‌లు, సివిల్స్, గ్రూప్–1, గ్రూప్–2, ఎస్ఎస్‌సీ, రైల్వే, బ్యాంక్ పరీక్షల పేరుతో యువత ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు కోచింగ్ సెంటర్లలో, హాస్టళ్లలో, లైబ్రరీలలో పుస్తకాలు గిరిక్కిస్తోంది. తల్లిదండ్రులు రుణాలు తెచ్చి, ఆస్తులు అమ్మి, ఆశలు పెట్టుకుని పిల్లల్ని చదివిస్తున్నారు. ఇదంతా జ్ఞానం కోసమా? ఉద్యోగం కోసమా? భవిష్యత్తు భద్రత కోసమా? లేక సమాజంలో గౌరవం కోసమా? ఏమైనా కావొచ్చు. కానీ ఒక సత్యం మాత్రం మారదు %–% ఎంత చదివినా, ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా, ఎన్ని ర్యాంకులు సాధించినా.. చివరకు ప్రత్యక్ష ఆచరణ లేకపోతే ఆ జ్ఞానం పూర్తి కాదు. అది పరీక్షలో మార్కులు తెచ్చి ఉద్యోగం ఇచ్చినా.. జీవితంలో నిలబడదు, పనికిరాదు.

**ఆచరణ జ్ఞానం.. మెట్టు మెట్టుగా ఎదుగుతుంది!**



సర్పంచ్‌గా మొదలై పంచాయతీ సమితి అధ్యక్షులు, ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి వరకు ఎదిగిన వారెందరో ఉన్నారు. వీరిలో చాలా మంది పదో తరగతి కూడా పూర్తి చేయలేదు. ఐదో తరగతి చదువు ఆగిపోయి సుతారి పని చేస్తూ, గుత్తెదారుగా ఎదిగి, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ అయిన పుప్పాల ఆశాలు ఒక జ్వలంత ఉదాహరణ. చదువుకున్న ఇంజినీర్లు, డాక్టర్లు, ఎంబీఏలు ఆయన నాయకత్వంలో పని చేశారు. అందెశ్రీకి బడి చదువు ఒక్క రోజు కూడా లేదు. కానీ స్వకృషితో మహాకవి, లోకకవి, తెలంగాణ రాష్ట్ర గీత రచయితగా ఎదిగారు. ఈ రోజు కోట్లాది మంది చదువరులు ఆ గీతాన్ని పవిత్రంగా పాడుతున్నారు. గద్దర్, గూడ అంజయ్య, గోరటి వెంకన్న, నేను – ఇలాంటి వారందరూ ఒక్కటే చెబుతున్నాం: "అవకాశం రావడం వల్లనే మేము ఎదిగాం."

అవకాశం లేకుండా అనుభవం రాదు. అనుభవం లేకుండా సామర్థ్యం రాదు. కలెక్టర్ కాకుండా కలెక్టర్ సామర్థ్యం రాదు. ముఖ్యమంత్రి కాకుండా ముఖ్యమంత్రి అనుభవం రాదు. ఆచరణలో పడితేనే జ్ఞానం మెరుగవుతుంది, సామర్థ్యం పెరుగుతుంది. సైకిల్ గురించి పుస్తకం చదివి, యూట్యూబ్ వీడియోలు చూసి సైకిల్ ఎక్కలేం. పడిపోతూ, గాయాలు పడుతూ, చివరకు బ్యాలెన్స్ పట్టుకుంటాం. ఈత గురించి ఎన్ని లెక్చర్లు విన్నా.. నీటిలో దిగకపోతే ఈదలేం. ప్రేమ గురించి, శృంగారం గురించి, మాతృత్వం గురించి ఎన్ని సినిమాలు చూసినా.. స్వయంగా అనుభవించకపోతే అర్థం కాదు. ఇదే ప్రత్యక్ష జ్ఞానం.

**ప్రత్యక్ష పరోక్ష జ్ఞానం.. రెండూ ఒకదానికొకటి అవసరమే!**

ప్రత్యక్ష జ్ఞానం లేకుండా పరోక్ష జ్ఞానం ఉండదు. ఆచరణతో కలిగే జ్ఞానమే ప్రత్యక్షం. అధ్యయనంతో వచ్చేది పరోక్షం. సాహిత్యం, సినిమాలు, నాటకాలు పరోక్ష జ్ఞానాన్ని ప్రత్యక్ష అనుభూతులుగా మార్చగలవు.. కానీ అది ప్రత్యక్ష జ్ఞానం కాదు. పంచేంద్రియాల ద్వారా, అష్టేంద్రియ స్పందనల ద్వారానే నిజమైన జ్ఞాన క్రమం ప్రారంభమవుతుంది. "తెలిసినకాడికే చాలు" అనుకుంటే అక్కడే ఆగిపోతారు. అదే బావిలో కప్పలా మిగిలిపోతారు. మిడి మిడి జ్ఞానం, లోక జ్ఞానం లేని అమాయకులు అవుతారు.

పుస్తకాలు మనో వికాసాన్ని, ఇంద్రియ సంవేదనలను పెంచుతాయి. దేశ పర్యటనలు, విజ్ఞాన యాత్రలు తెలివిడిని కలిగిస్తాయి. బడి చదువులు, కాలేజీలు, యూనివర్శిటీలు, శిక్షణ కేంద్రాలు లోకంలో ఇప్పటిదాకా వెలువడిన జ్ఞానాన్ని, అనుభవాలను అందిస్తాయి. కానీ మనిషి గ్రహణ శక్తి పెరిగిన కొద్దీ ఎదుగుతాడు. ఎదగకపోతే మహా నది నుంచి కూడా చెంబెడు నీళ్లే పట్టుకుంటాడు.

**జ్ఞాన సిద్ధాంతాల్లో వైరుధ్యం కన్నా సంబంధమే ప్రాథమికం**

మార్క్స్, లెనిన్, మావోలు వైరుధ్యాలు, ఆచరణపై దృష్టి పెట్టారు. మావో "వైరుధ్యాలు", "ఆచరణ" అనే రెండు వ్యాసాలతో చైనా విప్లవాన్ని ముందుకు నడిపాడు. లెనిన్ మాత్రం తర్వాతి దశలో "వైరుధ్యం కన్నా సంబంధం ప్రాథమికం" అని చేరుకున్నాడు. ఇది లెనిన్ 38వ సంపుటి "తాత్విక గమనికలు"లో స్పష్టంగా కనిపిస్తుంది. కానీ రష్యా జ్ఞాన సిద్ధాంతం లెనిన్ 14వ సంపుటి వద్దే ఆగిపోయింది. చైనా కూడా వైరుధ్యాలు–ఆచరణ వద్దే నిలిచిపోయింది.

హెగెల్ "అభావం"తో పాటు "పాతది–కొత్తది కలయిక" కూడా ఉంటుంద న్నాడు. మార్క్స్ అభావాన్ని మాత్రమే పట్టుకుని కలయికను వదిలేశాడు. దాంతో వర్గయుద్ధాలు, ఆధిపత్య పోరాటాలు ముమ్మరమయ్యాయి. ప్రకృతిలో, సమాజంలో పాతది–కొత్తది కలయికే ఉంటుంది. చెట్టు ఉంటుంది.. దాని నుంచి విత్తనాలు పుడతాయి.. కొత్త చెట్లు పెరుగుతాయి. తాత–నానమ్మలు ఉంటూనే మనవళ్లు, మునిమనవళ్లు పుడతారు. ఇదే పరిణామం.

"అవకాశం ఇచ్చినప్పుడే, అందరికీ అవకాశం ఇచ్చినప్పుడే సమాజంలోని సమస్త సామర్థ్యాలు, నైపుణ్యాలు వికసిస్తాయి. అభివృద్ధి అందరికీ అందుతుంది.. అధికారం మాత్రమే కొందరికే!"


**గతి తర్క తత్వ దర్శన భూమిక.. కొత్త జ్ఞాన సిద్ధాంతం**

ఈ అంశాలన్నింటినీ అధ్యయనం చేసి, అఖిల భారత పర్యటనల్లో ఎదురైన అనుభవాలతో కలిపి నేను 1987లో "గతి తర్క తత్వ దర్శన భూమిక" రచన పూర్తి చేశాను. 1990లో దళిత వాయిస్ పత్రికలో సీరియల్‌గా ప్రచురితమై, 1991లో పుస్తక రూపంలో వెలువడింది. ఈ గ్రంథంలో వర్గం, కులం, జాతి, లింగం, మతం, ప్రాంతం – అన్ని వివక్షలకు వ్యతిరేకంగా సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆత్మగౌరవం కోసం కృషి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. దరకమే ఐక్య వేదిక ఈ ఆలోచనల నుంచే పుట్టింది.

"సమస్త వర్ణ వర్గ కుల లింగ జాతి మత ప్రాంత దేశ భాష వివక్షతలకు అసమానతలకు వ్యతిరేకంగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆత్మగౌరవం, సమ సమాజ నిర్మాణం కోసం సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, కళా రంగాలలో కృషి చేస్తుంది" – ఇదే మా ప్రణాళిక.

రాజ్యాధికారం కోసం మాత్రమే పోరాడితే.. కేసీఆర్ కుటుంబం లాగా కొందరు కుర్చీలు ఆక్రమించి కొత్త దోపిడీ వర్గాలుగా మారతారు. రష్యా, చైనాల్లో జరిగింది అదే. అభివృద్ధి, ప్రాతినిధ్యం, అవకాశాలు అందరికీ అందేలా చేయడమే నిజమైన పరిణామం. ఒకే జీవిత కాలంలో క్లర్క్ నుంచి గ్రూప్–1 ఆఫీసర్, అడ్వకేట్ నుంచి సుప్రీం కోర్టు జడ్జి, సర్పంచ్ నుంచి ముఖ్యమంత్రి, టీచర్ నుంచి ప్రిన్సిపల్ – ఇలా సమస్త రంగాల్లో ఎదగడమే పరిణామం. అప్పుడే గుణాత్మక మార్పు సాధ్యం.

అందుకే ఆచరణతో కలిగే జ్ఞానం, అధ్యయనంతో పెరిగే జ్ఞానం, అవకాశాలతో–శిక్షణలతో పెరిగే సామర్థ్యం – ఈ మూడూ కలిస్తేనే సమాజం నిజంగా ఎదుగుతుంది. కేవలం రాజ్యాధికారం కోసం పోరాడితే కొత్త ఆధిపత్య వర్గాలు పుట్టుకొస్తాయి. అభివృద్ధి, అధికారంలో భాగస్వామ్యం, అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం కోసం కృషి చేయడమే ఈ యుగ ధర్మం. అందరికీ అవకాశం ఇచ్చినప్పుడే.. సమాజంలోని సమస్త సామర్థ్యాలు వికసిస్తాయి. అప్పుడే నిజమైన సమ సమాజం సాకారమవుతుంది.



**బి.ఎస్. రాములు,**
సామాజిక తత్వవేత్త,
తెలంగాణ తొలి బీసీ
కమిషన్ చైర్మన్

# భూమి భవిష్యత్తుపై మనస్సాక్షి తీర్పు- కాఫ్ సమావేశం

వాతావరణ మార్పు అన్న పదం ఒకప్పుడు శాస్త్రవేత్తల సమావేశాల్లో, ఐక్యరాజ్యసమితి నివేదికల్లో కనిపించే అర్థశాస్త్రీయ పదంగా మాత్రమే భావించేవాళ్లం. ఇప్పుడు అది వార్తా చానెల్లు, వాట్సాప్ స్టేటస్‌లను దాటి మన ఇళ్ల గడప దాకా వచ్చేసింది. ఏ ప్రాంతంలోనైనా అసాధారణ వర్షాలు పడితే, వరదలు తీసికొస్తే, మరోచోట పొడి బీడు కరువు నింగిని తాకేంతలా ఎండలు మండితే, కొన్ని రోజులు వరుసగా 45 డిగ్రీలకు ఎగబాకే ఉష్ణోగ్రతలు రికార్డవుతుంటే, మరికొన్ని దేశాల్లో సూపర్ తుఫానులు తీరప్రాంతాలను చీల్చుకుంటూ పోతుంటే, ప్రజల మనసుల్లో ఒక్క ప్రశ్న మారుమ్రోగుతోంది %–% "ఇదంతా వాతావరణ మార్పు కారణం కాదా!

ఈ నేపథ్యంలో బ్రెజిల్‌లోని అమెజాన్ ప్రాంత రాజధాని బెల్లెం నగరంలో నవంబర్ 10 నుంచి 21 వరకు జరుగుతున్న ఐక్యరాజ్యసమితి వాతావరణ శిఖరాగ్ర సమావేశం కాప్%–%30 ఒక ప్రతీకాత్మక మలుపు. ప్రపంచ ఊపిరితిత్తులుగా పిలువబడే అమెజాన్ అడవుల మధ్యలో ప్రపంచ నేతల సమావేశం అంటే అది కేవలం రాజనీతికి సంబంధించిన కార్యక్రమం కాదు, భూమి భవిష్యత్తుపై మనసాక్షి తీర్పు చెప్పే కోర్టు వేదిక లాంటిది. ఈసారి సమావేశ స్థలానికే వరదలు తాకడం కూడా వాస్తవాన్ని అద్దం పట్టించినట్లే ఉంది.

కాప్–30 నేపథ్యంలో పీఈడబ్ల్యూ సంస్థ తొమ్మిది మధ్య ఆదాయ దేశాల్లో నిర్వహించిన సర్వే ఫలితాలు మరింత ఆలోచనకు గురిచేస్తున్నాయి. అర్జెంటీనా, బ్రెజిల్, భారత్, ఇండోనేషియా, దక్షిణాఫ్రికా, తుర్కియే, మెక్సికో, కెన్యా, నైజీరియా దేశాల్లో జనవరి 8 నుంచి ఏప్రిల్ 21 మధ్య 12,375 మంది పెద్దలతో ముఖాముఖి సర్వే నిర్వహించారు. ఈ దేశాలన్నీ వాతావరణ మార్పు బారిన బలంగా పడుతున్నవే, అలాగే అభివృద్ధి ఆకాంక్షతో ముందుకు పరిగెడుతున్నవే కావడం గమనించాల్సిన అంశం.

సర్వేలో మధ్య ఆదాయ దేశాల ప్రజల స్పష్టమైన సందేశం ఒక్కటే – వాతావరణ మార్పు ఇప్పుడే మా ఊళ్లను ప్రభావితం చేస్తోంది. ఈ తొమ్మిది దేశాలపై తీసుకున్న మధ్య విలువ ప్రకారం 74 శాతం మంది తమ నివాస ప్రాంతం, పనిస్థలం వాతావరణ మార్పు ప్రభావానికి గురవుతోందని చెప్పారు. కేవలం నాలుగో వంతు మందికి మాత్రమే తమ ప్రాంతంలో పెద్దగా ప్రభావం కనిపించడంలేదనిపిస్తోంది. మరో ప్రశ్నకు సమాధానంగా ఈ దేశాల్లో సగటు 56 శాతం మంది "నా జీవితకాలంలో వాతావరణ మార్పు వల్ల నాకు వ్యక్తిగతంగా నష్టం కలుగుతుందనే భయం చాలా ఎక్కువగా ఉంది" అని పేర్కొన్నారు, ఇంకొంతమంది కొంతమేర భయంతో ఉన్నారు.ప్రజలను ఏ అంశం ఎక్కువగా కలవరపెడుతోందని అడిగితే ఎక్కువ మందికి గుర్తొచ్చినది కరువు, నీటి కొరత. 2015తో పోలిస్తే 2025లో ఈ భయం మరింత పెరిగిందని అదే పీఈడబ్ల్యూ డేటా చెబుతోంది. వరుసగా ఎండలు, అకాల వర్షాలు, తీవ్రమైన వేడి తరంగాలు, వరదలు, తుఫానులు అన్నీ ఆందోళన కలిగిస్తున్నా, గ్లాస్ గ్లాస్‌గా నీరు తీసుకోవాల్సిన రోజులు వస్తాయనే ఊహే ప్రజల గుండెల్లో పెద్ద గాయం అవుతోంది.

ఇలాంటి నేపథ్యంతో మన భారతదేశం చిత్రాన్ని ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం ఉంది. ఈ సర్వేలో పాల్గొన్న భారతీయుల్లో దాదాపు ఎనభై శాతం



మంది "వాతావరణ మార్పు ప్రభావాన్ని తగ్గించడానికి నా జీవనశైలిలో కొన్ని మార్పులు చేసేందుకు సిద్ధంగా ఉన్నాను" అని చెప్పారు. ఇందులో 41 శాతం మంది "చాలా పెద్ద మార్పులకు సిద్ధం" అని సమాధానం ఇచ్చారు, 39 శాతం "కొందరైనా మార్పులు చేస్తాం" అని చెప్పడం జరిగింది, కేవలం 14 శాతం మంది మాత్రమే "కొంచెం మాత్రమే లేదా అసలు మార్పు అవసరం లేదు" అన్న భావన వ్యక్తం చేశారు. భారతీయులలో 48 శాతం మంది "నా జీవితంలోనే వాతావరణ మార్పు నన్ను తీవ్రంగా దెబ్బతీస్తుందనే భయం ఉంది" అని వెల్లడించగా, మరో దాదాపు మూడో వంతు మంది "కొంతవరకు భయంతో ఉన్నాం" అన్నారు. అంటే మొత్తం మీద దేశంలో ఎనిమిదిలో ఆరుగురికి పైగా వాతావరణ మార్పు వ్యక్తిగత భవిష్యత్తుపైనే ముప్పు తెస్తుందనే స్పష్టమైన అవగాహన ఉంది.

ఇక్కడ ఒక ఆసక్తికరమైన బిందువు కనిపిస్తుంది. తమ ఊళ్లలో వాతావరణ మార్పు ప్రభావం అంతగా కనిపించడంలేదని చెప్పిన భారతీయుల్లో కూడా గణనీయ శాతం మంది "అప్పటికీ నా జీవనశైలిని మార్చేందుకు సిద్ధంగా ఉన్నాను" అని చెప్పారు. అంటే కేవలం నేరుగా అనుభవిస్తున్న నష్టాలే కాదు, శాస్త్రీయ చర్చలు, వార్తా కథనాలు, ఇతర దేశాల పరిస్థితులు చూసి ఒక ముందస్తు అప్రమత్తత భారతీయ సమాజంలో పెరుగుతోందని అర్థమవుతోంది.

ఈ సర్వేలో భాగంగా వయస్సు ఆధారంగా తీసుకున్న విశ్లేషణ మరొక ముఖ్యాంశాన్ని తెలిపింది. అనేక దేశాల్లోలాగే భారత్‌లో కూడా 18 నుంచి 34 ఏళ్ల మధ్య వయస్సు గల యువత, 50 ఏళ్లకు పైబడిన వర్గంతో పోల్చితే వాతావరణ మార్పు గురించి ఎక్కువ భయంతో ఉండటం, జీవనశైలిలో పెద్ద మార్పులకు ముందుండే తత్వం చూపించటం కనిపిస్తోంది. హైడ్రోకార్బన్ ఆధారిత ఆర్థిక వ్యవస్థల కాలుష్య బారం తమ భవిష్యత్తుపైన పడుతుందని యువతకు స్పష్టంగా అర్థమవుతోందని ఇది సూచన.పీఈడబ్ల్యూ సర్వే మరో కీలక తీరును బయటపెట్టింది. వాతావరణ మార్పు పరిష్కార బాధ్యత ఏ ఆధారంగా విభజించాలి అనే ప్రశ్నకు మధ్య ఆదాయ దేశాలపై తీసుకున్న మధ్య విలువ ప్రకారం 59 శాతం మంది "ఒక దేశం ఎంత కార్బన్ విడుదల చేస్తుందో అదే ప్రధాన ప్రమాణం కావాలి" అని చెప్పారు, సంపద లేదా సంపన్నత కంటే ఉద్గారాలే ప్రామాణికం కావాలని భావించటం గమనార్హం. అంటే ఈ దేశాల ప్రజలు "అత్యధిక చరిత్రాత్మక ఉద్గారాలు చేసిన అభివృద్ధి చెందిన దేశాలు ముందుగా మరింత పెద్ద బాధ్యత వహించాలి" అనే వాతావరణ న్యాయదృష్టిని బలంగా సమర్థిస్తున్నారని చెప్పొచ్చు.ఇలాంటి ప్రజా భావన మధ్య ఆదాయ దేశాల ప్రభుత్వాల ముందు ద్వంద్వ సవాల్‌ను ఉంచుతోంది. ఒక వైపున ప్రజల జీవన ప్రమాణాల్ని మెరుగుపరచాలి, పేదరికాన్ని తగ్గించాలి, పరిశ్రమీకరణ వేగవంతం చేయాలి. మరో వైపున అదే అభివృద్ధి మార్గం పాత కోల్ ఆధారిత తీరులో సాగితే వాతావరణ విపత్తులు మరింత వేగంగా తలెత్తుతాయనే శాస్త్రీయ హెచ్చరిక నుంచి తప్పించుకోలేము. అమెజాన్ అడవుల మధ్యలో జరుగుతున్న కాప్%–%30 ఈ అంతరంగ ఘర్షణను ప్రపంచ వేదికపైకి లాగుతోంది.వాతావరణ మార్పు ప్రభావం గురించి చర్చిస్తున్నప్పుడు ప్రకృతి వైపరిత్యాలన్నింటినీ ఒకే తాటిపై పెట్టే ప్రమాదం ఉంటుంది. తుఫానులు, వరదలు, కరువులు, వేడి తరంగాలు వాతావరణ వ్యవస్థతో నేరుగా అనుసంధానమై ఉంటాయి. భూకంపాలు మాత్రం ప్రధానంగా భూగర్భ టెక్టానిక్ తాళాల కదలిక ఫలితం. అయినప్పటికీ సముద్ర మట్టం పెరుగుదల, హిమనదుల కరుగుదల, అతివృష్టి, పొడి కాలాలు వంటి మార్పులు భూగర్భ ఒత్తిడి సమతుల్యాన్ని సున్నితంగా మార్చి కొన్నిచోట్ల భూకంపాల అవకాశాలను పెంచవచ్చని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. అంటే వాతావరణ మార్పు భూకంపాలకు "ఏకైక కారణం" కాకపోయినా, పరోక్ష ప్రభావ కారకాలలో భాగమవుతోంది. ఈ సున్నిత భేదాన్ని స్పష్టంగా గుర్తించడం కూడా విజ్ఞాన సమాజం, మీడియా మీద ఉన్న బాధ్యత.

భారతదేశం విషయానికి వస్తే గత కొన్ని సంవత్సరాల్లో ఉత్తర భారత రాష్ట్రాల్లో వరదలు, కొండచరియలు, హిమనదుల కూలిపడటం, హీట్ వేవ్‌లు, అకాల వర్షాలు క్రమం తప్పకుండా మళ్లీ మళ్లీ జరుగుతున్నాయి. శాస్త్రవేత్తలు స్పష్టంగా చెబుతున్న సందేశం %–% సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత పెరుగుతుండటం వల్ల మాన్సూన్ మరింత అస్థిరంగా, తీవ్రంగా మారుతోంది, ఇలాంటి విపత్తులు మరింత తరచుగా, మరింత తీవ్రతతో కనిపించబోతున్నాయి.ఇలాంటి కఠోర వాస్తవ నేపథ్యంలో పీఈడబ్ల్యూ సర్వేలో భారతీయుల నుంచి వచ్చిన మరో సానుకూల సంకేతం ఆశాభావానికీ చోటు ఇస్తోంది. సర్వేలో పాల్గొన్న వారిలో సుమారు రెండు మూడవ వంతు మంది "అంతర్జాతీయ సమాజం సరైన విధానాలతో ముందుకు వస్తే వాతావరణ మార్పు ప్రభావాన్ని గణనీయంగా తగ్గించగలరు" అని నమ్మకం వ్యక్తం చేశారు. అంటే ప్రజల భావజాలం "నిరాశలో చిక్కుకున్నది" కాదు, "బాధ్యతాయుత చర్యలపై విశ్వాసంతో ఉన్నది".

ఈ విశ్వాసానికి సముచిత జవాబు ఇవ్వాల్సింది రాజకీయ నాయకత్వం, ప్రభుత్వాలు, కార్పొరేట్ వ్యవస్థలు. కాప్%–%30 వేదికపై కార్బన్ మార్కెట్ సమన్వయం, ట్రాపికల్ ఫారెస్ట్ ఫైనాన్స్, లాస్ అండ్ డ్యామేజ్ నిధులు వంటి అంశాలు చర్చకు వస్తున్నాయి. కానీ ఆ చర్చలు స్థానిక ప్రజల జీవితాల్లో ఏ మార్పుకు దారి తీస్తాయో, అమెజాన్ వంటి అరణ్య ప్రాంతాల్లో ఇప్పటికే ప్రారంభమైన రహదారి, హోటల్ నిర్మాణాల వల్ల కలిగే పర్యావరణ నష్టాన్ని ఎంత వరకు అడ్డుకుంటాయో అన్నది పెద్ద ప్రశ్న.

వాతావరణ మార్పుపై అవగాహన వ్యాసం ఇక్కడితో ముగిసిపోవడం కాదు, జీవిత పాఠంగా మారాలి. భారతీయులలో 75 శాతం మంది "నా జీవనశైలిని మార్చుకుంటాను" అని చెప్పడం కేవలం ఆన్‌లైన్ సర్వేకు ఇచ్చిన సమాధానం మాత్రమే అయ్యి పోకూడదు. గ్రామంలో ఉన్న రైతుకైనా నగరంలో కారు నడిపే ఉద్యోగికైనా మార్పు అక్కడి నుంచే మొదలవాలి. అధిక వినియోగ అలవాట్లపై పునరాలోచన అవసరం. విద్యుత్ వినియోగంలో మితవ్యయం, ప్రజా రవాణా వినియోగం, అప్రయోజన ప్రయాణాల తగ్గింపు, స్థానిక కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నాలు, ప్లాస్టిక్ వినియోగాన్ని క్రమంగా తగ్గించే జీవితశైలి, నగర ప్రణాళికలో చెట్లు, నీటి వనరులకు ప్రాధాన్యం, ఇలాంటి చిన్న చిన్న అడుగుల సమాహారమే పెద్ద మార్పుకు పునాది.

అదే సమయంలో ప్రజలపై మాత్రమే నైతిక బరువు వేసి ప్రభుత్వాలు పెద్ద ప్రాజెక్టుల పేరుతో అడవుల నరమేధం కొనసాగిస్తుంటే అది న్యాయం కాదు. పీఈడబ్ల్యూ సర్వే చూపించినట్లుగా ప్రపంచ ప్రజలు కార్బన్ ఉద్గారాలను ఆధారంగా పెట్టుకుని బాధ్యతను విభజించాలనే అభిప్రాయానికి వస్తున్నారంటే, వాతావరణ న్యాయం అనే భావనను ప్రతి ప్రభుత్వ ధోరణిలో స్పష్టమైన ప్రమాణంగా మార్చాల్సిన సమయం వచ్చింది.

కాప్–30 బెల్లెం సమావేశం ముగిసే సమయానికి ప్రపంచ నేతలు ఎన్ని పేజీల తుది ప్రకటనపై సంతకం చేస్తారో, ఎన్ని బిలియన్ డాలర్ల గ్రీన్ ఫైనాన్స్ ప్యాకేజీ ప్రకటిస్తారో చూసి సంతృప్తి చెందడం సులభం. కానీ నిజమైన పరీక్ష మాత్రం వచ్చే సంవత్సరాల్లో మన గ్రామంలో, మన పట్టణంలో, మన దేశంలో వాతావరణ ముప్పు సూచికలు తగ్గుతున్నాయా లేక పెరుగుతున్నాయా అన్న ప్రశ్నకు సమాధానం ఇచ్చే సమయంలో ఉంటుంది.ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పీఈడబ్ల్యూ సర్వే నుంచి భారతీయ సమాజం తీసుకోవాల్సిన ప్రధాన సందేశం ఒకటే %–% మనలో చాలామంది సిద్ధంగా ఉన్నాం, ఇప్పుడు నాయకత్వం సిద్ధంగా ఉండాలని డిమాండ్ చేయాల్సిన సమయం వచ్చింది. బెల్లెం అమెజాన్ తీరంలో జరుగుతున్న ఈ కాప్%–%30, గ్లోబల్ పాలసీ చర్చల వేదిక మాత్రమే కాదు, మధ్య ఆదాయ దేశాల ఎదురు చూసే న్యాయం, బాధ్యత, ఆశాభావాల ప్రతిబింబం. వాతావరణ మార్పు అనే అగ్ని అల గ్లోబల్ దక్షిణ సమాజాలను ముంచెత్తే ముందు, ఈ స్వరాన్ని ప్రపంచ నాయకత్వం ఎంత గట్టిగా, ఎంత నిజాయితీగా వినిపించగలదో మన భవిష్యత్తు అంత దానిపై ఆధారపడి ఉంది.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

• అలియాబాద్ మున్సిపల్ కమీషనర్ చంద్ర శేఖర్



**శామీర్‌పేట్, నవంబర్ 18 (జనంసాక్షి) :** మాదక ద్రవ్యాల నిరోధానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అహర్నిశలు కృషి చేస్తున్నాయని అలియాబాద్ మున్సిపల్ కమీషనర్ చంద్ర శేఖర్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించే దిశగా "మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ – 2025" కార్యక్రమం మంగళవారం ఆలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. మాదక ద్రవ్యాల వల్ల సొసైటీకి కలిగే హానికర ప్రభావాలపై అవగాహన పెంపొందిస్తూ, వాటి నిర్మూలన కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు రావాలని కమీషనర్ చంద్ర శేఖర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి,ఇంచార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీని వాసులు,ఇంచార్జి మెప్మా అధికారి ప్రమీలదేవి, టీపీవో వికాస్,మున్సిపల్ ఏఈ సన,బిల్ కలెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ సిబ్బంది మరియు పట్టణ నాయకులు కృష్ణా రెడ్డిలు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలకు రక్షణ కల్పించాలి

• ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి
• తీర్మానించిన మేడ్చల్ జిల్లా కమిటీ

**కుత్బుల్లాపూర్, నవంబర్ 18 (జనం సాక్షి) :** ప్రైవేటు పాఠశాలల నిర్వహకులపై బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్న వారి నుంచి పాఠశాలల నిర్వవాహకులకు రక్షణ కల్పించాలని తెలంగాణ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలోని విబిపి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన మేడ్చల్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలి కాలంలో వరంగల్ జిల్లాలో పిడిఎస్ యూ నాయకులు పాఠశాల యాజమాన్యంపై బౌతిక దాడులకు దిగడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా తరుచుగా జరుగుతూనే ఉన్నాయని ఆందేళన వ్యక్తం చేశారు. కులసంఘాలు, విద్యార్థి సంఘాలు, జేఏసీలు, రాజకీయ పార్టీల అనుబంద సంఘాలు అంటూ ఇలా నిత్యం ప్రతి పాఠశాల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తూనే ఉన్నారని అన్నారు. ఇలాంటి వాటిపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.



ఎంతోమంది పేద విద్యార్థులకు బడ్జెట్ పాఠశాలలు విద్యాబుద్దులు నేర్పిస్తున్నాయని గుర్తు చేశారు. సేవే పరమావధిగా నిర్వహిస్తున్న పాఠశాలలను రక్షణ కరువైందని వాపోయారు. ట్రస్మా రాష్ట్ర కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబందనల మేరకు పాఠశాలల నిర్వహణ కోసం సంఘం తగిన సలహాలు సూచనలను అందిస్తుందని తెలిపారు. ఇఎస్ ఐ, పిఎఫ్, ప్రొఫెషనల్ టాక్స్ తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా అంశాలపై రాష్ట్ర కమిటి ఇప్పటికే ఉన్నతాధికారులతో చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, అధికార ప్రతినిధి రాంచందర్, సత్యారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి గిరిబాబు లతో పాటు జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష,కార్యదర్శులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

### ట్రస్మా మేడ్చల్ జిల్లా నూతన కమిటీ

తెలంగాణ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాస్ రెడ్డి, గడ్డమీది బాలరాజు, కె.ఆంజనేయులు, కె.శ్రీనివాస్‌లు, ఎస్.సోమశేఖర్, ధనలక్ష్మి, ఎస్.అశోక్‌రెడ్డి, మథ్యూ జోసఫ్, తాజోద్దీన్, స్వరూప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బిర్రు ఆంజనేయులు, కార్యనిర్వహక కార్యదర్శులుగా సిహెచ్ నర్సింహులు, ఎస్.ఉపేందర్, సహాయ కార్యదర్శులుగా వీరన్న, జి.మన్‌మోహన్‌రావు, ఎం.సాయిగణేష్, జి.విజయ్ భాస్కర్‌రెడ్డి, టి.లిథియా, సి.శ్రీనివాస్ రెడ్డి, కెవిఎన్ రెడ్డి, ఈ.దశరథ్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులుగా సిహెచ్ మహేందర్‌రెడ్డి, ఎస్.చంద్రశేఖర్, ఆనంద్, మల్లిఖార్జున్ రెడ్డి, జితేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, శ్రీనాథ్‌రావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రథమ కర్తవ్యం

• పిఏసి చైర్మన్ అరికెపూడి

**శేరిలింగంపల్లి, నవంబర్ 18 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజల సంపూర్ణ సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రజాపద్దల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డి పరిధి హ్యుందాయ్ సర్వీస్ సెంటర్ నుండి జయభేరి సహస్రా వరకు 40 లక్షల రూపాయల ప్రభుత్వ నిధుల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే ఆర్.సి.సి బాక్స్ డ్రైన్ (వరద నీటి కాల్వ) నిర్మాణం పనులకు మంగళవారం కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి అరికెపూడి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గంపరిధి కాలనీ ల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం గౌలిదొడ్డి లో 40 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. తద్వారా కాలనీ వాసులకు వర్షపు నీటినుండి ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలో మౌళిక వసతుల కల్పనకు



పెద్దపీట వేస్తానని, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికై గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1650 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని అరికెపూడి గుర్తు చేశారు. గాంధీ తెలియచేసారు. ముఖ్యమంత్రి మార్గదర్శకంలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని, శేరిలింగంపల్లిని అగ్రభాగాన నిలబెడుతామని ఆయన భరోసాను వ్యక్తం చేశారు. సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, శేరిలింగంపల్లిని అన్ని రంగాలలో అభివృద్ధిచేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా నిలుపుకుంటామని పునరుద్ఘాటించారు. వరద నీటి కాల్వ వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయశక్తులా కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### కొండాపూర్ డివిజన్ పరిధిలో...

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కొండాపూర్ డివిజన్ పరిస్థితి గోల్డెన్ తులిప్ కాలనీలో 35 లక్షల రూపాయల ప్రభుత్వ నిధుల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన సిసి రోడ్డు నిర్మాణం పనులకు డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్, హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నిహైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం అరికపూడి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన గావించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటితో పేదింటి కల నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

• గృహప్రవేశానికి ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి నూతన వస్త్రాలు అందజేత



**శ్రీరంగాపూర్, నవంబర్ 18 (జనం సాక్షి) :** శ్రీరంగాపూర్ మండలం పరిధిలోని నాగసానిపల్లి గ్రామంలో పిఎసిఎస్ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరము గ్రామంలో 1. శివయ్య శారదమ్మలకు 2. ఆంజనేయులు లలితమ్మలకు 3. వడ్డే బీసమ్మ ఈశ్వరయ్య లకు 4 పెద్దమన్నం పరమేశ్వరమ్మలకు 5. పెంటయ్య సత్యమ్మలకు, వీళ్లు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న ఐదు మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి నూతన వస్త్రాల అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినాక ఇచ్చిన హామీలలో ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసి ఇందిరమ్మ ఇంటితో పేదింటి కలను నెరవేరుతుందని, ఇందిరమ్మ ఇల్లు ఇల్లు ఆ నిర్మాణం పూర్తి చేసుకొని ఆ ఇంటికి పెద్దన్నగా ఆ గృహప్రవేశానికి నూతన వస్త్రాలను అందజేశారుఎమ్మెల్యే తుడి మెగా గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణం చేసుకోవాలని ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ప్రెసిడెంట్ ప్రమోదని రెడ్డి పిఎసిఎస్ వైస్ ప్రెసిడెంట్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి,మరియు ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈశ్వరయ్య, ఎంపీడీవో రవి నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన



**బోడుప్పల్, నవంబర్ 18 (జనంసాక్షి) :** ప్రాణాంతకమైన మాదకద్రవ్యాల నుండి దూరంగా ఉండాలని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్యాం సుందరరావు పిలుపునిచ్చారు. మంగళవారం నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం సందర్భంగా బోడుప్పల్ రాజా నగర్ డబుల్ బెడ్రూం కాలనీలో అవగాహన సమావేశం జరిగింది. ఇందులో మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే హానికర ప్రభావాలపై అధికారులతో పాటు బస్తీవాసులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా శ్యాం సుందరరావు మాట్లాడుతూ, భారతదేశాన్ని మాదకద్రవ్య రహిత దేశంగా మారుస్తుందనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఇందులో మాదకద్రవ్యాలకు వ్యసనం చెందుతున్న వారికి పునరావాస సేవలు అందించడంతో పాటు మద్యం, పొగాకు వంటి హానికర పదార్థాల వినియోగాన్ని తగ్గించే దిశగా అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమని అన్నారు.వ్యసనబాధితులకు మద్దతు అందించేందుకు సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 14446 ను ప్రారంభించిందని ఆయన వివరించారు. ఈ నంబర్ ద్వారా గోప్యమైన కౌన్సెలింగ్, పునరావాస కేంద్రాలపై సమాచారం, మార్గదర్శకత్వం లభిస్తుందని తెలిపారు.ప్రజలందరిలో పూర్తి స్థాయి అవగాహన కల్పించడానికి కార్యక్రమంలో భాగంగా డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రాంతంలో నిషా ముక్త్ భారత్ ర్యాలీ నిర్వహించి, అనంతరం స్థానికులతో కలిసి మాదకద్రవ్యాలను దూరంగా ఉంచే ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ ప్రవీణ్ కుమార్, రెవెన్యూ ఆఫీసర్ వెంకటేశ్వరులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, సంగీత, వార్డ్ ఆఫీసర్లు, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కులాంతర వివాహితుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవాలి



**హయత్‌నగర్, నవంబర్ 18 (జనం సాక్షి) :** కుల దురహంకార హత్యలను ఖండించండి, అంతకులను కఠినంగా శిక్షించాలని సిపిఎం హయత్ నగర్ సర్కిల్ కమిటీ కార్యదర్శి కీసర నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. హయత్ నగర్ లోని సిఐటియు కార్యాలయంలో కీసర నర్సిరెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు ఎర్ర చంద్రశేఖరు ప్రేమ వివాహం చేసుకున్నాడు అన్న కారణంతో అతని సోదరుడు ఎర్ర రాజశేఖర్‌ను కిడ్నాప్ చేసి దారుణంగా హత్య చేశారని ఈ హత్యను, ప్రజలు, ప్రజాతంత్ర వాదులు తీవ్రంగా ఖండించాలని వారు కోరారు. హత్యలకు పాల్పడిన కుల దురహంకారులను కఠినంగా శిక్షించాలని, హంతకులు పెట్రోల్ పోసి సజీవ దహనం చేయడాన్ని దుర్మార్గమైన చర్యని వారు అన్నారు. నెలరోజుల క్రితం ఎర్ర చంద్రశేఖర్ కావలి భవాని ని ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరు ఇద్దరూ చట్టబద్ధంగా మేజర్లైనప్పటికీ ఈ విషయాన్ని జీర్ణించుకోలేని యువతీ తండ్రి కావలి వెంకటేష్ చంద్రశేఖర్ సోదరుడు రాజశేఖర్ ను మాట్లాడుకుందాం రా అని పిలిచి నవాబుపేట ప్రాంతానికి తీసుకెళ్లి ఈ దారుణానికి పాల్పబడ్డరాని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక సంఘటనలు జరుగుతున్నాయని కొమరం భీమ్ అసిఫాబాద్ జిల్లా లో కోడలిని మామ హత్య చేశారని, షాద్నగర్‌లో అన్నని హత్య చేశారని ఇలాంటి వరుస సంఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం స్పందించకపోవడం దారుణము అని అన్నారు. ఇటీవల కాలంలో కుల దురాంకార హత్యలు పెరుగుతున్నాయని, రాష్ట్రంలో కులాంతర వివాహితుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, మరో కుల దురహంకార హత్య జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ కార్యక్రమం లో సర్కిల్ కమిటీ సభ్యులు సిహెచ్ కృష్ణయ్య, మషం నరహరి, సిహెచ్ మల్లేశం, బి భాస్కర్, ఏబూషి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కల్పించాలి

• జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజ్



**ఉప్పునుంతల, నవంబర్ 18 (జనం సాక్షి) :** భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజు అన్నారు మండల కేంద్రమైన ఉప్పునుంతల మరిపల్లి గ్రామాలలో వ్యవసాయ కార్మికులతో వారు మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు ఇవ్వాలని రెండో విడతలోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని మహిళలందరికీ 2,500 ఇవ్వాలని అదేవిధంగా వ్యవసాయ కార్మికులకు ట్రేడ్ యూనియన్ హక్కులు కల్పించాలని వ్యవసాయ కార్మికుల గ్రామీణ పేదలకు సంక్షేమానికి సమగ్ర చట్టం తేవాలని ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాలు పెంచాలని వారు ప్రభుత్వాన్ని కోరారు కార్యక్రమంలో వారితోపాటు వ్యవసాయ కార్మికులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బడా కార్పొరేట్ సంస్థలకు మద్దతు పలికే ప్రభుత్వాలను గద్దె దించాలి

• దేశంలోని లౌకిక ప్రజాస్వార్నిక శక్తులు ఏకం కావాలి
• పేదల రాజ్యాన్ని స్థాపించాలి
• సిపిఐ బస్సు యాత్ర సభలో జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ

**చేవెళ్ల, నవంబరు 18 (జనంసాక్షి) :** కార్పొరేట్ బడా పెట్టుబడిదారుల నాయకత్వంలో పనిచేసే కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించడానికి దేశంలోని లౌకిక ప్రజాస్వార్నిక శక్తులు ఏకం కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పిలుపునిచ్చారు. సిపిఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సిపిఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర బాసరలో ప్రారంభం అయ్యి మంగళవారం చేవెళ్ల పట్టణానికి వచ్చిన సందర్భంగా బస్సు బృందం నాయకులకు ఘనంగా సిపిఐ పార్టీ నాయకుల సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కే.రామస్వామి, టి.రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభు లింగం, జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, నాయకులు తదితరులు బోనాలు బతుకమ్మలతో బస్సు యాత్ర బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చేవెళ్ల బస్టాండు కూడలి సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ... భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు



అవుతున్న తరుణంలో ఖమ్మం పట్టణంలో డిసెంబర్ 26న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఖమ్మం సిపిఐ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. నాటి నిజాం నిరంకుశత్వం పాలనకు వ్యతిరేకంగా జాకీర్దారులకు వ్యతిరేకంగా జమీందారులకు వ్యతిరేకంగా పోరాడిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని తెలిపారు. నాటి స్వతంత్ర పోరాటంలో విరోచిత పోరాటాలు నిర్వహించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీ అని దేశంలో జరిగిన ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించిన పార్టీ సిపిఐ పార్టీ అని ఆమె కొనియాడారు. 100 సంవత్సరాలు నిండిన ఎర్రజెండా అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండి పోరాడుతున్న ఏకైక పార్టీ సిపిఐ పార్టీ అని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లాలో సిపిఐ నిరంతరం ప్రజాల తరపున పోరాడుతున్నదని పేదలకు ఇండ్ల స్థలాలు కావాలని చేవెళ్ల పట్టణంతోపాటు అబ్దుల్లాపూర్ మెట్టు ప్రాంతంలో రెండు చోట్ల గుడిసెలు వేయించి పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనత సిపిఐ పార్టీది అని ఆయన పేర్కొన్నారు. డిసెంబర్ 26న జరిగే భారీ బహిరంగ సభకు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రజలను పెద్ద ఎత్తున కదిలిస్తామని దానికి సిపిఐ నాయకులు కార్యకర్తలు నిర్విరామంగా ప్రయత్నం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ బస్సు యాత్ర కార్యక్రమంలో పశ పద్మతో పాటు సిపిఐ రాష్ట్ర నాయకురాలు పానుగంటి పర్వతాలు, రాష్ట్ర నాయకులు వలివుల్లా ఖాద్రి, నరేంద్ర, ఉప్పలయ్య, సిపిఐ మండల మల్గారి సత్తిరెడ్డి, కే శ్రీను పి.సుధీర్, పాలమాకుల శ్రీశైలం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, బీకేఎంయు జిల్లా అధ్యక్షుడు జే.అంజయ్య, జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల ప్రజానాట్య మండల జిల్లా అధ్యక్షుడు సుధాకర్, బద్దం శివారెడ్డి, రాజేందర్ గౌడ్, ఎఐటియుసి నాయకుడు శివ, లలిత, వెంకటమ్మ, పెంటయ్య, ప్రజా సంఘాల నాయకులుపార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ పాలనలో పేదల అభ్యున్నతి



**తాండూరు, నవంబర్ 18 (జనంసాక్షి) :** ప్రజా పాలనలో పేదలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ వాల్మీకి నగర్ ఇంచార్జ్ భరత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాండూరు పట్టణం వార్డ్ నం. 23 వాల్మీకి నగర్‌లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ వాల్మీకి నగర్ ఇంచార్జ్ భరత్ రెడ్డి కమిటీ సభ్యులు గాజుల మాధవి, సుదర్శన్, 23వ వార్డు మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ మహేశ్వరి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్స్ అందించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యువనేత వాల్మీకి నగర్ ఇంచార్జ్ భరత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన దిశగా అడుగులు వేస్తూ, పేద బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోని నిరుపేదలకు న్యాయం జరుగుతుందని వెల్లడించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు ,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
19 నవంబర్ 2025

# రైతు సంక్షేమం కోసమే సహకార సంఘాలు పాటుపడాలి

- రంగంపేటలో ఘనంగా సహకార వారోత్సవాలు
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**మెదక్, నవంబర్ 18 (జనం సాక్షి) :** రైతుల సంక్షేమం కోసమే సహకార సంఘాలు ఏర్పాటు అయినట్లు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రంగంపేట ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో సహకార సంఘం చైర్మన్, ఉమ్మడి మెదక్ జిల్లా డిసిఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్ అధ్యక్షతన జరిగిన సహకార వారోత్సవాల కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల బారి నుండి రైతులను కాపాడడం కోసం రైతులకు వ్యవసాయ రంగంలో వ్యవసాయ అనుబంధ రంగాలలో పెట్టుబడులకు సాయం అందించడం కోసమే సహకార సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తెలిపారు. సహకార సంఘంలో విత్తనాల విక్రయం నుండి పండిన పంట విక్రయించే వరకు రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నది అన్నారు. గతంలో సహకార సంఘాలు కేవలం రుణ పంపిణీకి మాత్రమే పరిమితం అయ్యేవని కానీ ప్రస్తుతం సహకార సంఘాలలో విత్తనాలు ఎరువులు పురుగుమందులు విక్రయం పండిన పంటను కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి కొన్ని మిల్లులకు పంపడం లాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సహకార సంఘాలు బలోపేతం అవుతున్నాయని లాభాల బాట పడుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. తక్కువ వడ్డీకి ఎక్కువ రుణాలను రైతులకు అందించే ఏకైక సంస్థ సహకార సంఘాలు అన్నారు సహకార సంఘాల ద్వారా పాలు అమ్ముకోవడానికి మోటార్ సైకిళ్ళ కొనుగోలు కురుణాలు, డైరీ ఫార్మ్, కోళ్ల ఫారాల ఏర్పాటుకురుణాలు వ్యవసాయ స్వల్పకాలిక రుణాలు ట్రాక్టర్లకు రుణాలు గృహ రుణాలు లాంటి ఎన్నో రకాల రుణాలను అందిస్తుందని కమర్షియల్ బ్యాంకులతో పోలిస్తే సహకార సంఘాలలో వడ్డీ తక్కువగా ఉంటుందని సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీ కూడా ప్రభుత్వం ఇస్తుందని ఎమ్మెల్యే తెలిపారు ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత పాలకవర్గం బాధ్యతలు చేపట్టే సమయానికి రంగంపేట సహకార సంఘం లో రూ.65 లక్షల అప్పులో ఉండగా ప్రస్తుత పాలకవర్గం అప్పులన్నీ రూ.20 లక్షలు నగదు నిలువ ఉంచడం గర్వించదగ్గ విషయమన్నారు. రంగంపేటలో షెడ్డు నిర్మాణం, ఎనగండ్ల సహకార సంఘం స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం హర్షించదగ్గ విషయం అన్నారు సంగం అభివృద్ధితో పాటు రైతుల అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాలకవర్గ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ డిసిఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్ మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులు రైతుల సహకారంతో గతంలో కొరుకోటి 20 లక్షల టర్నోవర్ ఉన్న సహకార సంఘాన్ని ఐదున్నర కోట్ల వరకు పెంచినట్లు సహకార సంఘాన్ని నగదు నిల్వ ఉండేలా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సహకార సంఘం లోకి వర్షం నీరు రాకుండా డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, సహకార సంఘానికి శాశ్వత కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం ఖాళీ స్థలం ఇప్పించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు సహకార సంఘంలో షెడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షులు మల్లేశం, సీఈవో నవీన్, జిల్లా సహకార అధికారి కరుణాకర్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ , మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి, సహకార సంఘం డైరెక్టర్లు ప్రవీణ్ రెడ్డి,గంగులు పెంటయ్య, ఆకుల రమేష్, విశ్రాంత తహసిల్దార్ బాలకృష్ణారెడ్డి, సంగాయపేట మంజీరా రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, టిఆర్ఎస్ పార్టీ యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు, టిఆర్ఎస్ యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి, చిట్యాల యాదయ్య, సిద్ధిరాములు, గౌరి శంకర్, సాయిబాబా గౌడ్, ఆంజనేయులు, రవీందర్, దూర్గేష్, తదితరులు పాల్గొన్నారు.

## హొతి(కే) డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు నీటి సరఫరా చేయాలి

- వారంలో నీటి సరఫరా చేయకుంటే ఆందోళన ఉధృతం
- సిపిఎం జిల్లా కార్యదర్శి జయరాజు



**జహీరాబాద్ టౌన్, నవంబర్ 18 (జనం సాక్షి) :** జహీరాబాద్ నియోజకవర్గంలోని హొతి(కే)లో డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు నీటి సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జయరాజు అన్నారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ హొతి(కేలో డబల్ బెడ్ రూమ్ ఇళ్ళ కు ఇప్పటివరకు నీటి సరఫరా పూర్తిస్థాయిలో చేయకపోవడం, వీధిదీపాలు వెలగక ప్రజలు పెద్ద ఎత్తున ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజానీకాన్నీ సమీకరించి ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికీ అధికారుల చుట్టూ అనేకసార్లు తిరిగి విన్నవించిన పరిష్కారం కాలేదని, పిడి హామీ ప్రకారమైన సమస్య పరిష్కారం కాకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అన్నారు. సమస్య పరిష్కారానికి సంగారెడ్డి లోనీ హౌసింగ్ కార్పొరేషన్ పి.డిని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యుడు మహిపాల్, నాయకులు సంతోష్, డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు నిర్మల స్వప్న, సోనీ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో జిల్లా ఖ్యాతి నిలిచేలా ప్రతిభ చాటాలి

- జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 18 (జనం సాక్షి) :** జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో ప్రథమ స్థానం సాధించిన కళాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ జోగులాంబ గద్వాల ఖ్యాతిని నిలబెట్టాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు.జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో గద్వాలలోని బాలభవన్ లో మంగళవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లాస్థాయి యువజన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు.యువతకు ఈ యువజన ఉత్సవాలు గొప్ప అవకాశం అని,ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వామి వివేకానంద సూక్తులను స్ఫూర్తిగా పొంది యువత తమ గమ్యం చేరేవరకు కృషి చేస్తూ ఉండాలని పిలుపునిచ్చారు.ఈ పోటీల్లో జానపద నృత్యం,జానపద పాటలు,కవిత్వ, కథరచన,డ్రాయింగ్, ఉపన్యాసం,సైన్స్ ఎగ్జిబిషన్,అంశాలలో యువత తమ ప్రదర్శనలు ఇచ్చారు. ఆయా పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి,జిల్లా యువజన,క్రీడల అధికారి కృష్ణ,ప్రభుత్వ కళాశాలల ప్రధానా చార్యులు వీరన్న, కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే



**ఉప్పునుంతల, నవంబర్ 18 (జనం సాక్షి) :** మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రధాన రహదారి అయిన రోడ్డు నాలుగు లైన్లుగా విస్తరణ పనులను నల్లమల్ల ముద్దుబిడ్డ డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మంగళవారం ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పునుంతల మండల కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని అందులో భాగంగానే రోడ్డు లైన్లు విస్తరణ సెంట్రల్ లైటింగ్ పనులకు భూమి పూజ చేయడం జరిగిందని రాష్ట్రంలోని ప్రజలు కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో ఉన్నారని దానికి నిదర్శనమే జూబ్లీహిల్స్ ఎన్నిక అని వారన్నారు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ముందుకు సాగుతున్న ప్రభుత్వం మన ప్రజా ప్రభుత్వం ఈ ప్రాంత బిడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని వారు అన్నారు ఈ కార్యక్రమంలో వారితోపాటు మండల పార్టీ అధ్యక్షులు కట్ట అనంత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిప్పర్తి నరసింహారెడ్డి, పిఎసిఎస్సి సీఈవో రవీందర్రావు, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షు లు మేడమోని భాస్కర్, యువజన కాంగ్రెస్ మండల ఇన్చార్జి అంతటి శేఖర్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు, ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ బొల్లె లక్ష్మయ్య, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నషా ముక్త్ భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- మెదక్ అదనపు ఎస్పీ ఎస్. మహేందర్



**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 18 (జనం సాక్షి) :** నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు రావాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ సిబ్బంది, అధికారులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, అక్రమ విక్రయం వంటి కార్యకలాపాలు యువత భవిష్యత్తును దెబ్బతీసే తీవ్రమైన సమస్యలు అని పేర్కొంటూ, వాటిని అరికట్టడానికి పోలీసులు, ప్రజలు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ సిబ్బందితో అదనపు ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉంటానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తానని, సమాజంలో ఎవ్వరూ మాదకద్రవ్యాల బారిన పడకుండా కృషి చేస్తానని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం అంకితభావంతో పనిచేస్తానని వాళ్లందరూ ప్రమాణం చేశారు. మాదకద్రవ్యాల ప్రభావం వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని కూడా దెబ్బతీస్తుందని, అందుకే పోలీస్ వ్యవస్థతో పాటు ప్రతి పౌరుడు అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని ఆయన అన్నారు. భారతదేశం అభివృద్ధి బాటలో ముందుకు సాగాలంటే యువతను డ్రగ్స్ ముప్పు నుండి రక్షించడం మొదటి అడుగు అని అదనపు ఎస్పీ స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలపై పోరాటం ఒక సామూహిక బాధ్యతగా తీసుకొని, కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి అవగాహన పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డియస్పి సుభాష్ చంద్ర బోస్, ఏఆర్ డియస్పి రంగా నాయక్, ఏఓ మని, ఆర్ఐ శైలెందర్, ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ కృష్ణ మూర్తి ఎసైలు సిబ్బంది పాల్గొన్నారు.

## "డ్రైనేజీ నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యం"

- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం
- సిపిఐ(ఎం) పట్టణ కార్యదర్శి రాళ్ళబండి నాగరాజు



**చేర్యాల, నవంబర్ 18 (జనంసాక్షి) :** చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో గత రెండు సంవత్సరాల నుంచి జరుగుతున్న జాతీయ రహదారి రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో అసంపూర్తిగా ఉన్న సైడ్ డ్రైనేజీ పనుల నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తున్న ఆర్ అండ్ బి, మున్సిపాలిటీ విద్యుత్ శాఖ అధికారుల పై చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎం) పట్టణ కార్యదర్శి రాళ్ళబండి నాగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో జాతీయ రహదారి నిర్మాణం కొరకు ఎన్నో సర్వేలు నిర్వహించి రోడ్డు వెడల్పు విస్తరణ కార్యక్రమం చేపట్టడం జరిగిందని, దానిలో భాగంగా రోడ్డు కిరువైపులా సైడ్ డ్రైనేజీ పనులు చేస్తూ ఉండగా సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాలలో నిర్మాణ పనులు చేయకుండా నిలిపివేయడం జరిగిందన్నారు. 6వ వార్డు పరిధిలోని మెయిన్ రోడ్డు నుంచి భవాని నగర్ కాలనీ వెళ్లే ప్రధాన దారిలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టకుండా వదిలివేసిన స్థలంలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం ఉన్నది.ఈ విద్యుత్ స్తంభం మురికి కాలువలో ఉండటం చేత స్తంభం చుట్టూ ఉన్న మట్టి కొట్టుకొని పోతున్నది. కాలనీకి వెళ్లడానికి ప్రధాన మార్గం ఇదే ఉండడం చేత నిత్యం కార్లు బైకులు వెళ్లుతున్న క్రమంలో ఎన్నో ప్రమాదాలకు గురి కావడం జరిగింది. ఇది పూర్తిగా అధికారుల వైఫల్యంగానే భావించాల్సి ఉంటుంది. చేర్యాల పట్టణంలో దాదాపు 90 శాతం పైచీలకు డ్రైనేజీ పనులు పూర్తి అయినప్పటికీ దళితులు బహుజనులు ఎక్కువగా నివసిస్తున్న భవాని నగర్ కాలనీ ప్రధాన మార్గంలో డ్రైనేజీ కట్టకుండా వదిలివేసినారు. మురికి కాలువలో 11కెవి విద్యుత్ స్తంభం ఎప్పుడు కూలిపోతుందోనని అక్కడ నివసిస్తున్న మరియు దారిన వెళ్లే ప్రజలు తీవ్ర భయాందోళనకు గురి అవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి నిర్లక్ష్యంగా మధ్యలో వదిలేసిన డ్రైనేజీ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని, లేకపోతే కాలనీవాసులతో అధికారుల ఆఫీసులు ముట్టడిస్తామని హెచ్చరించారు.

## టెట్ నుండి మినహాయిస్తూ పార్లమెంటులో చట్ట సవరణ చేయాలి

- పిఆర్టియు అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి



**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 18 (జనం సాక్షి) :** సెప్టెంబర్ 1 ,2025 రోజున సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఉపాధ్యాయులందరూ ఉద్యోగంలో కొనసాగాలంటే రెండు సంవత్సరాల లోపు తప్పనిసరిగా టెట్ పాస్ కావలసి ఉన్నది ఇది ఉపాధ్యాయులను ఎంతో మనోవేదనకు గురిచేస్తుందని పిఆర్టియు అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి గారు అన్నారు. 25, 30 సంవత్సరాల సర్వీసు కలిగిన ఉపాధ్యాయులు ప్రస్తుతము టెట్ రాసి పాస్ కావడం అంటే చాలా శ్రమతో వేదనతో కూడుకున్న పని అందువల్ల కేంద్ర ప్రభుత్వము స్పందించి విద్యాహక్కు చట్టం 2009లోని సెక్షన్ 23 అండర్ 2 సెక్షన్ ను సవరించి ఉపాధ్యాయులకు 2010 కంటే ముందు నియామకమైనటువంటి ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయింపు ఇస్తూ చట్ట సవరణ చేయాలి అని వారు డిమాండ్ చేశారు. 2010 కంటే ముందు నియామకమైనటువంటి ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష పాస్ కావడం నుంచి మినహాయింపు కోరుతూ చట్ట సవరణ చేయాలి అనే డిమాండ్తో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి గారు మరియు పిఆర్టియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పులగం దామోదర్ రెడ్డి ,సుంకరి బిక్షం గౌడ్ గారు ఢిల్లీలో ఉండి కేంద్ర ప్రభుత్వంలోని విద్యాశాఖ మంత్రిని మరియు ఇతర మంత్రులను ఎన్సిటిఈ అధికారులను కలుస్తూ చట్ట సవరణ కోసము గట్టి ప్రయత్నాలు చేస్తున్నారని వారు తెలిపారు.

## డ్రగ్స్ రహిత సమాజానికి విద్యార్థులు ముందుకు రావాలి



**ఉప్పునుంతల, నవంబర్ 18 (జనంసాక్షి) :** డ్రగ్స్ రైతు సమాజంకై విద్యార్థులు ముందుకు రావాలని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వెంకట్ రెడ్డి అన్నారు మండల కేంద్రమైన ఉప్పునుంతల పీఎంశ్రీ జెడ్పిహెచ్ఎస్ స్కూల్లో మంగళవారం విద్యార్థి విద్యార్థినీల చే మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయిని సమూలంగా నిర్మిలించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నాడు పెద్ద నగరాలకే పరిమితమైన మత్తు పదార్థాలు నేడు గ్రామీణ ప్రాంత విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తుందని మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండి వారి భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని వారన్నారు సమాజ హితంతో పాటు కుటుంబ గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని యువత ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలవాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో వారితోపాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థి విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

- ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు
- భూముల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**అమీన్‌పూర్, నవంబర్ 18 (జనం సాక్షి) :** శరవేగంగా విస్తరిస్తున్న పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రజల భవిష్యత్తు అవసరాల కోసం ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములు కబ్జాలకు గురికాకుండా చర్యలు తీసుకోబోతున్నట్లు స్థానిక శాసనసభ్యులు మహిపాల్ రెడ్డి తెలిపారు. భూముల పరిరక్షణకు ప్రజలందరూ సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట రెయిన్బో మెడోస్ కాలనీలో ప్రభుత్వ భూమి వివాదంపై ఎమ్మార్వో వెంకటేశం, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ సర్పంచ్ కృష్ణ లతో కలిసి ఆయన మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, రెవెన్యూ అధికారులు, గ్రామ మాజీ ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, డెవలపర్స్ తో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతింటి కలను సాకారం చేసుకోవాలన్న లక్ష్యంతో ఇళ్లను కొలుగోలు చేసిన కాలనీ వాసులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వమని హామీ ఇచ్చారు. అందరి సమక్షంలో మరోమారు జాయింట్ సర్వే నిర్వహించి పూర్తి న్యాయం చేస్తామని తెలిపారు. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న పటాన్చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామస్థాయి నుండి ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూముల వివరాలను సేకరించి.. కబ్జాలకు గురికాకుండా పూర్తిస్థాయి రక్షణ ఏర్పాట్లు చేయబోతున్నట్లు తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ పార్కులు, రహదారులను కబ్జా చేసి.. డబుల్ రిజిస్ట్రేషన్లు చేస్తూ కొనుగోలుదారులను మోసం చేస్తే చట్టరీత్య కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని సూచించారు. గజం భూమి కబ్జాకు గురైన కబ్జాదారులు జైలు ఊచలు లెక్క పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కొన్ని మండలాల పరిధిలో ప్రభుత్వ విద్యాసంస్థలు నెలకొల్పడానికి ప్రభుత్వ భూములు దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ ఫంక్షన్ హాల్లు, విద్యాసంస్థలు, సబ్ స్టేషన్లు, గోదాముల, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలను వినియోగించబోతున్నట్లు తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని కోరారు.ల

# ప్రభుత్వ పథకాలపై పర్యవేక్షణ ఉండాలి

- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- ఎంపీ కడియం కావ్య



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నిరంతర పర్యవేక్షణ చేయాలని వరంగల్ పార్లమెంటు సభ్యులు, దిశా కమిటీ ఛైర్మన్ డా కడియం కావ్య తెలిపారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన దిశా కమిటీ సమావేశం డా కడియం కావ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో వనరులు పుష్కలంగా ఉన్నాయని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని సూచించారు. జిల్లా విద్యా హబ్ గా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వైద్య సేవలపై సమీక్షించిన చైర్మన్ 45 శాతం ఆపరేషన్లు, 55 శాతం సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయని తెలిపారు. కు.ని. ఆపరేషన్లు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రసూతి వైద్యులు నియామకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్సీడీ, డయాబెటిస్, హైపర్ టెన్షన్, కాన్సర్ స్క్రీనింగ్ లు పకడ్బందీగా జరగాలని స్పష్టం చేశారు. గుర్తించిన వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. మలేరియా సోకకుండా ముందస్తు పరీక్షలు చేయాలని అన్నారు. రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉన్నందుకు వైద్య సేవలను అభినందించారు. డయాలసిస్ సేవలు జిల్లా ప్రధాన ఆసుపత్రిలో అందుబాటులోకి తేవాలని సూచించారు. ఇచ్చిన నిధులను సద్వినియోగం చేయాలని, జాప్యం వల్ల నిధులు వాపసు వెళ్లే అవకాశం ఉందని, 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గాను 12 కేంద్రాలకు స్థల సమస్య ఉందని తెలుపగా ఎందుకు జాప్యం జరుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం బాగా అభివృద్ధి కావాలని పథకాలు ఇస్తున్నామని పర్యవేక్షణ లోపం వల్ల జాప్యం జరుగుతోందని అన్నారు. చిన్నారులకు అరిజం, ఆరోగ్య, ఆర్టిజం సమస్యల పరీక్షలు నిర్వహించేలా అంగన్ వాడి సిబ్బందికి అవగహన కల్పించాలని సూచించారు.

కేజిబివి పాఠశాలల్లో స్వీయ రక్షణ, యోగా, ఆరోగ్య పరీక్షలు, రక్త హీనత ఉన్నవాళ్లను గుర్తించి వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్య సంరక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. మధ్యాహ్న భోజనం మెనూ పాటిస్తున్నారా, లేదా ఆకస్మిక తనిఖీలు చేయాలని తెలిపారు. మైనింగ్ ఎక్కడ జరుగుతుంది, సీఎస్ఆర్ నిధులు ఇతర ప్రాంతాలకు ఇస్తున్నారు. ఎందుకు అలా జరుగుతుంది మీకు ఎలాంటి పవర్స్ ఉండవా అంటూ మైనింగ్ అధికారిని ప్రశ్నించారు. సింగరేణి, జెన్ కో సీఎస్ఆర్ నిధులు ఇవ్వకపోతే ఇలా? ఇది సులభంగా వదిలే విషయం కాదని, పిర్యాదు చేస్తే ఎలా వుంటదో చెప్పండి అని అన్నారు. సింగరేణి అధికారులు సమావేశానికి ఎందుకు రాలేదని అసంతృప్తి వ్యక్తం చేసారు. ఎంపీ రైల్వే లైన్ ఏర్పాటు కు ప్రతిపాదనలు పంపామని, బొగ్గు రవాణా వల్ల రహదారులు పాడవుతున్నాయని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టామని తెలిపారు. సిఎండికి బదులు మీకు కూడా తెలిసి ఉండాలి కదా అంటూ సింగరేణి జియంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ సింగరేణి సిఎస్ఆర్ నిధులు ప్రాథమిక పనులకు ఇవ్వడం లేదని, కేంద్ర ప్రభుత్వ రూల్స్ ప్రకారం ఇవ్వాలని చెప్పారు. చట్టం10 కిమీ పరిధిలో ప్రాధాన్యత ఇవ్వాలని, తదుపరి 20 కిమి ఇవ్వాలని ఉందని విద్యా, వైద్య అభివృద్ధికి ఇవ్వడం లేదని, ఇంట్లో ఆస్థిలా లెక్కపెడుతున్నారని ప్రజలు వ్యాధులతో ఇబ్బంది పడుతున్నా, ఖర్చు పెట్టె పరిస్థితి ఎందుకు లేదని ఆగ్రహ వ్యక్తం చేశారు. మా నిధులు మాకు ఇస్తలేరని ఇక్కడ కాకుండా వేరే ప్రాంతాలకు ఎందుకు ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు. డిఎంఎఫ్టీ పక్కదారి పట్టించొద్దు, పక్క దారి పడితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కెజిబివిల్లో చాలా సమస్యలు ఉన్నాయని, డీఈఓ గా ఏవైనా సమస్యలు నా దృష్టికి తెచ్చారా, పేపరు పెడితే సరిపోదని నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన అంశాలపై సమగ్ర నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కోట రాజబాబు, డిఆర్డీఓ బాలకృష్ణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, కెటిపిపి సీఈ శ్రీప్రకాష్, సింగరేణి జిఎం రాజేశ్వర రెడ్డి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### తినుబండారాల స్టాల్ పరిశీలన

జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని ఐడిఓసి కార్యాలయంలో చెల్పూర్ మిల్లెట్ యూనిట్ నిర్వహిస్తున్న మహిళలు ఏర్పాటు చేసిన మిల్లెట్ తో చేసిన తినుబండారాల స్టాల్ ను మంగళవారం వరంగల్ పార్లమెంట్ సభ్యులు డా. కడియం కావ్య, భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. మిల్లెట్ ఆధారిత ఆహార పదార్థాలతో మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగుతున్న తీరును ప్రశంశించారు. మహిళలు తయారు చేస్తున్న ఆరోగ్యకరమైన మిల్లెట్ ఉత్పత్తులను మరింతగా ప్రోత్సహించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మిల్లెట్ యూనిట్ కార్యకలాపాలు, మహిళల తయారీ నైపుణ్యం, మార్కెటింగ్ అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు ఇలాంటి యూనిట్లు కీలక పాత్ర పోషిస్తాయని, జిల్లా స్థాయిలో మిల్లెట్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ నెలకొనేలా మార్కెటింగ్ సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్, డిఆర్డీఓ, జిల్లా అధికారులు, చెల్పూర్ మిల్లిట్ యూనిట్ నిర్వహణ మహిళలు రజిత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



# నిర్మల్ జిల్లాకు జల సంచాయ్-జన్ భాగీదారి అవార్డు

- న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి సి.ఆర్ పాటిల్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- జాతీయస్థాయిలో విరాజిల్లిన నిర్మల్ జిల్లా ఖ్యాతి

నిర్మల్ రూరల్, నవంబర్18(జనం సాక్షి) : జాతీయ వేదికపై మరోసారి నిర్మల్ జిల్లా ఖ్యాతి విరాజిల్లింది.నిర్మల్ జిల్లాకు జల అవార్డుల్లో భాగంగా,జల సంచాయి-జన్ భాగీదారి అవార్డు లభించింది.మంగళవారం,కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్ పాటిల్ చేతుల మీదుగా ఈ అవార్డును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్వీకరించారు.ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ వేదికయ్యింది.అవార్డు లభించడంపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పందిస్తూ,జిల్లాకు జలసంచాయ్-జన్ బాగీదారి అవార్డు లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.అధికారుల సమిష్టి కృషి,ప్రజల విలువైన భాగస్వామ్యంతో ఈ ఘన సాధ్యమైందని స్పష్టం చేశారు.అవార్డు రావడానికి కృషిచేసిన అధికారులకు,సహకారాన్ని అందించిన ప్రజలందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ అవార్డు వీరందరికీ చెందుతుందని తెలిపారు.అవార్డు స్వీకరించిన వారిలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో పాటు,జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి ఉన్నారు.నిర్మల్ జిల్లాకు జల సంచాయ్-జన భాగీదారి అవార్డు లభించడంపై అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్ కిషోర్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు.అవార్డు స్వీకరించిన కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.పలువురు అధికారులు,ప్రజా ప్రతినిధులు, ప్రజలు జిల్లాకు ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితోనే దేశం ఐక్యత

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్




హనుమకొండ ప్రతినిధి నవంబర్ 18 (జనం సాక్షి) : ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితోనే దేశం నేటికీ ఐక్యతతో ఉందని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.మంగళవారం హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మై భారత్, ఎన్ఎస్ఎస్, ఎన్సిసి సంస్థల ఆధ్వర్యంలో సర్దార్ఏ150 ఐక్యత పాదయాత్రను నిర్వహించారు.ఈ సందర్భంగా ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పూలమాలవేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహబరీష్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత దేశంలో స్వేచ్ఛ కోసం తపించేవారని, ఎన్ని భాషలు మాట్లాడిన ఎన్ని ప్రాంతాలు ఉన్న మనమందరం ఒకటేనని చాటి చెప్పేవారని వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా సంస్థానాలుగా విడివిడిగా ఉన్న దేశాన్ని ఒక్కటి చేయడంలో సర్దార్ పటేల్ కృషి చేశారన్నారు. భారత దేశ ప్రజల్ని చైతన్యపరిచి ఏకతాటిపై నడిపించిన మహనీయుడని కొనియాడారు. ప్రజలు ఆయన ఆశయ సాధన కోసం పని చేయాలన్నారు.అలాగే డ్రగ్స్ రహిత భారత దేశంగా తీర్చిదిద్దడానికి భారత ప్రభుత్వం చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞను యువతకు చేయించారు. అనంతరం కలెక్టర్ జెండా ఊపి పాద యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేరా యువభారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపరింటెండెంట్ బానోతు దేవిలాల్, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, కాకతీయ గవర్నమెంట్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్, కాకతీయ యూనివర్సిటీ స్టూడెంట్స్వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ ఇస్తారి, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ అప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేయాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



చిట్యాల, నవంబర్ 18( జనం సాక్షి) : తేమ, తాలు పేరుతో రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం చిట్యాల,అందుకు తండా, గిద్దె ముత్తారం గ్రామాలలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రైతులను రాజులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళాలకు విక్రయించి ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం మద్దతు ధరతో పాటు అదనంగా సన్న రకాలకు 500 బోనస్ను అందిస్తుంది. గ్రేడ్ ఏ రకం క్వింటల్ వారి ధాన్యానికి 2389 అదే విధంగా సాధారణ రకానికి 2369 అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నాణ్యమైన ధాన్యాన్ని అందించి మద్దతు ధరతో పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో షేక్ ఇమామ్ బాబా,మార్కెట్ కార్యదర్శి షరీఫ్,చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి, జిల్లా నాయకులు మధువంశీకృష్ణ, దొడ్డికిష్టయ్య, చిలుకల రాయకుమురు, బుర్ర శ్రీనివాస్, గడ్డం కొమురయ్య, బుర్ర లక్ష్మణ్ గౌడ్, అల్లకొండ కుమార్,దబ్బేట అనిల్ కుమార్, తిరుపతి, నరసింహారావు, మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి చేతులమీదుగా కలెక్టర్‌కు అవార్డు



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : దేశంలో ఆదిలాబాద్ జిల్లాకు మరో అవార్డు దక్కింది. జిల్లాలో జల సంరక్షణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు గుర్తింపుగా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జల్ చంచాయ్ – జన్ భాగీధారీ' కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా సౌత్ జోన్‌లో మొదటి స్థానం సాధించింది. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుతో పాటు రూ. 2 కోట్ల నగదు ప్రోత్సాహాన్ని కేంద్రం ప్రకటించింది. ఈ సందర్భంగా కేంద్ర జనశక్తి మంత్రిత్వశాఖ 2025 సెప్టెంబర్ 26న సంబంధిత ఉత్తర్వులను జారీ చేసింది. మంగళవారం న్యూఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. జిల్లాకు లభించిన ఈ జాతీయ స్థాయి గుర్తింపు పట్ల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడుదాం

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ బ్యూరో, నవంబర్18 (జనంసాక్షి) : నిషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడుదాం అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ హాజరై మాట్లాడుతూ యువత దేశ భవితవ్యమని, మత్తు పదార్థాలు వారి భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జిల్లా విద్యాధికారి భోజన్న విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని అన్నారు. బాలికల కళాశాల ప్రిన్సిపల్ సుల్తాన్, బాలుర కళాశాల ప్రిన్సిపల్ నవీన్ కుమార్ లు విద్యార్థులు మాదక ద్రవ్యాలను పూర్తిగా తగిలించుకోకుండా మంచి మార్గంలో సాగాలని సూచించారు. లెక్చరర్లంతా విద్యార్థులకు నిషా ముక్తి భారత్ లక్ష్యాలను వివరించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి విద్యార్థి బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కళాశాల ఆవరణ మొత్తం 'మత్తుకు నో చెప్పండి' సందేశంతో మార్మోగింది. ఈకార్యక్రమంలో నిర్మల్ అర్బన్, రూరల్ ఐసిడిఎస్ సూపర్వైజర్లు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

# మంచిర్యాల జిల్లాకు జాతీయస్థాయి పురస్కారం

- రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు తీసుకున్న మంచిర్యాల జిల్లా కలెక్టర్
- అవార్డుతో పాటు 2 కోట్ల రూపాయల నగదు పురస్కారం



మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 18, (జనంసాక్షి) : జల శక్తి మంత్రిత్వ శాఖకు చెందిన జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం (డీఓడబ్ల్యూఆర్, ఆర్డీ అండ్ జీఆర్) 2024వ సంవత్సరానికి గాను జాతీయ స్థాయి 6వ జల పురస్కారాలలో భాగంగా దేశ రాజధాని న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ ప్లీనరీ హాల్‌లో మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మంచిర్యాల జిల్లా తరపున జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలు జాతీయస్థాయిలో మొదటి 3 స్థానాలు సాధించాయి. జల్ సంచాయి – జన్ భాగిదారి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం 5 లక్షల 20 వేల 362 పనులను పూర్తి చేసి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకును సాధించింది. మొదటి కేటగిరిలో మంచిర్యాల జిల్లా అవార్డుతో పాటు 2 కోట్ల రూపాయల నగదు పురస్కారాన్ని పొందింది. కేంద్ర జలశక్తి శాఖ జాతీయ 6వ జల పురస్కారాలలో సంయుక్త విజేతలు సహా 46 విజేతలను ప్రకటించింది. ఈ పురస్కారాలను అత్యుత్తమ రాష్ట్రం, అత్యుత్తమ జిల్లా, అత్యుత్తమ గ్రామ పంచాయతీ, అత్యుత్తమ పట్టణ స్థానిక సంస్థ, అత్యుత్తమ పాఠశాల / కళాశాల, అత్యుత్తమ పరిశ్రమ, అత్యుత్తమ జల వినియోగదారు సంఘం, అత్యుత్తమ సంస్థ (పాఠశాల / కళాశాల కాకుండా) అత్యుత్తమ పౌర సంఘంతో పాటు జల రంగంలో అత్యుత్తమ వ్యక్తి అనే కేటగిరీలు ఉన్నాయి. ప్రతి పురస్కార విజేతకూ ప్రశంసపత్రం, ట్రోఫీతో పాటు కొన్ని కేటగిరీల్లో నగదు బహుమతులను అందజేశారు. జాతీయ సంపదగా పరిగణిస్తూ నీటి వనరుల్ని అభివృద్ధి చేయడం, సం రక్షించడంతో పాటు సమర్థంగా నిర్వ హించడానికి అవ సరమైన విధాన ప్రణాళికను సిద్ధం చేసి, ఆయా కార్య క్రమాలను అమలు పరిచే బాధ్యతను జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక కేంద్ర శాఖను ఏర్పాటు చేసి అప్పగించారు. నీటి నిర్వహణ, జల సంరక్షణల విషయంలో జాతీయ స్థాయిలో చైతన్యాన్ని పెంపొందింపచేయడానికి ప్రధాన మంత్రి మార్గదర్శకత్వంలో జల శక్తి శాఖ ఒక విస్తృత ఉద్యమాన్ని కొనసాగిస్తుంది. ఈ దృష్టి కోణానికి అనుగుణంగా, ప్రజల్లో నీటి ప్రాధాన్యం గురించి అవగాహనను పెంచడానికీ, నీటిని ఉపయోగించుకోవడంలో అత్యుత్తమ పద్ధతులను అనుసరించేలా వారిని ప్రోత్సహించడానికీ జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం (డీఓడబ్ల్యూఆర్, ఆర్డీ అండ్ జీఆర్) జాతీయ జల పురస్కారాలను ఇవ్వడాన్ని 2018లో మొదలుపెట్టింది. 2వ, 3వ, 4వ, 5వ జాతీయ జల పురస్కారాలను వరుసగా 2019, 2020, 2022, 2023 సంవత్సరాలలో అందించారు. హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ)కు చెందిన రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్‌లో 2024 అక్టోబరు 23న 2024 సంవత్సర 6వ జాతీయ జల పురస్కారాల (ఎన్‌డబ్ల్యూఏ) ప్రక్రియను ప్రారంభించగా 751 దరఖాస్తులు వచ్చాయి. న్యాయ నిర్ణేతల సంఘం దరఖాస్తుల పరిశీలన, మూల్యాంకనం పూర్తి చేశారు. ఎంపిక చేసిన దరఖాస్తులకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలనను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)తో కలిసి కేంద్ర భూగర్భ జల మండలి (సీజీడబ్ల్యూబీ) పూర్తి చేసింది. ఈ క్షేత్ర స్థాయి నివేదికలను ఆధారం చేసుకొని, సంయుక్త విజేతలు సహా మొత్తం 46 విజేతలను 2024 సంవత్సరానికి గాను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, జల శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి, జల వనరులు, నదుల వికాసం, గంగ సంరక్షణ విభాగం (డీఓడబ్ల్యూఆర్, ఆర్డీ అండ్ జీఆర్) కార్యదర్శి వి.ఎల్. కాంతా రావు, తాగునీరు, పారిశుధ్య విభాగం కార్యదర్శి అశోక్ కె.కె. మీనా, జల శక్తి శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టుల పాలనకు కేరళ ఆదర్శం

- సీపీఐ శతజయంతి ముగింపు ఉత్సవాలకు తరలిరావాలని పిలుపు
- సీపీఐ సీనియర్ నాయకుల మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి..
- హనుమకొండకు చేరిన సీపీఐ ప్రచార జాతా
- ముల్కనూర్, ఎల్కతుర్తి, హసన్‌పర్తిలో ఘన స్వాగతం



భీమదేవరపల్లి, నవంబర్ 18(జనం సాక్షి) : సీపీఐ శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ ప్రచార జాతా మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని ఎల్లమ్మ దేవాలయం నుంచి ప్రారంభమై అంబేద్కర్ కూడలి వరకు కళాబృందాల ఆటపాటలతో సాగింది. అనంతరం జాతా సీపీఐ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధాన అతిథిగా మాట్లాడిన సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టుల పరిపాలనకు కేరళ రాష్ట్రం దేశానికి ఆదర్శం అని అన్నారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించడం పేదరిక నిర్మూలన గృహాలు,విద్య,వైద్యం అందుబాటులోకి తేవడం వంటి అంశాలు కేవలం కమ్యూనిస్టు పాలన వల్లనే సాధ్యమయ్యాయని చెప్పారు. ఇందుర్తి, హుస్నాబాద్ సాగునీటి కోసం తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్లకు శంకుస్థాపనలు చేసిన విషయాన్ని గుర్తుచేసి, అనంతరం వచ్చిన ప్రజాప్రతినిధులు ఆ పనులను కొనసాగించలేదని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో జాతీయ స్థాయి ముగింపు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# తొర్రూరు ఆర్డీవో కార్యాలయం ఆస్తి జప్తు



తొరూరు నవంబర్ 18 (జనంసాక్షి) : మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన రైతులు సాధు శ్రీనివాసరెడ్డి, సాధు ధర్మారెడ్డి, కొరిపల్లి వెంకన్న ల వ్యవసాయ భూమి 2011 సంవత్సరంలో ఎస్సారెస్పీ కెనాల్ కు ప్రభుత్వం తీసుకుంది.మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం చెల్లించారు, కానీ రైతులు పరిహారం సరిపోలేదని మహబూబాబాద్ జిల్లా కోర్టును ఆశ్రయించగా, మహబూబాబాద్ జిల్లా న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ మరికొంత నష్టపరిహారం ఇవ్వాలని తొర్రూర్ ఆర్డీవో ను ఆదేశించింది. కోర్టు తీర్పు ప్రకారం డబ్బులు చెల్లించకపోవడంతో 8.10.2025న ఆర్డీవో కార్యాలయ ఆస్తుల జప్తుకు ఆదేశించారు. కోర్టు ఆదేశాల మేరకు ఈ రోజు కోర్టు సిబ్బంది, అడ్వకేట్ నరేందర్ లతో వచ్చి ఆర్డీవో కార్యాలయం ఆస్తులను జప్తు చేశారు.

# ఉద్యోగం ఇల్లందులో... ఉండేది హైదరాబాదులో..

- సివిల్ సప్లై లో అవినీతి అక్రమార్కుడు
- ఏసీబీకి చిక్కిన అవినీతి తిమింగలం.. యాకుబ్ పాషా
- సివిల్ సప్లై అధికారితో పాటు మరో ఇద్దరిని
- అదుపులోకి దిగుతున్న ఏసీబీ అధికారులు



**టేకులపల్లి, నవంబర్ 18 (జనంసాక్షి) :** సివిల్ సప్లైలో రేషన్ షాప్ డీలర్ల వద్ద బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తూ అవినీతి సంపాదనకు మరిగి చివరకు పాపం పండి ఏసీబీ వల్లలో చిక్కాడు. ఆ ప్రబుద్ధుడు చేసే ఉద్యోగం ఇల్లందులో.. మకాం హైదరాబాదులో ఉంటూ తన కింద పని చేసే వారిని లైన్లో పెట్టుకుని అవినీతి సంపాదనలకు అలవాటు పడ్డాడు. అతనే ఇల్లందులో సివిల్ సప్లై అధికారిగా పనిచేసే యాకూబ్ పాష. ఓ రేషన్ షాపును తనిఖీ చేసి రైస్ షార్ట్ ఏజ్ ఉన్నదని కేసులు పెడతానని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసి,రేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారా డీలర్ ను 30 వేల రూపాయలు ఇవ్వాలని ఒత్తిడి చేయించిన యాకూబ్ పాషా.సివిల్ సప్లై అధికారి యాకూబ్ పాషా ఒత్తిడిని తట్టుకోలేక ఏసీబీ ని ఆశ్రయించిన డీలర్.సివిల్ సప్లై అధికారి పాషా ఏర్పాటు చేసుకున్న మధ్యవర్తికి రూపాయలు డీలర్ ఇస్తుండగా పథకం ప్రకారం పట్టుకున్న ఏసీబీ అధికారులు. 2011లో ఖమ్మం జిల్లా కొనిజర్ల లో ఏసీబీ ట్రాప్ కు శిక్ష అనుభవించిన యాకూబ్ పాషా. 2014లో రేషన్ తరలిస్తూ సస్పెండ్ అయినా అవినీతి అక్రమాల విక్రమార్కుడు యాకూబ్ పాషా. ఇల్లందు, టేకులపల్లి మండలాల సివిల్ సప్లై అధికారిగా ఉంటూ గుండాల,ఆళ్లపల్లి మండలాలలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ వసూల్ రాజాగా మారి.. రెండవ సారి ఇల్లందులో ఏసీబీకి చిక్కిన యాకూబ్ పాషా రెండుసార్లు ఏసీబీకి చిక్కి, ఒకసారి సస్పెండ్ అయిన తన తీరు మార్చుకోలేదు.రేషన్ డీలర్ల ను బెదిరిస్తూ, వేధిస్తూ.. నెలవారిగా డబ్బులు వసూలు చేసేందుకు విధుల నిర్వహణ పేరుతో హైదరాబాదు నుండి ఇల్లందుకు వస్తూ ఉంటాడు. లంచాల చెంచాగా మారి.. లంచాలు ఇవ్వని డీలర్ల ను ముప్పు తిప్పలు పెడుతుంటాడని డీలర్లు వాపోతున్నారు. ముడుపులు ముడితే నామమాత్రపు కేసులు,నామమాత్రపు తనిఖీలు చేపడుతుంటాడు. అక్రమ సంపాదన ధ్యేయంగ నామ మాత్రపు విధులు నిర్వహిస్తూ సివిల్ సప్లై అధికారి అడ్డదారిలో అడ్డంగా సంపాదిస్తూ పాపం మూటగట్టుకుని అడ్డంగా దొరికిపోయాడు.ఈ సంఘటన ఇల్లందులో చోటు చేసుకుంది.ప్రభుత్వ ఉద్యోగులుగా తమ విధులను సక్రమంగా నిర్వహిం చాల్సిన అధికారులు లంచాల అక్రమార్కులుగా మారిపోతున్నారు. లక్షల రూపాయలు వేతనాలు పొందుతూ అది చాలదని అక్రమార్జనకు ఒడి కడుతూ కోట్లకు పరిగెత్తుతున్నారు. పై అధికారుల ను మచ్చిక చేసుకుని దొరలాగా తిరిగినప్పటికీ అప్పుడప్పుడు దొరికిపోయి దొంగలవుతున్నారు. ఇందుకు ఇల్లందు, టేకులపల్లి మండలాలలో సివిల్ సప్లై అధికారిగా విధులు నిర్వహిస్తూ... ఓ డీలర్ వద్దనుండి మధ్యవర్తుల ద్వారా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన యాకూబ్ పాషాను ఉదాహరణగా తీసుకోవచ్చు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,ఇల్లందులో మధ్యవర్తి ద్వారా రేషన్ డీలర్ నుండి 30 వేల రూపాయలు లంచం తీసుకుంటూ సివిల్ సప్లై అధికారితో పాటు మరో ఇద్దరు ఏసీబీకి చిక్కారు.ఇల్లందు,టేకులపల్లి మండలాల సివిల్ సప్లై అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న డిటియాకూబ్ పాషా ఇల్లందులోని ఓచౌక దుకాణ డీలర్ ను 30 వేల రూపాయలు డిమాండ్ చేసి గత కొన్ని రోజులు గా మధ్యవర్తుల ద్వారా ఒత్తిడి తీసుకొస్తూ ఇబ్బందు లకు గురిచేశాడు. డిటి యాకూబ్ పాషా ఇల్లందు మండల రేషన్ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు శబరీస్ ను మధ్యవర్తి గా నియమించుకొని డబ్బులు వసూలు చేసేటువంటి ప్రక్రియ ప్రారంభిస్తున్నాడు. ఇదే క్రమంలో యాకూబ్ పాషా ఆదేశాల మేరకు సివిల్ సప్లై టెక్నీషియన్ అసిస్టెంట్ విజయ్. రీసెంట్ డీలర్ అసోసియేషన్ అధ్యక్షులు శబరిస్ తోటి డీలర్ ను డబ్బుల కోసం గత కొన్ని రోజులుగా ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బాధిత డీలర్ ఏసీబీని ఆశ్రయించగా ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి శబరిస్కు డీలర్ డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండు గా పట్టుకున్నారు. దీంతో సివిల్ సప్లై అధికారి యాకూబ్ పాషతోపాటు శబరిస్ను, టెక్నిషి అసిస్టెంట్ విజయలను అదుపులోకి తీసుకొనివిచారిస్తున్నారు.

సివిల్ సప్లై అధికారి యాకుబ్ పాషా 2011లో ఖమ్మం జిల్లా, కొనిజర్లలో ఏసీబీకి చిక్కాడు. 2014లో అవినీతికి పాల్పడినందున సస్పెండ్ అయ్యాడు. అయినా ఆయన తీరులో మార్పు లేదు. యాకూబ్ పాషా తను ఉండేది హైదరాబాదులో విధులు నిర్వహించేది మాత్రం ఇల్లందులో అత్తగారింటికి వచ్చినట్టు, అప్పుడప్పుడు విధుల నిర్వహణ పేరుతో ఇల్లందుకు వచ్చి వెళ్తాడు. డీలర్ల నుండి డబ్బులు వసూలు చేసేందుకే హైదరాబాదు నుండి ఇల్లందుకు వస్తాడని ఆరోపణలు ఉన్నాయి. అక్రమార్చనే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్నాడు. తనను ఎవరు ఏమి చేయలేరన్న ధీమాతోఉన్నాడు. తనకు రాజకీయ నాయకుల అండ ఉన్నదని చెప్పుకుంటూ అప్పుడప్పుడు విధులకు హాజరవుతున్నా విధి నిర్వహణలో నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నా, బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తున్నా యాకూబ్ పాషాను పట్టించుకునే నాథుడే లేడు. ఫలితంగా నేనే రాజును.. నేనే మంత్రిని చందంగా వ్యవహరిస్తున్నాడు. ముడుపులు తీసుకుని నామమాత్రపు తనిఖీలు చేస్తూ అవినీతికి దార్లు వేస్తున్నాడు. అవినీతికి అక్రమాలకు పాల్పడిన వారిని శిక్షించాల్సిన అధికారి తానే ఒక అవినీతిపరుడుగా మారడం గమనారహం. ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని పేదలకు సక్రమంగా అందించవలసిన బాధ్యతను మరిచి పోయి వ్యవహరిస్తున్నాడు. చిన్న పొరపాటు జరిగిన రేషన్ డీలర్ల పై కేసులు నమోదు చేస్తానని బెదిరిస్తూ డబ్బులు దండుకుంటున్నాడు. రేషన్ డీలర్లు డబ్బులు ఇస్తే మాత్రపు నామమాత్రపు కేసులతో సరిపెడుతున్నాడు. ఎలాంటి పొరపాట్లు జరగక పోయినా ప్రతి డీలర్ నుండి నెలకు పదివేల రూపాయల చొప్పున వసూలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. డీలర్ల చెవులు పిండి మరీ డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపణ ఉంది. డబ్బులు ఇవ్వలేని పరిస్థితిలో డీలర్లు ఉన్నప్పటికీ ఒత్తిడికి గురిచేసి లంచాలు పొందుతున్నాడు. అంతేగాక అధికారి యాకుపాష పరిధిలో ఉన్నటువంటి పెట్రోల్ బంకులు, గ్యాస్, రేషన్ మిల్లులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నప్పటికీ పట్టించుకునే పాపాన పోలేదనే ఆరోపణలు ఉన్నాయి.పెట్రోల్ బంకులలో నిబంధనల ప్రకారం బాత్రూములు ఉండాలి. వాహనాలకు గాలి నింపే మిషన్ లో ఉండాలి. వాటర్ సౌకర్యం ఉండాలి. అదేవిధంగా గ్యాస్ సరఫరా ఇష్టారాజ్యంగా విక్రయాలు జరుపుతు న్నారు. అధిక రేట్లకు విక్రయిస్తున్నారు.రేషన్ మిల్లులు పొల్యూషన్ ఇతర సమస్యలు ఉన్నాయి.

ఇలా సివిల్ సప్లై అధికారి పరిధిలో ఉన్నటువంటి సంస్థలపై ఎలాంటి పర్యవేక్షణ లేదు. ఆయా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇంత అవినీతికి పాల్పడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయటంలో తన పాత్రను పోషిస్తున్న యాకూబ్ పాషా ను ఉద్యోగం నుండి పూర్తిగా తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## మాదకద్రవ్యాల నిరోధానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**భువనగిరి, నవంబర్ 18 (జనంసాక్షి) :** మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆద్వర్యంలో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హనుమంత రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సమక్షంలో అధికారులు, ఉద్యోగులు అందరూ కలసి మాదకద్రవ్యాల నిరోధక సామూహిక ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ ఏ ఒక్కరు కూడా డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారు సూచించారు. గంజాయి తోపాటు ఇతర మత్తు పదార్థాలు అమ్మిన కొనుగోలు చేసిన అక్రమ రవాణా చేసిన ఆ వ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలని డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు తెలిపారు. అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, టీజేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, వైద్య శాఖ అధికారి డా.మనోహర్,జిల్లా , పలు విభాగాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు కోసం కట్టుదిట్టమైన పాఠశాల భవనాలు నిర్మించాలి



**చౌటుప్పల్, నవంబర్ 18 (జనం సాక్షి) :** తాము సొంత ఇల్లు కట్టుకునేటప్పుడు ఎంత శ్రద్ధగా జాగ్రత్తలు తీసుకుంటామో, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పాఠశాలల భవనాలను నిర్మించే సమయంలో కూడా అంతే శ్రద్ధ, జాగ్రత్తగా కట్టాలని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు.మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనపై ఆయన దృష్టి సారించాలని సూచించారు. చౌటుప్పల్‌లోని క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో నారాయణపూర్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం నూతన భవనం ఆధునీకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తరగతి గదిలో విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలంటే మెరుగైన సదుపాయాలు ఉండాలని కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పిస్తున్నామన్నారు. మర్రిగూడ కేజీబీవీ పాఠశాలలో ఇప్పటికే రూ. 1.50 కోట్ల సొంత నిధులతో మెరుగైన సదుపాయాలు కల్పించామన్నారు. నియోజకవర్గంలోని మొత్తం 18 రెసిడెన్షియల్ పాఠశాలల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికాలు రూపొందిస్తున్నామని తెలిపారు. మెరుగైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నుండి మంజూరవుతున్న నిధులకు తోడుగా, కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ తరపున కూడా సొంత నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. చలికాలంలో విద్యార్థులకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడి నీటి కోసం గీజర్‌లు, ఇన్వర్టర్, డైనింగ్ హాల్, టాయిలెట్ల ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీఈవో సత్యనారాయణ, ఎంఈఓ గురువారెడ్డి, డీఈ శివ కుమార్, కాంట్రాక్టర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు పై కేంద్రం నిబంధనలు సరికాదు



**అమరచింత, నవంబర్ 18 (జనం సాక్షి) :** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా అధ్యక్షులు ఎస్.అజయ్. మంగళవారం నాడు అమరచింత మండల పరిధిలోని పామిరెడ్డిపల్లిలో పత్తి రైతుల సమస్యలను తెలుసుకుని అనంతరం ఆయన మాట్లాడుతూ. వనపర్తి జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎకర పంటకు గాను కనీసం 11 క్వింటాళ్లు దిగుబడి పత్తి రాగా కేంద్ర ప్రభుత్వం మాత్రం ఒక్కో రైతు నుండి కేవలం ఏడు క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తామని అందుకుగాను కేంద్ర ప్రభుత్వం కపాస్ కిసాన్ యాప్ లో రైతులు ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని నిబంధనలు పెట్టడం వల్ల తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 80% మంది రైతులకు ఈ యాప్ పట్ల అవగాహన లేదని. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లోని రైతు వేదికల వద్ద పత్తి రైతులకు అవగాహన కల్పించడంతోపాటు అక్కడే వివరాలను నేరుగా యాప్ లో నమోదు చేస్తే రైతులకు కొంత ఊరట లభిస్తుందని అన్నారు. పత్తిలో తేమశాతం కనీసం 12 శాతం ఉండాలన్న నిబంధన సరికాదని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసే పత్తికి మద్దతు ధర కేవలం 8110. ఏ మాత్రం గిట్టుబాటు ధర కాదని కనీసం క్వింటాలు కు పదివేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.తెలంగాణ లోని పత్తి మిల్లుల యాజమాన్యాలు సమ్మెకు దిగడంతో కొనుగోలు నిలిచిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు పత్తి కొనుగోలు కేంద్రాలు సూదురప్రాంతాల్లో ఉండటం వల్ల రవాణా ఖర్చులకే అధికంగా అవుతున్నాయని రైతులు ఆందోళన వెలిబుచ్చారు. ఎకరం పత్తి పంట సాగుకు కనీసం 40 వేలు ఖర్చు అవుతున్నదని. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి రైతులు నష్ట పోతున్నారని ఆవేదన ఆందోళన వ్యక్తం చేశారు. అటు భారీ వర్షాల వల్ల ఇటు కేంద్ర ప్రభుత్వం పెట్టిన కఠిన నిబంధనల వల్ల పత్తి రైతుల కనీస గిట్టుబాటు ధర రావడంలేదని విమర్శించారు కావున సీసీఐ నిబంధన లు సవరించి పత్తి కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అమరచింత మండల అధ్యక్షులు కే శంకర్ . మోహన్. ఆశన్న. బాలకృష్ణ వడ్డెటి శీను. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో రైతుకు పెద్దపీట

- ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం
- పలు సిసి రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం
- ఘనంగా స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు



**బూర్గంపహాడ్, నవంబర్ 18 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం మొరంపల్లి బంజర గ్రామంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులకు పెద్దపీట వేసిందని, అభివృద్దే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొను గోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సింగిల్‌విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని మద్దతు ధర పొందాలని తెలిపారు. సన్నవడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని అన్నారు. ధాన్యంలో తరుగు పేరుతో కోతలు లేకుండా చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో రైతులకు డబ్బులు చెల్లించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు ధాన్యంలో తేమ శాతం ఉండేలా రైతులు చూసు కోవాలని తెలిపారు. రైతుకు అండగా ఉంటానని, ఏ చిన్న సమస్య తలెత్తినా ఫోన్ చేస్తే స్పందిస్తానని ఎమ్మెల్యే పాయం హామీ ఇచ్చారు.

### సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం.

బూర్గంపహాడ్ గ్రామపంచాయతీ పరిధి గౌతమీపురం కాలనీ, స్థానిక మండలం నాగినేని ప్రోలు రెడ్డిపాలెం గ్రామాలలో నిర్మించిన రూ. 20 లక్షల అంచనా వ్యయం తో నిర్మించిన సీసీ రోడ్ల ఎమ్మెల్యే పాయం ప్రారంభించారు. తొలుత ఆయనకు బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బూర్గంపహాడ్ మండల ప్రజలు మాట్లాడుతూ మా ప్రాంతానికి ఎన్నో అభివృద్ధి ఫలాలు తెస్తూ నిరంతరం ప్రజల మధ్యలోనే ఉంటూ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్న పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఏ తాతారావు, ఎంపీడీవో జమలా రెడ్డి, తాసిల్దార్ కేఆర్ కే వి ప్రసాద్, పంచాయతీరాజ్ డి ఈ వెంకటేశ్వర్లు, ఏ ఈ చారి, మండల వ్యవసాయ శాఖ అధికారి శంకర్, మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్, బూర్గంపహాడ్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మంద నాగరాజు, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, మండల ముఖ్య నాయకులు భజన ప్రసాద్, చల్లా వెంకటనారాయణ, సుధాకర్ రెడ్డి, దాసరి సాంబ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# షరతులు విధించకుండా పత్తి కొనుగోలు చేయాలి

**జడ్చర్ల, నవంబర్ 18 (జనంసాక్షి) :** రైతులు పండించిన పత్తిని ఎలాంటి నిబంధనలు, షరతులు విధించకుండా కొనుగోలు చేయాలని జడ్చర్ల బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పత్తి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బిఆర్ఎస్ నాయకులు జడ్చర్ల ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న పత్తి కొనుగోలు జిన్నింగ్ మిల్లు ఎదురుగా రైతులతో కలిసి నిరసన



వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పత్తి పంటను అమ్మడానికి తీసుకువస్తే లేనిపోని షరతులు పెట్టి కొనుగోలులో ఆలస్యం చేయడం తగదని, వెంటనే ఇలాంటి షరతులు లేకుండా రైతులు తీసుకువచ్చిన పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, రఘుపతి రెడ్డి, ప్రనిల్ చందర్, కరాటే శ్రీను, శంకర్ నాయక్, కృష్ణారెడ్డి, రవి నాయక్, పరమటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వివరాలను సకాలంలో నమోదు చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 18 (జనంసాక్షి) :** ధాన్యం కొనుగోలు వివరాలను సకాలంలో ట్యాబ్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించే ఐకెపి, పీఏసిఎస్, మెప్మా, ఎఫ్పీఓ లకు చెందిన అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించిన వెంటనే బిల్లులను పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ కార్యాలయంలో సమర్పిస్తే వేగవంతంగా రైతుల అకౌంట్ లో డబ్బులు జమ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ధాన్యం కొనుగోలు విషయంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎం రాము, డిసిఓ ప్రవీణ్ కుమార్, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హాలియా అల్వాల్ క్రాస్ రోడ్డుపై గంజాయి రవాణా

**హాలియా, నవంబర్ 18 (జనం సాక్షి) :** హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలోని పంగవానికుంట తండా గ్రామ పరిధిలో ఉన్న అల్వాల్ క్రాస్ రోడ్డుపై ఈనెల 17న అక్రమంగా మాచర్ల నుండి హాలియాకు గంజాయి రవాణా జరుగుతుందనే ఖచ్చితమైన సమాచారం మేరకు హాలియా ఎస్ఐ బి. సాయి ప్రశాంత్, సిబ్బంది ప్రత్యేక దాడులు నిర్వహించి నలుగురు నిందితులను పట్టుకున్నారని సబ్ డివిజనల్ పోలీస్ అధికారి, కే. రాజశేఖర్ రాజు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మొహమ్మద్ రియాజ్ బాబా (బైక్ మెకానిక్, 22 సంవత్సరాలు), సల్లా అజయ్ (సెల్ మెకానిక్, 26 సంవత్సరాలు), షేక్ జీషాన్ హుస్సేన్ (విద్యార్థి, (22), అమరవరపు జేమ్స్ (పెట్రోల్ బంక్ వర్కర్, (22), కేశమల్ల అంజి (డిజే ఆపరేటర్, (18) లు స్నేహితులు కలిసి గంజాయికి అలవాటు పడి మాచర్లకు వెళ్లి గంజాయి కొనుగోలు చేసేవారని, మాచర్లకు చెందిన చల్లా చిన్న అంజనేయులు బండా అంజి (24), అతని అన్న చల్లా పెద్ద అంజనేయులు అలియాస్ మ్యాక్స్ (30) గుంటూరు ప్రాంతాల నుండి గంజాయి తెచ్చి హాలియా పట్టణం లోని చుట్టుపక్కల యువకులకు అమ్మేవారని, కాగా పెద్ద అంజనేయులు, జేమ్స్, దేశమల్ల అంజి ప్రస్తుతం పరారీలో ఉన్నారని తెలిపారు. అరెస్టు అయిన వారిలో మొహమ్మద్ రియాజ్ బాబా, తండ్రి మొహమ్మద్ షరీఫ్ బాబా, వయస్సు 22 సంవత్సరాలు, వృత్తి: బైక్ మెకానిక్, నివాసం: హాలియా, 2. పల్లా అజయ్, తండ్రి సైదులు, వయస్సు 26 సంవత్సరాలు, వృత్తి: సెల్ ఫోన్ టెక్నీషియన్, నివాసం: హాలియా, 3. షేక్ జీషాన్ హుస్సేన్, తండ్రి షేక్ అహ్మద్ హుస్సేన్, వయస్సు 22 సంవత్సరాలు, వృత్తి: విద్యార్థి, నివాసం: హాజరిగూడెం, 4. చల్లా చిన్న అంజనేయులు అలియాస్ బండా అంజి, తండ్రి మంగయ్య, వయస్సు 24 సంవత్సరాలు, వృత్తి: మేసన్, నివాసం: మాచర్ల (ఆంధ్రప్రదేశ్)లు ఉన్నారని చెప్పారు. వారి నుంచి గంజాయి 1200 గ్రాములు, దీని విలువ రూ.30 వేలు అని, ఒక పల్సర్ బైక్ నెంబర్ టీఎస్ 05 ఎఫ్ జే 6454, 4 సెల్ ఫోన్‌లు, నగదు 2 వేలు స్వాధీనం చేసుకున్న తెలిపారు. అలాగే పరారీలో చల్ల పెద్ద ఆంజనేయులు అలియాస్ మ్యాక్స్ , అమరవరపు జేమ్స్, కేశమల్ల అంజిలు ఉన్నారని తెలిపారు. నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఐ పీ ఎస్ ఆదేశాల మేరకు మిషన్ పరివర్తనలో భాగంగా హాలియా సిఐ జి. సతీష్ రెడ్డి పర్యవేక్షణలో, ఎస్ఐ బి. సాయి ప్రశాంత్ ఆధ్వర్యంలో



సిబ్బంది క్లూస్ టీమ్ కలిసి ఈ ఆపరేషన్‌ను విజయవంతం చేశారని వైద్య పరీక్షల అనంతరం అరెస్టైన నిందితులను న్యాయస్థానంలో రిమాండ్‌కు హాజరుపరచనున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని తెలిపారు. అలాగే గంజాయి బాధితులకు చిట్యాలలో డీ హ్యాబిటేషన్ సెంటర్ ను ఏర్పాటు చేసినట్లు ఎస్సై సాయి ప్రశాంత్ తెలిపారు.

# 5 రోజుల్లో రూ. 5వేలు!

## • బంగారం ధరల్లో భారీ మార్పు



న్యూఢిల్లీ:అమెరికా డాలర్ బలపడటం, వచ్చే నెలలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటును తగ్గిస్తుందనే ఆశలు సన్నగిల్లడం వంటి కారణాల వల్ల ప్రపంచ మార్కెట్లలో.. మంగళవారం బంగారం ధరలు పడిపోయాయి.భారతదేశంలో నేడు (మంగళవారం) 24 క్యారెట్ల బంగారం ధర రూ. 123660 (10 గ్రామ్స్), 22 క్యారెట్ల ధర రూ. 1,13,350 వద్ద ఉన్నాయి. నిన్నటి ధరలతో పోలిస్తే.. ఈ రోజు ధరలు వరుసగా రూ. 1740 రూ. 1600 తక్కువ. పసిడి ధరలు ఇంకా తగ్గే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.నవంబర్ 13న రూ. 1,28,620 లక్షల వద్ద ఉన్న 24 క్యారెట్ల బంగారం ధర.. ఈ రోజు (నవంబర్ 18) రూ. 1,23,660 వద్దకు చేరింది. దీన్నిబట్టి చూస్తే.. కేవలం ఐదు రోజుల్లో రూ. 4960 తగ్గిందని తెలుస్తోంది. అంటే ఐదు రోజుల్లో దాదాపు రూ.5వేలు తగ్గిందన్నమాట.వెండి విషయానికి వస్తే.. రూ. 1.83 లక్షల (నవంబర్ 13) వద్ద ఉన్న సిల్వర్ రేటు.. నేటికి రూ. 1.70 లక్షలకు చేరింది. అంటే వెండి రేటు కూడా ఐదు రోజుల్లో రూ. 13వేలు తగ్గిందన్నమాట.అమెరికా డాలర్ విలువలో హెచ్చుతగ్గులు, ఫెడ్ వడ్డీ రేట్లు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి. ఫెడ్ వడ్డీ రేటు పెరిగినప్పుడు.. గోల్డ్ రేటు తగ్గుతుంది. ఫెడ్ వడ్డీ రేటు తగ్గినప్పుడు.. పసిడి ధరలు పెరుగుతాయి. బంగారం ధరలు పెరుగుదల, తగ్గుదలల మీద.. రాజకీయ, భౌగోళిక కారణాలు.. ఆర్థిక వ్యవస్థలు ప్రభావం చూపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

# నష్టాల్లో సూచీలు..

## • 6 రోజుల వరుస లాభాలకు బ్రేక్



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాల నేపథ్యంలో సూచీలు నష్టాల బాట పట్టాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, రియాల్టీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. అమెరికా టెక్ స్టాక్స్‌లో విక్రయాల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు సహా మన మార్కెట్లూ నష్టాలు చవిచూశాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాన్ని ప్రభావితం చేసే కీలక డేటా ఈ వారం వెలువడనుండడంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఈ క్రమంలోనే సూచీల ఆరు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది.సెన్సెక్స్ ఉదయం 85,042.37 (క్రితం ముగింపు 84,950.95) వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84,558.36- 85,042.41 మధ్య కదలాడింది. చివరికి 277.93 పాయింట్లు నష్టపోయి 84,673.02 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 103.40 పాయింట్లు క్షీణించి 25,910.05కి పడిపోయింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.61గా ఉంది. సెన్సెక్స్ 30లో టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, ఎటెర్నల్, అదానీ పోర్ట్స్ షేర్లు ప్రధానంగా నష్టాల్లో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, టైటాన్, పవర్ గ్రిడ్ షేర్లు లాభాలు నమోదు చేశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.02 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,041.49 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




# 996 ఫార్ములా..

## ఇన్ఫోసిస్ నారాయణమూర్తిపై ఆగ్రహం!

**న్యూఢిల్లీ**వారానికి 72 గంటల పని మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో ఈ వ్యాఖ్యలు చేసిన ఇన్ఫోసిస్ నారాయణమూర్తిని కొందమంది సమర్థించారు. మరికొందరు విమర్శించారు. అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో భారత్ నిలవాలంటే..996 నియమం చాలా అవసరం అని ఆయన మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు.

**ఏమిటీ 996 రూల్..:**చైనాలో పాటిస్తున్న 9-9-6 నియమాన్ని ఇన్ఫోసిస్ నారాయణమూర్తి తాజాగా ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 996 ఫార్ములా ప్రకారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పని, వారానికి 6 రోజులను సూచిస్తుంది. అంటే రోజుకు 12 గంటలు.. 6 రోజులు చేయాలన్నమాట. ఇలా మొత్తానికి వారానికి 72 గంటలు పనిచేయాలన్నమాట. చైనాలోని చాలా కంపెనీలు ఈ నియమాన్ని పాటిస్తున్నాయి. దీనిపై అనేక విమర్శలు వచ్చాయి. కొన్ని సంస్థలు ఈ నియమాన్ని రద్దు చేసినప్పటికీ.. ఇంకొన్ని అమలు చేస్తూనే ఉన్నాయి. కాగా చైనా ప్రభుత్వం కూడా దీనిని క్రమంగా నియంత్రించడానికి తగిన చర్యలను తీసుకుంటోంది. అలాంటి ఈ విధానాన్ని నారాయణమూర్తి ప్రస్తావించడం.. కొంత మందిలో ఆగ్రహాన్ని కలిగిస్తోంది.ప్రపంచ దేశాలతో మన దేశం పోటీ పడాలంటే.. తప్పకుండా యువత మరింత నిబద్దతతో పనిచేయాలి. భారత్ వృద్ధి రేటు 6.57 శాతం. దీని కంటే ఆరు రెట్లు పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనాతో మనం పోటీ పడాలంటే.. పనిగంటలు పెంచాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారానికి 100 గంటలు పనిచేస్తారని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు అన్నారు.



# లోగో గుర్తుపట్టలేదని ఉద్యోగమివ్వలేదు

## ఆటో డ్రైవర్‌నుంచి రూ. 400 కోట్ల కంపెనీకి సీఈవోగా..

**న్యూఢిల్లీ:**నడి గుండెల్లో నిప్పుంది మండించు దాన్ని ఆ మంటల్లో వెలిగించు నీ రేపటిని అంటాడో సినీ కవి. ఈ సరిగ్గా ఈ మాటలకు అతికినట్టు సరిపోయే సక్సెస్ స్టోరీ బిహార్‌కు చెందిన ఆటో డ్రైవర్ ది. ఎక్కడో ఒక మారు మూల గ్రామంలో పుట్టాడు. చదివింది 12వ తరగతే. సెక్యూరిటీ గార్డు ఉద్యోగానివెళితే.. కాదు పొమ్మన్నారు. కట్ చేస్తే 400 కోట్ల కంపెనీ సీఈవో. ఆసక్తిగా ఉంది కదూ.. పదండి ఈ విజయగాథ ఏంటో తెలుసుకుందాం.ఇది బిహార్‌కు చెందిన దిల్‌ఖుష్ కుమార్ కథ. ఇతని సక్సెస్ స్టోరీ గ్రాడ్యుయేట్లను దిగ్భ్రాంతికి గురి చేస్తుంది. పట్టుదలగా పనిచేస్తే, దిల్ ఉంటే.. ఆటో డ్రైవర్ కూడా ఒక కార్పొరేట్ కంపెనీ సీఈవోగా సత్తా చాటవచ్చని నిరూపించిన కథ. 12వ తరగతి చదివిన ఒక సాధారణ యువకుడు ఆటో డ్రైవర్‌గా నానా కష్టాలు పడ్డాడు. కానీ వాటినే తలుచుకుంటూ అక్కడే ఆగిపోలేదు దిల్‌ఖుష్. ఈ రోజు రూ.400 కోట్ల వ్యాపార ప్రపంచాన్ని సృష్టించాడు.తన చదువుకు తగ్గట్టుగా అనుకొని ఒక రోజు సెక్యూరిటీ గార్డ్ పోస్టుకు దరఖాస్తు చేశాడుదిల్ ఖుష్ కానీ విద్యార్హతలు సరిపోవంటూ తిరస్కరించారు. దీంతోపాటు అనేక ఇంటర్వ్యూలకు వెళ్లాడు. యాపిల్ లోగోను గుర్తించలేకపోవడంతో ఈ ఉద్యోగం పొందలేకపోయాడు. ఈ తిరస్కరణలు అతన్ని వెనక్కి నెట్టలేదు, మరింత కసి పెంచాయి. ముందుకు నడిపించాయి. తానూ పదిమందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని నిర్ణయించు కున్నాడు. ఆటో డ్రైవర్‌గా జీవితాన్ని ఆరంభించాడు. అదే ఎన్నో జీవిత పాఠాల్ని నేర్పించింది. ఎన్నో సమస్యల్ని కళ్లారా చూశాడు. వాటిల్లోంచే ఒక మెరుపు లాంటి ఆలోచన తట్టింది. ఒక నగరం నుండి మరొక నగరానికి వెళ్లాలనుకుంటే సురక్షితమైన మార్గం లేదనీ, సుదూర ప్రాంతాలకు, టాక్సీలు ఖరీదైనవి , నమ్మదగినవి లేవని గమనించాడు. చాలామంది అతని కస్టమర్లు కూడా ఇదే ఫిర్యాదు చేశారు. తానే ఏదో చేయాలని నిర్ణంచుకున్నాడు. పెద్దగా పెట్టుబడిలేదు. ధైర్యమే అతని పెట్టుబడి. 2016లో "రోడ్‌బెజ్" అనే యాప్ సేవను ప్రారంభించాడు. ఇదిరైడ్-హైలింగ్ యాప్ కాదు, సొంత టాక్సీలూ ఉండవు. విశ్వసనీయ నెట్‌వర్క్. కానీ ప్రజలు, సర్టిఫైడ్ , నమ్మకమైన స్థానిక డ్రైవర్లను కలిపే నమ్మకమైన ప్లాట్‌ఫారమ్. "రోడ్‌వేస్" అనే ఆలోచన సరళమైనది కానీ శక్తివంతమైనది. 50 కిలోమీటర్ల కంటే ఎక్కువ ప్రయాణం చేసే వారికి వాహనాలను అందిస్తుంది.రోడ్‌బెజ్ వన్-వే టాక్సీలను అందించింది, కాబట్టి మీరు రౌండ్ ట్రిప్ కోసం చెల్లించాల్సిన అవసరం లేదు. వారు 50 కి.మీ కంటే ఎక్కువ దూరం ప్రయాణించడానికి కార్‌పూలింగ్, రైడ్-షేరింగ్‌ను ప్రోత్సహించారు. దీని వలన సామాన్యులకు కూడా సుదూర ప్రయాణాలు అందుబాటులోకి వచ్చాయి. అలా మొత్తం రాష్ట్ర ప్రయాణ అనుభవాన్ని నెమ్మదిగా మార్చాడు. తరువాత 2021 లో,బిహార్‌లోని ప్రతి నగరాన్ని అనుసంధానించడానికి అతను ఒక యాప్‌ను ప్రారంభించాడు. అతనిని , అతని ఆలోచనను, పెట్టుబడిదారులు నమ్మారు. రూ. 40 లక్షల ప్రారంభ నిధులు వచ్చాయి. అతను అందించిన గ్యారెంటీ గేమ్-ఛేంజింగ్. రోడ్‌బెజ్ డ్రైవర్ పొరబాటు కారణంగా ఒక వేళ విమానాన్ని మిస్ అయితే, కంపెనీ కొత్త టికెట్ బుక్ చేస్తుంది. అంతకు ముందు ఇలాంటి ఆఫర్ మరి ఏ సంస్థ ఇవ్వలేదు. భారీ ఆదరణ లభించింది. కేవలం 7 నెలల్లోనే దిల్‌ఖుష్, అతడి టీమ్ ఏకంగా రూ.4కోట్ల నిధులను సమీకరించింది. షార్క్ ట్యాంక్ ఇండియా సెట్‌లోకి అడుగుపెట్టినప్పుడు అతని ప్రతిభ మరింత వెలుగులోకి వచ్చింది. దేశంలోని అత్యంత తెలివైన వ్యాపారవేత్తల ముందు, ఐఐటీ గ్రాడ్యుయేట్ల ముందు నమ్మకంగా నిలబడి, తన కంపెనీలో 5 శాతం కోసం రూ. 50 లక్షలు అడగడంతో వారంతా షార్క్స్ ముగ్ధులయ్యారు. మార్కెట్‌పై అతని లోతైన అవగాహన, అద్భుతమైన ప్రయాణాన్ని చూసి ఫిదా అయిపోయారు. చివరికి, రితేష్ అగర్వాల్ ,ఎమ్క్యూర్ ఫార్మాస్యూటికల్స్‌కు చెందిన నమితా థాపర్ రూ. 50 లక్షలు పెట్టుబడి ఒప్పందం కుదుర్చుకున్నారు. అలా చాలా తక్కువ సమయంలోనే వేలకొద్దీ ఉద్యోగాలను సృష్టించింది కంపెనీ. రూ.4 వందల కోట్ల వ్యాపారంగా మారింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.20 | ₹ 6.22 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|
| ₹ 1,13,350 | ₹ 1,23,660 |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 1,70,000



# అప్పట్లోనే హిడ్మా.. జస్ట్‌మిస్

## కర్రెగుట్టల్లో 25 వేల మంది కూంబింగ్ • చరిత్రలోనే భారీ ఆపరేషన్!



రంపచోడవరం(జనంసాక్షి): మావోయిస్టు పార్టీ గెరిల్లా దళపతి హిడ్మా సహా.. పలువురు కీలక నేతలు రంపచోడవరం అడవుల్లో ఈ ఉదయం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు.గతంలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో విస్తరించి ఉన్న కర్రెగుట్టల నుంచి హిడ్మా తప్పించుకున్నట్లు తెలుస్తుంది. హిడ్మాతోపాటు గుట్టలపై స్థావరాల్లో 3 వేలు నుంచి 4 వేల మంది మావోయిస్టులు ఉన్నట్లు గతంలో బలగాలకు అందిన సమాచారం మేరకు గాలింపు చర్యలు చేపట్టారు.ఎత్తుగా ఉండే ఈ గుట్టలపై.. మావోయిస్టు అగ్రనాయకుల బంకర్లు కూడా ఉన్నట్లు సమాచారం. అయితే.. ప్రభుత్వం 'సేవ్ కర్రెగుట్టలు' ప్రచారాన్ని ప్రారంభించగానే.. మావోయిస్టులు ఈ గుట్టల చుట్టూ మందుపాతరలను అమర్చారని తెలుస్తోంది. అందుకే.. సామాన్య పౌరులెవరూ కర్రెగుట్టల వైపు రావొద్దంటూ నక్సల్స్ కరపత్రాలు పంచారు. వాజేడు, వెంకటాపురం మండలాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఈ మందుపాతరల కారణంగా మృతిచెందగా, పలువురు మంది గిరిజనులు గాయపడ్డారు. భారీ సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారనే సమచారంతో 25 వేల మందితో బలగాలు గాలింపు చర్యలు చేపట్టారు. కానీ హిడ్మా ఇందులో నుంచి తప్పించుకున్నారు. చివరకు ఈరోజు ఉదయం రంపచోడవరం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు.కర్రెగుట్టలు మావోయిస్టులకు ప్రధాన కేంద్రంగా మారడానికి అక్కడి భౌగోళిక పరిస్థితులే ప్రధాన కారణం. ఇవి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు అటవీ ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి. ఈ సరిహద్దు ప్రాంతం రెండు రాష్ట్రాల పోలీసుల సమన్వయాన్ని కష్టతరం చేస్తుంది. మావోయిస్టులు ఒక రాష్ట్రంలో ఆపరేషన్ ఎదురైతే వెంటనే మరొక రాష్ట్రం అడవుల్లోకి పారిపోవడానికి ఇది వీలు కల్పిస్తుంది. ఈ గుట్టలు అత్యంత ఎత్తుగా, దట్టమైన చెట్లతో, లోయలతో కూడిన ప్రాంతం. బలగాలు సులభంగా లోపలికి చొచ్చుకుపోవడానికి వీలుండదు. ఈ క్లిష్టమైన భూభాగం గెరిల్లా యుద్ధానికి, అజ్ఞాతంలో ఉండటానికి అనుకూలంగా ఉంటాయి.స్థానికుల సమాచారం మేరకు ఈ గుట్టలపై మావోయిస్టు అగ్రనాయకులకు చెందిన బంకర్లు (భూగర్భ స్థావరాలు) కూడా ఉన్నాయి. ఇవి దీర్ఘకాలికంగా వారు ఆశ్రయం పొందడానికి, కీలక నిర్ణయాలు తీసుకోవడానికి తోడ్పడుతాయి. 4 వేల వరకు మావోయిస్టులు ఈ గుట్టలపై స్థావరాల్లో ఉన్నట్లు గతంలో అంచనా వేశాయంటే అక్కడి పరిస్థితులు ఎలా ఉండేవో అర్థమవుతుంది. ప్రభుత్వం ఇటీవల 'సేవ్ కర్రెగుట్టలు' ప్రచారాన్ని ప్రారంభించిన తర్వాత మావోయిస్టులు ఈ ప్రాంతం తమ నియంత్రణలో ఉందని చూపించడానికి తీవ్రంగా ప్రతిఘటించారు. అందులో భాగంగానే పౌరులు తమ ప్రాంతంలోకి రాకుండా అడ్డుకోవడానికి, బలగాల కదలికలను నిరోధించడానికి వారు గుట్టల చుట్టూ భారీగా మందుపాతరలను అమర్చారు. ఇది మావోయిస్టుల అణచివేత ధోరణిని, సామాన్య ప్రజలపై వారి దాడులను వెల్లడిస్తుంది. గుట్టల వైపు రావద్దని నక్సల్స్ కరపత్రాలు పంపిణీ చేయడం ద్వారా ఈ ప్రాంతంపై తమ ఆధిపత్యాన్ని చాటుకోవడానికి ప్రయత్నించారు.గతంలో కూడా కర్రెగుట్టలపై మావోయిస్టుల ఉనికిని ఛేదించడానికి బలగాలు అనేక కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించాయి. భారీ సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో గతంలో దాదాపు 25 వేల మంది బలగాలను మోహరించి గాలింపు చర్యలు చేపట్టారు. ఇంత భారీ సంఖ్యలో బలగాలను ఉపయోగించడం ఈ ప్రాంతం క్లిష్టతను, ఆపరేషన్ ప్రాముఖ్యతను సూచిస్తుంది. ఈ ఆపరేషన్లలో సెంట్రల్ రిజర్వ్ పోలీసు బలగాలు స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ వంటి ప్రత్యేక బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి పనిచేశాయి. గుట్టల ఎత్తు, మందుపాతరల ప్రమాదం దృష్ట్యా పకడ్బందీ ప్రణాళికతో డ్రోన్ సర్వేలు, నిఘా సమాచారం ఆధారంగానే ఈ ఆపరేషన్లు నిర్వహించారు. అయినప్పటికీ గతంలో హిడ్మా ఈ గాలింపు చర్యల నుంచి తప్పించుకున్నారు. ఇది మావోయిస్టుల నిఘా వ్యవస్థ, అడవులపై వారి పట్టు ఎంత బలంగా ఉందో తెలియజేస్తుంది.హిడ్మా హతం తర్వాత రెండు రాష్ట్రాల సరిహద్దు అటవీ ప్రాంతంలో ప్రభుత్వం, బలగాలు ప్రత్యేక చర్యలు చేపట్టే అవకాశం ఉంది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ బలగాల మధ్య సమన్వయం మరింత మెరుగుపడి, సరిహద్దు దాటుతున్న మావోయిస్టులపై ఉమ్మడి ఆపరేషన్లు పెరిగే అవకాశం ఉంది. మిగిలిన మావోయిస్టు అగ్రనేతల కదలికలపై నిఘాను మరింత పెంచడం, సాంకేతిక పరిజ్ఞానం (డ్రోన్లు, శాటిలైట్ కమ్యూనికేషన్) ఆధారంగా కూంబింగ్ ఆపరేషన్లను నిర్వహించే వీలుంది.మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని గిరిజనులకు మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేసి వారి మద్దతును మావోయిస్టుల నుంచి దూరం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. కర్రెగుట్టల్లోని మావోయిస్టు స్థావరాలు, బంకర్లను పూర్తిస్థాయిలో ధ్వంసం చేయడానికి బలగాలు క్లియరెన్స్ ఆపరేషన్లు చేపట్టే అవకాశం ఉంది.

# భారీగా పెరిగిన వెహికల్ ఫిట్‌నెస్ టెస్ట్ ఫీజు



న్యూఢిల్లీ:రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా.. వెహికల్ ఫిట్‌నెస్ టెస్ట్ ఫీజును భారీగా పెంచుతూ, కొత్త సవరణలు చేసింది. కేంద్ర మోటారు వాహన నియమాల కింద..కొత్త సవరణలు వెంటనే అమలులోకి వస్తాయి. వాహనాల వయసు, కేటగిరీ ఆధారంగా ఫీజును నిర్ణయించడం జరిగింది.సవరణలలో అత్యంత ముఖ్యమైన మార్పు ఏమిటంటే.. అధిక ఫీజులు మాత్రమే కాకుండా, వాహనాల వయసు పరిమితి తగ్గింపు. అంటే.. కొత్త సవరణలకు ముందు, 15 సంవత్సరాల కంటే పాత వాహనాలకు స్లాబ్‌లు వర్తిస్తాయి. ఇప్పుడు 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వాహనాలకు కూడా ఛార్జీలను విధించనున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది.వాహనాల వయసు ఆధారంగా.. ప్రభుత్వం మూడు కేటగిరీలుగా విభజించింది. మొదటిది 10-15 సంవత్సరాలు, రెండవది 15-20 సంవత్సరాలు, మూడవ వర్గం 20 సంవత్సరాల కంటే పాత వాహనాలు. కేటగిరిని బట్టి ఫీజులు క్రమంగా పెరుగుతాయి. వయస్సు ఆధారిత స్లాబ్‌లు అనేవి టూవీలర్స్, త్రీవీలర్స్, క్వాడ్రిసైకిళ్లు, లైట్ వెయిట్ వెహికల్స్, మిడ్ సైజ్, హెవీ వెహికల్స్ లేదా ప్యాసింజర్ వాహనాలతో సహా అన్ని వర్గాల వాహనాలకు వర్తిస్తాయి.కొత్త సవరణలు.. భారీ వాణిజ్య వాహనాలను ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. 20 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న ట్రక్కులు లేదా బస్సులు ఇప్పుడు ఫిట్‌నెస్ పరీక్ష కోసం రూ. 25,000 ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఫీజు 2500 రూపాయలు మాత్రమే. అదే వయస్సు గల మధ్యస్థ వాణిజ్య వాహనాల ఫీజు రూ. 1800 నుంచి రూ. 20వేలకు పెరిగింది.20 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న.. తేలికపాటి మోటారు వాహనాలకు ఫీజు రూ.15,000కు పెరిగింది, 20 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న త్రిచక్ర వాహనాలకు ఇప్పుడు రూ.7,000 వసూలు చేస్తారు. 20 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న ద్విచక్ర వాహనాలకు రుసుము రూ.600 నుంచి రూ.2,000కు పెరిగింది.15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న వాహనాలకు కూడా కొత్త ఫీజులు ఉన్నాయి. సవరించిన నియమం 81 ప్రకారం.. ఫిట్‌నెస్ సర్టిఫికేషన్ కోసం మోటార్‌సైకిళ్లకు రూ.400, తేలికపాటి మోటారు వాహనాలకు రూ.600, మధ్యస్థ భారీ వాణిజ్య వాహనాలకు రూ.1,000 వసూలు చేస్తారు.

# 20న నితీశ్ ప్రమాణస్వీకారం

**పాట్నా(జనంసాక్షి):**బిహార్ రాజధాని పాట్నాలో జరిగే సీఎం నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు.బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ మరోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అందుకు ముహూర్తం ఖరారు అయింది. సీఎం నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు ఆహ్వానం అందింది. నవంబర్ 20వ తేదీన వీరు బిహార్ వెళ్లనున్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే తరఫున ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆ రాష్ట్ర పారిశ్రామికవేత్తలతో ఏర్పాటు చేసిన పలు సమావేశాల్లో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సంబంధించిన వివరాలను బిహార్‌లోని పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా వివరించారు. 243 అసెంబ్లీ స్థానాలు ఉన్న బిహార్ అసెంబ్లీకి రెండు విడతలుగా.. నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల ఫలితాలను నవంబర్ 14వ తేదీన లెక్కించారు. ఈ ఎన్నికల్లో బిహార్ ఓటరు ఎన్డీయేకు వరుసగా మరోసారి పట్టం కట్టాడు.

# శబరిమలలో జనమేజనం..!

- ఇకపై 20 వేల మందికే స్పాట్ బుకింగ్
- ఆ సంఖ్య దాటితే.. తర్వాతి రోజు స్లాట్ కేటాయింపు
- నీలక్కల్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్
- అయ్యప్ప దర్శనానికి 6 గంటల సమయం
- కుప్పకూలి మృతిచెందిన 58 ఏళ్ల భక్తురాలు



**పథనంతిట్ట:** ముందెన్నడూ లేనివిధంగా మండల పూజ ప్రారంభం నుంచే శబరిమలకు అయ్యప్ప భక్తులు పోటెత్తారు. ఆదివారం సాయంత్రం సన్నిధానంలో అయ్యప్ప స్వామి ఆలయం తలుపులు తెరుచుకోగా.. సోమవారం రికార్డు స్థాయిలో 1.25 లక్షల మంది భక్తులు ఆ హరిహరపుత్రుడిని దర్శించుకున్నారు. నిజానికి ఆన్‌లైన్‌లో రోజుకు 70 వేల మందికి స్లాట్ బుకింగ్ అవకాశం కల్పించారు. అదనంగా 20వేల మందికి స్పాట్ బుకింగ్‌కు ఏర్పాట్లు చేశారు. అయితే.. సోమవారం ఏకంగా 37 వేల మంది భక్తులు స్పాట్ బుకింగ్ చేసుకున్నారని, అందుకే రద్దీ విపరీతంగా పెరిగిందని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) అధికారులు చెబుతున్నారు.

**భారీ క్యూలైన్లు..**సోమవారం నుంచి నీలక్కల్, పంపాబేస్, శబరిమల సన్నిధానం కిక్కిరిసిపోయింది. ఎక్కడ చూసినా.. ఇసుకేస్తే రాలనంతగా భక్తులు కనిపిస్తున్నారు. పంపా కంట్రోల్ రూమ్ వద్ద బస్సు దిగిన భక్తులు త్రివేణీ బ్రిడ్జిని దాటడానికి అరగంట పట్టిందని, అక్కడి నుంచి పంపా గణపతి ఆలయానికి చేరుకోవడానికి గంట సమయం పట్టిందని కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్‌కు చెందిన సుందరేశ అనే భక్తుడు 'సాక్షి డిజిటల్'కి వివరించారు. ఇక శరణ్‌గుత్తి ప్రాంతంలోనూ నిమిషానికి నాలుగు అడుగులు వేసేలా రద్దీ ఉందని హైదరాబాద్‌కు చెందిన పవన్ కుమార్ గురుస్వామి వివరించారు. మారక్కూటం నుంచి 18 మెట్ల వరకు గంట సమయం.. పదునెట్టాంబడిని అధిరోహించాక.. అయ్యప్ప స్వామి దర్శనానికి మరో గంట పడుతోందని పేర్కొన్నారు. వృద్ధులు, చిన్నారులను నేరుగా ధ్వజస్తంభం నుంచి అయ్యప్ప దర్శనానికి వదులుతున్నా.. 18 మెట్లను చేరేవరకు వారికి ఇబ్బందులు తప్పడం లేదని సైదాబాద్‌కు చెందిన రవికుమార్ గురుస్వామి తెలిపారు. నీలిమలను అధిరోహించినప్పటి నుంచి భక్తులు అయ్యప్ప దర్శనం చేసుకోవడానికి 6 గంటల సమయం పడుతున్నట్లు వివరించారు.

**నీలక్కల్‌లోనే నిలిపివేత..**భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో పంపాలో స్పాట్ బుకింగ్ కౌంటర్ల సంఖ్యను 7కు పెంచినట్లు అధికారులు తెలిపారు. అయితే.. పంపా బేస్‌లో రద్దీని బట్టి ఆన్‌లైన్ బుకింగ్ లేని భక్తులను నీలక్కల్‌లో నిలిపివేస్తున్నామన్నారు. నీలక్కల్‌లో భక్తులకు వసతి సదుపాయాలున్నాయని వెల్లడించారు. అటు పంపాబేస్ నుంచి నీలిమలను అధిరోహించాక శరణ్‌గుత్తి, మారక్కూటం క్యూకాంప్లెక్సుల్లో తాగునీరు, స్నాక్స్, టీ, కాఫీ అందజేసే వెసులుబాట్లు కల్పిస్తామన్నారు. ప్రతిచోట సిబ్బందిని నియమించామన్నారు. రద్దీని అదుపుచేయడానికి ఎక్కడికక్కడ పోలీసులను మోహరించినట్లు అదనపు డీజీపీ ఎస్.శ్రీజిత్ వివరించారు. భక్తులు పరిస్థితిని అర్థం చేసుకుని, పోలీసులకు సహకరించాలని కోరారు. "సోమవారం 20 వేల మందికి స్పాట్ బుకింగ్‌కు ఏర్పాట్లు చేశాం. అయితే.. 37 వేల మంది భక్తులు వచ్చారు. అందుకే.. బుధవారం నుంచి 20 వేల స్పాట్ బుకింగ్ నిబంధనను కచ్చితంగా పాటిస్తాం. అదనంగా వచ్చే భక్తులకు తర్వాతి రోజు స్లాట్లను కేటాయిస్తాం" అని ఆయన వెల్లడించారు.




# సర్కార్ బడుల్లో మధ్యాహ్న భోజనం బంద్

## కార్మికుల సమ్మెతో విద్యార్థులకు తిప్పలు

**కార్మికుల నిరవధిక సమ్మెతో నవంబర్ 15 నుంచి నిలిచిన అన్నం**

- **దూర ప్రాంతాల పిల్లలు పచ్చడి-మెతుకులతోనే బడి**
- **తక్కువ వేతనం, పెరిగిన ధరలే సమ్మెకు కారణం**
- **వంట ఖర్చులు పెంచి, నెలవారీ వేతనం ఇవ్వాలని డిమాండ్**

**ముత్తారం నవంబర్ 18(జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ఈ నెల 15నుండి బడుల్లో మధ్యాహ్న భోజనం వడ్డింపు పూర్తిగా నిలిచిపోయింది. దీంతో దూర ప్రాంత విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ముత్తారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్నాయి. ఈ పాఠశాలలో అనేక మంది నిరుపేద విద్యార్థులు చదువుతున్నారు. కాగా ప్రభుత్వం పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. అయితే మధ్యాహ్న భోజనం కార్మికులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం నిరువధిక సమ్మె చేస్తున్నారు. దీంతో మండల వ్యాప్తంగా మధ్యాహ్న భోజనం నిలిచిపోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వంట నిర్వాహకుల సమ్మెతో విద్యార్థులకు ఇంటి భోజనం తప్పడం లేదు. పాఠశాలల్లో స్థానిక విద్యార్థులు మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లి అన్నం తిని వస్తుండగా, పొరుగు గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు మాత్రం బాక్సులు వెంట తెచ్చుకుంటున్నారు. అయితే బస్సులు, ప్రైవేటు వాహనాల్లో మండల కేంద్రాల్లోని పాఠశాలలకు వస్తున్న విద్యార్థులు ఆ సమయానికి ఇంట్లో వంట కాకపోవడంతో పచ్చడి మెతుకులతో పాఠశాలకు వస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళుతుండగా మధ్యాహ్నం భోజనం కోసం పిల్లలు ఇంటికి వెళ్లడం కూడా సమస్యగా మారుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహణ కోసం 1-5 తరగతుల విద్యార్థులకు, 6నుంచి 8 తరగతుల విద్యార్థులకు 9నుంచి 10వ తరగతుల విద్యార్థులకు కేటాయించిన వ్యయం సరిపోడం లేదంటున్నారు. అయితే పెరిగిన ధరలతో పోలిస్తే ఈ కేటాయింపులు ఏమాత్రం సరిపోవడం లేదని కార్మికులు వాపోతున్నారు. దీనికితోడు ప్రభుత్వం ఇస్తున్న అరకొర వేతనంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వంటకార్మికులకు కనీస వేతనం కూడా తమకు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు కనీసం రూ.200లు ఇస్తేనే తమకు కొంతమేరకైనా సంతృప్తిగా ఉంటుందని కార్మికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మార్కెట్ ధరలకు అనుగుణంగా వంట నిర్వహణ ఖర్చులు ఇవ్వకపోవడంతో మెనూ ప్రకారం వడ్డించడం సాధ్యం కాదని కార్మికులు తెలుపుతున్నారు. రెండు నెలల కింద కూరగాయల ధరలు ఆకాశాన్నంటిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో వడ్డించే గుడ్డుకు రూ.5 చెల్లిస్తుండగా ధర ఒక్కోసారి రూ.6నుంచి రూ.7వరకు ఉంటుందని వాపోతు న్నారు. సరుకులు అన్ని ప్రభుత్వమే సరఫరా చేస్తే తమకు ఏ సమస్య ఉండదని తెలుపుతున్నారు. తమకు వేతనాలను నెలనెలా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు

# సమ్మక్క జాతరకు ఇప్పటి నుంచే సన్నాహాలు





## భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రణాళికాబద్ధంగా జాతర ఏర్పాట్లు

- **గోదావరిఖని, గోలివాడలో పరిశీలించిన కలెక్టర్ శ్రీహర్ష**
- **డిసెంబర్ చివరి నాటికి అన్ని పనులు పూర్తి చేయాలి**
- **పారిశుద్ధ్యం, విద్యుత్, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి**

**గోదావరిఖని, నవంబర్ 18(జనంసాక్షి) :** జనవరి నెలలో జరగనున్న సమ్మక్క-సారలమ్మ జాతరను ఘనంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం గోదావరిఖని, అంతర్గాం మండలం గోలివాడ ప్రాంతాల్లో జాతర ఏర్పాట్లను ఆమె స్వయంగా పరిశీలించారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి లక్షలాది మంది భక్తులతో కోలాహలంగా జరిగే ఈ జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. సింగరేణి ఆధ్వర్యంలో గోదావరిఖని వద్ద జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో టెండర్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేసి డిసెంబర్ చివరి నాటికి అన్ని ఏర్పాట్లనూ సిద్ధం చేయాలని ఆదేశించారు. గోలివాడలో సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద పార్కింగ్ స్థలాలు, క్యూలైన్లు, టాయిలెట్లు, షాపుల ఏర్పాట్ల ప్రతిపాదనలు త్వరగా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జాతర సమయంలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిరోజూ చెత్త శుభ్రం చేయాలని, విద్యుత్ దీపాలంకరణ సాయంత్రం నుంచి ఉదయం వరకు నిరంతరాయంగా ఉండేలా చూడాలని, అంతరాయం కలగకుండా జనరేటర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. పోలీసు, నీటిపారుదల, రెవెన్యూ, దేవాదాయ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. అదే రోజు అంతర్గాం మండలం ఎల్లంపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), అంతర్గాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినుల సమగ్ర అభివృద్ధికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని, 10వ తరగతి ఫలితాలు మెరుగుపడేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. స్టడీ అవర్స్, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చలికాలంలో విద్యార్థినులకు వాటర్ హీటర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్.. పీహెచ్‌సీలో వైద్య సేవలు, మందుల స్టాక్‌ను పరిశీలించి మెరుగైన సేవలందించాలని సూచించారు. ఈ పర్యటనల్లో అసిస్టెంట్ కమిషనర్ (ఎండోమెంట్స్) సుప్రియ, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, ఎంపీడీవో, ఎంపీవో, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నేత బండ సురేందర్ రెడ్డి కన్నుమూత

- **జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్ ఘన నివాళి**
- **వివిధ పార్టీల నేతలు, వామపక్ష నాయకుల అంతిమ దర్శనం**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 18 (జనంసాక్షి):** ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్ రెడ్డి (65) సోమవారం రాత్రి అనారోగ్యంతో కరీంనగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని తన నివాసంలో కన్నుమూశారు. మంగళవారం ఆయన పార్థీవదేహానికి పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్ తెలంగాణ నాయకులతో కలిసి పార్థీవదేహంపై పూలమాల వేసి, జెండా కప్పి అంతిమ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దేవరాజన్ మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా పార్టీ నిర్మాణం, ఆశయ సాధనకు బండ సురేందర్ రెడ్డి అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పార్టీ జాతీయ మహాసభలను విజయవంతంగా నిర్వహించిన ఘనత ఆయనదేనని గుర్తుచేసుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. బండ సురేందర్ రెడ్డి పార్థీవదేహానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధుకర్, కోరుకంటి చందర్, సుద్దాల దేవయ్య, మాజీ ఎమ్మెల్సీ నాగదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి తదితర వామపక్ష నాయకులు, న్యాయవాదులు, జర్నలిస్టులు పెద్ద ఎత్తున నివాళులర్పించారు. అంతిమయాత్రలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి జోజి రెడ్డి, జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి తేజదీప్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ.సుందర రామరాజు, ఆర్‌వీ ప్రసాద్, గొల్లపల్లి రాజుగౌడ్, బుచ్చిరెడ్డి, అందె బీరన్న, అతికం రాజశేఖర్ గౌడ్ సహా పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా.. విద్యార్థుల మాస్ ప్రతిజ్ఞ!

- **కామారెడ్డి టీజీఎస్ డబ్ల్యూఆర్ డిగ్రీ కాలేజీలో అవేర్‌నెస్ కార్యక్రమం**

**సదా శివనగర్ నవంబర్ 18 (జనంసాక్షి):** మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన, మత్తు పదార్థాల రహిత జీవితం గడపాలని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ ఫర్ విమెన్ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీడబ్ల్యూ), కామారెడ్డి విద్యార్థినులు, సిబ్బంది సోమవారం ఉదయం బృందంగా ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ నిర్వహించిన 'డ్రగ్ ఎబ్యూస్ అవేర్‌నెస్' కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థినులు క్రమశిక్షణతో పాల్గొని "మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటాం.. సమాజంలో అవగాహన పెంచుతాం" అని గట్టిగా ప్రమాణం చేశారు. ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు కార్యక్రమాన్ని చక్కగా సంఘటితం చేశారు. ప్రతిజ్ఞ అనంతరం మాదక ద్రవ్యాల దుర్వినియోగం హానికరతలు, ఆరోగ్యకరమైన జీవనశైలి, బాధ్యతాయుత పౌరులుగా ఎదగాల్సిన అవసరం వివరించే పోస్టర్లను విడుదల చేశారు. కళాశాల ప్రాంగణంలో సురక్షిత, బాధ్యతాయుత వాతావరణం నెలకొనేలా ఈ కార్యక్రమం దోహదపడిందని విద్యార్థినులు, అధ్యాపకులు హర్షంవ్యక్తం చేశారు.

# ఇకపై మీ-సేవ సర్టిఫికెట్లు.. వాట్సాప్‌లోనే డౌన్‌లోడ్!

**ముస్తాబాద్ నవంబర్ 18 (జనంసాక్షి):** ఇకపై మీ-సేవ సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన, సెంటర్లకు పదేపదే వెళ్లాల్సిన రోజులు అంతే! ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం మేరకు తెలంగాణ ప్రభుత్వం నేటి నుంచి 'మీ-సేవ వాట్సాప్ సర్వీస్'ను అధికారికంగా ప్రారంభిస్తోంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ రోజు లాంఛనంగా ఈ సేవను ప్రారంభించనున్నారు. దీంతో ఆదాయం, జాతి, నివాసం, జనన-మరణ, లైసెన్స్‌లు తదితర ఏ సర్టిఫికెట్ అయినా.. దరఖాస్తు ఆమోదం పొందగానే డిజిటల్ సంతకంతో కూడిన అధికారిక పత్రం నేరుగా వాట్సాప్‌లోనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పౌరులు దరఖాస్తు చేసిన వెంటనే స్టేటస్, ఆ తర్వాత ఆమోదం పొందిన సర్టిఫికెట్ వాట్సాప్ ద్వారానే అందేలా ఏర్పాటు చేశారు. దీంతో ప్రజల సమయం, ఖర్చు, శ్రమ గణనీయంగా తగ్గనుంది. మీ-సేవ సేవలను మరింత సులభతరం చేయడంలో ఇది మైలురాయిగా నిలవనుందని అధికారులు తెలిపారు.

# సంక్షేమమే కాంగ్రెస్ రాజాధర్మం

**రూ.4.33 కోట్ల కళ్యాణ లక్ష్మి- షాది ముబారక్ చెక్కుల పంపిణీ**

**రామగుండం శాసనసభ్యులు మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్**



**గోదావరిఖని, జనంసాక్షి:** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ప్రజాసేవను ధ్యేయంగా పెట్టుకొని సంక్షేమాన్ని ప్రజల గృహద్వారాలకు చేరవేస్తున్నారని తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 433 మంది కళ్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ. 4,33,50,228 విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. రామగుండం నియోజకవర్గం అభివృద్ధి చేయాలి అనే ఆలోచనతో ముందుకు వెళ్తున్న ప్రతి నిరుపేద కుటుంబాలను గుర్తించి తెలంగాణ ప్రజా ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఇస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి నిరుపేద కుటుంబానికి అందే విధంగా చేస్తున్నామని తెలిపారు. "ప్రతి ఆడబిడ్డ కళ్లల్లో సంతోషం చూడడమే నా లక్ష్యం. అభివృద్ధి-సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం.

ప్రజాసేవకునిగా ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటాను" అని పేర్కొన్నారు. రామగుండం కార్పొరేషన్‌లో ఇప్పటివరకు మొత్తం నాలుగు కోట్లు 33 లక్షల 50 వేల 228 రూపాయలు కళ్యాణలక్ష్మి - షాదీ ముబారక్ పథకాల ద్వారా పంపిణీ చేయడం జరిగినట్లు ఆయన వివరించారు. అంతర్గం మండలం, పాలకుర్తి మండలాల్లో రూ. 2 కోట్లు చొప్పున మహిళా భవన-ఫంక్షన్ హాళ్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. "ఎక్కడా పేద కుటుంబం లేకుండా చేయడమే నా సంకల్పం" అని పేర్కొన్నారు. ఈ నగరాన్ని సంపూర్ణ అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రతి గల్లీలో రోడ్లు, డ్రైనేజీ, లైటింగ్ వంటి మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నాం. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి బుద్ధుల శ్రీధర్ బాబు సహకారంతో రామగుండం అభివృద్ధి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుస్తుంది." రామగుండంలో 1ఐ800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేపట్టడం జరుగుతుందని, సింగరేణి నిధులతో రూ. 25 కోట్లు వ్యయంతో సింగర్ క్వార్టర్స్ ఏరియాలో రహదారులు, డ్రైనేజీ పనులు మొదలయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## నాణ్యమైన రహదారుల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు**

**బిచ్కుంద నవంబర్ 18 (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో నాణ్యమైన మరియు సురక్షితమైన రహదారుల నిర్మాణమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని జుక్కల్ నియోజకవర్గ శాసనసభ్యుడు తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. మంగళవారం నాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్ అండ్ బీ మరియు పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని రోడ్ల పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుస్థితిలో ఉన్న రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. సంబంధించిన శాఖ పరిధిలోని పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని సూచించారు. పంచాయతీ రాజ్ శాఖలో పనులు వేగవంతం అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# సాధారణ ప్రసవాలు పెరిగేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలి

- **జిల్లా వైద్య అధికారులతో సాధారణ ప్రసవాల పెంపు, ఆసుపత్రుల పనితీరుపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం, (జనం సాక్షి):** మెరుగైన సేవలతో ప్రభుత్వ వైద్యం పట్ల నమ్మకం కలిగించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్ నందు సాధారణ ప్రసవాల పెంపు, ఆసుపత్రుల పనితీరుపై అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి వైద్యాధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఆసుపత్రుల పనితీరు మెరుగుతోనే ప్రభుత్వ వైద్యం పట్ల ప్రజలకు నమ్మకం కలుగుతుందని అన్నారు. తిరుమలాయపాలెం, నేలకొండపల్లి ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు పెంచడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆశా కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ గర్భిణీ మహిళలను ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉన్న వసతులను వినియోగించుకుంటూ ప్రసవాల సంఖ్య పెంచాలని అన్నారు. ప్రతి ఆసుపత్రి పరిధిలో పి.హెచ్.సి. వైద్యాధికారులతో వెంటనే సమావేశం నిర్వహించాలని, ప్రతి ఏరియాలో ఆ నెల ఎన్ని ప్రసవాలు జరిగే అవకాశం ఉంటుందో వివరాలు మన దగ్గర అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రజలు మన ఆసుపత్రి వైద్యం కోసం రావాలంటే మన పట్ల ఉన్న నమ్మకంతోనే మన పని తీరు తెలుస్తుందని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎక్కువ ప్రసవాలు జరగాలని, ఆ దిశగా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గైనకాలజిస్ట్ ల అవసరం మేరకు అవుట్ సోర్సింగ్ పద్ధతిని ఇంటర్వ్యూ నిర్వహించి స్టాఫ్ ను నియమించుకోవాలని తెలిపారు. సాధారణ కాన్పులు, ప్రసూతి తర్వాత పుట్టిన పిల్లలకు వచ్చే సమస్యల పరిష్కారం కోసం అవసరమైన ఇతర పరికరాల స్థితిగతులపై నివేదిక సమర్పించాలని అన్నారు. ఆసుపత్రి నుంచి చేసిన రిఫరెన్స్ ఫాలో అప్ చేయాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల నుండి ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేయడానికి వీలులేదని అన్నారు. పెండింగ్ ఉన్న ఆస్పత్రి భవన నిర్మాణ పనులు పూర్తి చేసి, కావలసిన వైద్యపరికరాలు, మౌలిక సదుపాయాలు ఏర్పరచుకొని ప్రారంభోత్సవాలకు సిద్దం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తుపాకీ వీడి జనజీవన స్రవంతిలో కలవండి

- **మార్చి వరకు మావోయిజాన్ని అంతం చేసి తీరుతాం : కేంద్ర మంత్రి బండి సంజయ్**





**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 18 (జనంసాక్షి) :** నేషనల్ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) సహకారంతో సీఎస్సార్ నిధులతో కొనుగోలు చేసిన రూ1.5 కోట్ల విలువైన వైద్య పరికరాలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆసుపత్రికి అందజేశారు. జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరీమా అగర్వాల్ తో పాటు వైద్యశాఖ అధికారులతో కలిసి ఆ పరికరాలను మంగళవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ పరిశీలించారు. ఆసుపత్రిని పరిశీలించి రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్, అధికారు లతో కొద్దిసేపు సమావేశమై ఆసుపత్రి అభివృద్ధి, పేదలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ పేరుతో దేశంలోని అన్ని ఆసుపత్రులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. ఆ నిధులతోనే ఆసుపత్రులు నడుస్తున్నాయని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం ఖరీదైన క్రమంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు యత్నిస్తోందన్నారు. చాలా ఆసుపత్రుల్లో సూదులు, మందులు, కాటన్ కూడా లేని పరిస్థితి ఉంటే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఆసుపత్రుల్లో పేదలకు పూర్తిగా వైద్య సేవలందించేందుకు నా వంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. అందులో భాగంగా అల్ట్రాసౌండ్, ఈసీజీ మిషన్ వంటి ముఖ్యమైన 16 వైద్య పరికరాల ను అందించానన్నారు. వేములవాడ ఆసుపత్రిలో మొత్తం రూ1.5 కోట్ల వ్యయంతో ఈ పరికరాలను కొనుగోలు చేశమని, దీంతోపాటు హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట ఆసుపత్రులకు కూడా ఇదే స్థాయిలో వైద్య పరికరాలు అందిస్తున్నామన్నారు.

మావోయిస్టు నేత హిడ్మా ఎన్‌కౌంటర్‌పై స్పందిస్తూ... తుపాకీ ద్వారా రాజ్యాధికారం సాధ్యం కాదని, తుపాకీ పట్టుకుని అమాయకు లైన దళిత, గిరిజనులను, పోలీసులను చంపారన్నారు. వేములవాడ లో ప్రతాప రామక్రిష్ణను కూడా కాల్చి చంపేందుకు యత్నించారన్నారు. అయన చావుదాకా వెళ్లొచ్చారన్నారు. జాతీయ జెండా ఎగరేయొద్దని నక్సలైట్లు బీజేపీ నేతలను ఎంతోమందిని కాల్చి చంపారు. జాతీయ జెండా ఎగరేసేటోడు భారతీయుడా..? నల్లజెండా ఎగరేసేటోడు భారతీయుడా..? నక్సలైట్లది ఏ సిద్ధాంతం..? తుపాకీ ద్వారా మీరు సాధించిందేమిటి, మీరు సాధించిందల్లా అమాయకులను పొట్టన పెట్టుకున్నారు మీరూ బలైపోయారన్నారు. మేం బ్యాలెట్ ను నమ్ముకుని ముచ్చటగా మూడోసారి దేశ ప్రజల ఆశీర్వాదంతో మోదీ ఆధ్వర్యంలో బీజేపీ అధికారంలోకి రాగలిగమన్నారు. మీరు తుపాకీ పట్టుకుని పోలీసులను, దళిత, గిరిజనులను చంపడం, మీరూ చనిపోవడం మినహా మీరు సాధించిందేమిటన్నారు. దేశ సరిహద్దులో జవాను వద్ద, పోలీసుల వద్ద మాత్రమే తుపాకీ ఉండాలని, మావోయిస్టులను తుపాకులను వదిలి జన జీవన స్రవంతిలో కలవాలని అయన పిలుపునిచ్చారు. కలం పట్టి చదువుకునే అమ్మాయిలకు మాయమాటలు చెప్పి తుపాకులు పట్టి అడవుల్లోకి పంపితే తిండి తిప్పలు లేక తిరుగుతున్నారన్నారు. ఎవరైనా లొంగిపోతే వాళ్లపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా, ఆయన భార్య సాధించిందేమిటని, అర్బన్ నక్సల్స్ మాయలో పడి మీ ప్రాణాలు తీసుకోవద్దన్నారు. అర్బన్ నక్సల్స్ ఏసీల్లో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పైరవీలు చేస్తూ ఆస్తులు సంపాదించుకుంటూ కార్లలో తిరుగుతున్నారని, మీరు మాత్రం అడవుల్లో తిండి తిప్పలు లేకుండా తుపాకీ పట్టుకుని తిరుగుతూ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అర్బన్ నక్సల్స్ చెప్పేదొకటి. చేసేదొకటన్నారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని, మంచి ఆలోచనలతో సమాజంలోకి వచ్చి ప్రజలకు సేవ చేయండన్నారు. బుల్లెట్ ను నమ్ముకుంటే ప్రాణాలు తీసుకోవడం మినహా మీరు సాధించేదేమీ లేదన్నారు. బ్యాలెట్ ను నమ్ముకుంటే అధికారంలోకి రాగలమనే విషయాన్ని గుర్తుంచుకోండన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గోపి, పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, ఎర్రం మహేష్ లతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మూలాలు పెకిలించివేయాలి

**నిరంతరం విస్తృత తనిఖీలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**




**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 18 (జనంసాక్షి):** యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల మూలాలను పెకిలించివేయాలని, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్, ఎక్సైజ్, వైద్య ఆరోగ్య, శిశు సంక్షేమ, విద్య తదితర శాఖల అధికారులతో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాతుతూ... మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై బహిరంగ ప్రదేశాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో విస్తృత తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యులు రాసిన చీటీ లేకుండా మత్తు మందులను, ఇంజక్షన్లను మెడికల్ షాపుల్లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మెడికల్ దుకాణాలలో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో స్నేహిత కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విస్తృత అవగాహన కొనసాగించాలని అన్నారు. అవగాహన కార్యక్రమాల్లో పోలీసులను భాగస్వాములను చేయాలని తెలిపారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ... మత్తు పదార్థాల నిర్మూలనకు నిత్యం గస్తీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్ళు, ఆర్టీసీ కార్గో, ప్రైవేట్ పార్సిల్ సంస్థలతో పాటు ఆన్లైన్ సంస్థలకు సంబంధించి గోదాములను తనిఖీ చేస్తున్నట్లు వివరించారు. డ్రగ్ డిటెక్షన్ కిట్లు, పోలీస్ డాగ్ సేవలను వినియోగిస్తున్నామని అన్నారు. నాఖాబంధి చేపట్టి విస్తృత తనిఖీలు చేస్తున్నామని వెల్లడించారు. మాదక ద్రవ్యాలు వినియోగం, సరఫరా వంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, పోలీస్, ఎక్సైజ్, విద్య, వైద్య, మహిళా శిశు సంక్షేమం, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భారత గడ్డమీద సిపిఐ పార్టీకి వందేళ్లు

- వామపక్ష ఐక్యత ఈ దేశానికి అవసరం
- సిపిఐ పార్టీ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి




**సైదాపూర్ నవంబర్ 18 (జనం సాక్షి) :** భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాలలో భాగంగా ఈనెల 15వ తేదీన కొమురం భీం జిల్లా జోడేఘాట్ నుండి ప్రారంభమైనటువంటి జాత మంగళవారం సైదాపూర్ మండలంకు చేరుకోవడం జరిగింది. ఈ జాతను భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల కార్యదర్శి లంకదాసరి కళ్యాణ్ ఆధ్వర్యంలో జాత నాయకులు చాడ వెంకటరెడ్డి ఎక్స్ ఎమ్మెల్యే, సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు, తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు సిపిఐ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, కలవిన శంకర్ సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మారుపాక అనిల్ కుమార్ డిహెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పల్లెనరసింహ తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,కసిరెడ్డి మణికంఠ రెడ్డి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఈ జాతకు ప్రతినిత్యం వహించగా వారికి సిపిఐ పార్టీ మండల సమితి ఆధ్వర్యంలో పూలమాలలతో స్వాగతం పలికారు.

అనంతరం సైదాపూర్ బస్టాండ్ చౌరస్తాలో సిపిఐ పార్టీ జెండాను చాడ వెంకటరెడ్డి ఆవిష్కరించిన అనంతరం ప్రజానాట్య మండలి కళాకారులు నిత్య ప్రదర్శన చేయగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భారత గడ్డపై సిపిఐ పార్టీకి వందేళ్ళ పోరాటాల చరిత్ర కలదని ఆయన అన్నారు భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని తొలిత గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ పార్టీ అని అదేవిధంగా భూమి కోసం భుక్తి కోసం భారతదేశ విముక్తి కోసం మిలిటెంట్ ఉద్యమాలు నడిపినటువంటి పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని ఆయన కొనియాడారు. కార్మిక విద్యార్థి యువజన రైతు మహిళా తదితర ప్రజా సంఘాల నిర్మించి వెట్టి చాకిరి విముక్తి కొరకు పోరాడినటువంటి ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని ఆయన అన్నారు. ఇప్పుడున్న పరిస్థితులలో దేశంలో కమ్యూనిస్టు పార్టీలు మరింత బలపడాలని వామపక్ష ప్రజాతంత్ర పురోగామి శక్తులు ఏకం కావాలని ఆయన అన్నారు. బిజెపి పార్టీ 2014 ప్రతి కుటుంబానికి 15 లక్షలు ఇస్తామని రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రగడ్బాలు పలికిన బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమి చేయలేదని అంతేకాకుండా దేశంలో బిజెపి పార్టీ ప్రజల మధ్య మత విశ్వాసాలు రెచ్చగొడుతూ వరుసగా అధికారం నిలబెట్టుకున్నారు అని అన్నారు. దేశ సంపదను ఆదాని అంబానీ కార్పొరేట్ శక్తులకు అంటగడుతున్నదని సంపన్నులు మరింత సంపన్నులు అవుతుంటే పేదలు మరింత పేదలుగా అవుతున్నారని ఆయన విమర్శించారు. ఈరోజు దేశంలో కమ్యూనిస్టుల ఐక్యత వామపక్షాల ప్రజాతంత్ర శక్తుల ఐక్యత గురించి సిపిఐ నిరంతరం కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా భారతదేశంలో 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నటువంటి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ. కమ్యూనిస్టు పార్టీ జాతీయ అంతర్జాతీయ నాయకులకు ఖమ్మం నగరంగా ఘనంగా ఆతిథ్యం ఇవ్వనుందని ఆయన అన్నారు. ఈ 100 సంవత్సరాలు చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ ఉత్సవాల్లో వచ్చే నెల డిసెంబర్ 26న తేదీన అధిక సంఖ్యలో ప్రజలు మేధావులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొన్నగంటి కేదారి. ప్రచార జాత నాయకులు రెహమాన్, కన్నం లక్ష్మీనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల బాబు కోయడ సృజన్ కుమార్ నేలపట్ల రాజు పైడిపల్లి రాజు మహిళా సమైక్య నాయకురాలు గూడెం లక్ష్మి, హుస్నాబాద్ నియోజవర్గ పార్టీ కన్వీనర్ జాగిరి సత్యనారాయణ . కోఆర్డినేటర్ కనుకుంట్ల శంకర్. గడిపె మల్లేష్. సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి జడల రాజేశం కార్యవర్గ సభ్యులు నలువాల రవి, భాషవేణి శ్రీనివాస్, భాషవేణి సురేష్, తోటి మహేష్ తదితరులు పాల్గొన్నారు



## ప్రతిష్టాత్మక రామానుజన్ మ్యాథ్స్ ఒలంపియాడ్‌కు 'అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థుల' ఎంపిక

### అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి

**కరీంనగర్, నవంబర్ 18 (జనంసాక్షి) :** గణిత శాస్త్రం ద్వారా విద్యార్థులకు పలు విషయాల పట్ల అవగాహన పెరుగుతుందని, ఈ శాస్త్రంలో పట్టు సాధించే విధంగా కృషి చేయాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో పాఠశాల చెందినటువంటి విద్యార్థులు రామానుజన్ మ్యాథ్స్ ఒలంపియాడ్ తుది దశకు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు వారు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు గణిత శాస్త్రంలోని విషయాలను చాలా సమగ్రంగా తెలపాలని, వివిధ స్థాయిలలో నిర్వహించబడేటువంటి పరీక్షలకు ప్రాతినిధ్యం వహించే విధంగా ప్రోత్సాహం అందించడంతోపాటు విజయం సాధించే దిశగా ప్రోత్సాహం అందిస్తున్నామని వారు చెప్పారు. శ్రీనివాస రామానుజన్ భారతదేశ గణిత శాస్త్రానికి చేసిన కృషి చాలా విశిష్టమైనదని, చారిత్రాత్మకమైనదని తెలుపుతూ విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీయటానికి వివిధ స్థాయిలో నిర్వహించినటువంటి పోటీ పరీక్షలలో ఘనవిజయం వైపు పయనిస్తూ మార్గదర్శకంగా నిలుస్తున్నామని హర్షం వ్యక్తం చేస్తూ ఇటీవల కాలంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో శ్రీనివాస్ మ్యాథ్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి ప్రాథమిక దశలో పాఠశాలకు చెందినటువంటి పలువురు విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని ద్వితీయ దశకు ఎంపికైనారని అని చెప్పారు.

**ప్రథమ స్థానం పొందిన విద్యార్థులు**

బి.శ్రీక్షిత 3వ తరగతి, జె.యశ్వంత్ రెడ్డి 4వ తరగతి, జి. శ్రీయాన్ రెడ్డి, పి.సాద్విని 5వ తరగతి, ఏ.రీతిక 6వ తరగతి, జి. సహాంస్ 7వ తరగతి , ఎన్ సహార్ష్, 8వ తరగతి, ఎం శ్రేయాన్ కార్తీక్ 9వ తరగత విభసం చేసుకున్నారని హర్షం వ్యక్తం చేస్తూ ఇతర విద్యార్థులు రెండవ దశకు ఎంపికైన అని సంతోషం వ్యక్తం చేశారు. విజేతలందరికీ పుష్పగుచ్చాలను అందజేసి తుది దశలోనూ కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిషా ముక్తి భారత్ అభయాన్

### అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కమిషనర్ అరుణశ్రీ



**గోదావరిఖని, జనంసాక్షి :** మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వాములమవుతామని రామగుండం నగర పాలక సంస్థ సిబ్బందిచే అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు "నషా ముక్త భారత్ అభియాన్"లో భాగంగా మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళ వారం సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సామూహిక డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములమవుతామని విద్యార్థినీ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాల వినియోగం కారణంగా జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సంధర్భంగా డ్రగ్స్ ఫ్రీ ఇండియా పోస్టర్లు ప్రదర్శించడంతో పాటు ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ చేసి దృవీకరణ పత్రం పొందాలని క్యూ ఆర్ కోడ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి. రామన్, అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, సెక్రెటరీ ఉమా మహేశ్వర్ రావు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్ఓ. ఆంజనేయులు, ఎసిపి శ్రీహరి, అక్కౌంట్స్ ఆఫీసర్ రాజు, సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగ భూషణం, సంపత్, ప్రభుత్వ పాటశాల, కళాశాలల ప్రిన్సిపాళ్లు మల్లారెడ్డి, సంజీవయ్య, వార్డు అధికారులు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు రెండో విడత రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం ప్రోత్సాహకం

- తెలంగాణకు చెందిన అభ్యర్థులందరూ అర్హులే
- గతంలో దరఖాస్తు చేసుకోలేని అభ్యర్థులకు అవకాశం
- సీఎండీ ఎన్.బలరామ్ వెల్లడి



**గోదావరిఖని, జనంసాక్షి:** సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు శుభవార్త. సింగరేణి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకంలో భాగంగా సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు రూ.లక్ష ప్రోత్సాహకం కోసం అర్హులైన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మంగళవారం తెలిపారు. ఈ పథకంలో భాగంగా గతంలో మెయిన్స్ కు ఎంపికై ఇప్పటికే లక్ష రూపాయల ప్రోత్సాహకాన్ని అందుకున్న వాళ్లు మళ్లీ దరఖాస్తు చేసుకోనవసరం లేదని, తెలంగాణకు చెందిన ఇతర అభ్యర్థులు ఎవరైనా ఇంటర్వ్యూలకు ఎంపికైతే వారికి కూడా ఈ ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. సమాచారం లేకపోవడం వల్ల తాము దరఖాస్తు చేసుకోలేదని, సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికయ్యామని, తమకు ఆర్థిక ప్రోత్సాహకం అందించాలని పలువురు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారని, ఈ నేపథ్యంలో వారికి కూడా అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. సంబంధిత అభ్యర్థులు తమ దరఖాస్తులను, వివరాలను ఈ నెల 21వ తేదీ లోపు హైదరాబాద్ సింగరేణి భవన్ లో అందజేయాలని కోరారు. త్వరలో అర్హులందరికీ రెండో విడత లక్ష రూపాయల ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు వెల్లడించారు. గత ఏడాది ప్రారంభించిన ఈ పథకం ద్వారా మొదటగా మెయిన్స్ కు ఎంపికైన 140 మందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేయగా.. వారిలో 20 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్వ్యూలకు ఎంపికైన 20 మందికి మరో విడతగా రూ.లక్ష చొప్పున సాయం అందించగా.. వారిలో ఏడుగురు విజేతలుగా నిలిచారని, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో టాపర్గా నిలిచిన 11వ ర్యాంకర్ కూడా ఇందులో ఉన్నారని వివరించారు. ఈ ఏడాది ప్రిలిమ్స్ పాసైన 202 మందికి ఆర్థిక చేయూత అందించగా.. 43 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని వెల్లడించారు.

## వాక్ఫ్ ఆస్తుల రక్షణకు 'ఉమ్మీద్' పోర్టల్

### డిసెంబర్ 6లోపు అప్‌లోడ్ చేయాలి

- కరీంనగర్‌లో భారీ అవగాహన సదస్సు..
- వాక్ఫ్ బోర్డు చైర్మన్ ఆజం హుస్సేని ప్రత్యేక శిక్షణ
- మస్జిద్, ఈద్గా, దర్గా, కబ్రస్థాన్ కమిటీలకు ప్రొజెక్టర్ ద్వారా మార్గదర్శనం




**కరీంనగర్, నవంబర్ 18 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఉమ్మీద్ సెంట్రల్ పోర్టల్'లో వాక్ఫ్ ఆస్తుల వివరాలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని.. డిసెంబర్ 6లోపు పూర్తి చేసుకోవాలని తెలంగాణ వాక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ ఆజం మతుల్లాహ్ హుస్సేని పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ జిల్లా వాక్ఫ్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. కమిటీ చైర్మన్ అబ్దుల్ సమద్ నవాబ్, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మహ్మద్ తాజుద్దీన్, లేయిాక్ ఖాద్రీ, నెహల్ అహ్మద్, అబ్దుల్ రహమాన్, కమరుద్దీన్, మౌసిన్, ఇర్ఫాన్, చాంద్, అజీం, ఇమ్రాన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆజం హుస్సేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రొజెక్టర్ ద్వారా పెద్ద తెరపై ఉమ్మీద్ పోర్టల్‌లో ఆస్తుల వివరాలు ఎలా అప్‌లోడ్ చేయాలో దశలవారీగా వివరించారు. కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు చెందిన మస్జిద్, ఈద్గా, దర్గా, కబ్రస్థాన్ కమిటీల అధ్యక్షులు, సభ్యులు దాదాపు 500 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆజం హుస్సేని మాట్లాడుతూ.. వాక్ఫ్ ఆస్తుల రక్షణ, సంరక్షణ కోసమే కేంద్రం ఈ పోర్టల్‌ను రూపొందించిందని, అన్ని వాక్ఫ్ సంస్థలు తమ ఆస్తుల వివరాలను తప్పనిసరిగా డిసెంబర్ 6లోపు అప్‌లోడ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి మైనారిటీ చైర్మన్ ఎస్కే అక్బర్ అలీ, సిరిసిల్ల చైర్మన్ ఎస్కే సాహెబ్, ఐటీ టీమ్ సభ్యులు మహమ్మద్ గౌసుద్దీన్, యూసుఫ్ పాషా, అబూబకర్ ఖాలిద్, సదర్ ఖాజీ మన్షెబత్ షా ఖాన్, ముఖ్యార్ షా ఖాన్ మౌలానా, అలీముద్దీన్, సొయబుల్లా ఖాన్, ఖైరుద్దీన్, ముజాహిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు సొంతిల్లు.. ఇందిరమ్మ పథకంతో కల సాకారం!

- పెగడపల్లిలో కుందేల లక్ష్మి కుటుంబం గృహప్రవేశం
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని శుభాకాంక్షలు



**జగిత్యాల బ్యూరో నవంబర్ 18 (జనం సాక్షి) :** "ఇందిరమ్మ రాజ్యంలోనే నిరుపేదలకు గూడు" అంటూ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికీ సొంతిల్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. మంగళవారం పెగడపల్లి మండలం ల్యాగలమర్రి గ్రామంలో కుందేల లక్ష్మి - రాజు దంపతులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని గృహప్రవేశం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై లక్ష్మి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి బిల్లులు సమర్పించాలని, గ్రామాల్లో ఇంకా ప్రొసీడింగ్స్ వచ్చినవారు వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. లేకపోతే ఇతర అర్హులకు అవకాశం కల్పిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఈ భాస్కర్, ఎంపీడీవోలు, ఎంఆర్వోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మర్రిపల్లిలో మార్కెట్ కమిటీ నిర్మాణం పూర్తి చేసుకోవాలి

### వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు

**వేములవాడ రూరల్, నవంబర్ 18 (జనంసాక్షి):** ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మర్రిపల్లి లో మార్కెట్ కమిటీ నిర్మాణం పూర్తి కావాలని, తద్వారా స్థానిక రైతాంగానికి, ప్రజలకు ఉపయోగపడే విధంగా మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు పేర్కొన్నారు.వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి, విస్తరణ లక్ష్యంగా ఆయన అధ్యక్షతన మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి, అభివృద్ధి దిశగా తీర్మానాలు చేశారు. గ్రామీణ మండలంలోని మర్రిపల్లిలో 12 ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్ కమిటీకి స్థలాన్ని కేటాయించిన సంగతి తెలిసిందే. నూతన మార్కెట్ నిర్మాణం పూర్తయితే, వేములవాడ ప్రాంత రైతాంగానికి అనేక సేవలు, మెరుగైన సౌకర్యాలు లభించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. అలాగే కోరుట్ల బస్టాండ్ ఏరియాలో మార్కెట్ కమిటీకి చెందిన మూడు షటర్ల కాల పరిమితి ముగుస్తుండటంతో, వాటిని తిరిగి లీజుకి ఇచ్చేందుకు టెండర్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ నిర్ణయం ద్వారా కమిటీకి సంబంధించిన ఆస్తుల నిర్వహణ, ఆదాయ వనరులను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాకేష్, డైరెక్టర్లు వస్తారు కృష్ణ ప్రసాద్, ఇతర డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలపై బీజేపీ ఫోకస్

- నేడు హుజూరాబాద్‌లో పోలింగ్ బూత్ అధ్యక్షులు, సోషల్ మీడియా వారియర్స్ సమావేశం
- ముఖ్య అతిథిగా హాజరై దిశా నిర్దేశం చేయనున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 18 (జనంసాక్షి):** డిసెంబర్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించిన నేపథ్యంలో భారతీయ జనతాపార్టీ ఈ ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. ప్రధానంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా సర్పంచ్, వార్డు స్థానాలను కైవసం చేసుకోవమే లక్ష్యంగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే గ్రామాల వారీగా సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై సర్వేలు చేయిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎన్నికలను పార్టీ క్యాడర్ ను సమాయత్తం చేసేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా నేడు హుజూరాబాద్ పట్టణంలోని మధువన్ గార్డెన్స్ లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్ అధ్యక్షులు, కార్యదర్శులు, సోషల్ మీడియా వారియర్స్ తో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. హుజూరాబాద్ లో జరగబోయే పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. మరోవైపు ఈ సమావేశాన్ని దృష్టిలో ఉంచుకుని హుజూరాబాద్ పట్టణంలో కాషాయ శ్రేణులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పట్టణ కూడళ్లలో కాషాయ జెండాలతో అందంగా అలంకరణ చేశారు. దీంతో హుజూరాబాద్ పట్టణం కాషాయమయమైంది. ఈ సమావేశంలో ప్రధానంగా రెండు అంశాలపై బండి సంజయ్ చర్చించనున్నారు. ఒకవైపు పంచాయతీ ఎన్నికలకు క్యాడర్‌ను సిద్ధం చేస్తూనే మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టేందుకు యాక్షన్ ప్లాన్ ను ప్రకటించనున్నారు. రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనా విజయోత్సవాల పేరుతో ఉత్సవాలు నిర్వహించేందుకు సిద్ధమవుతుండగా, అందుకు భిన్నంగా కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలకు జరిగిన అన్యాయాలపై కరపత్రాలను రూపొందించి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని భావిస్తున్నారు. దీనికి సంబంధించిన కార్యాచరణను మంగళవారం రోజు సమావేశంలో ప్రకటించనున్నారు.

# తరుగు పేరిట కోతలు పెడుతున్న మిల్లర్లు

- చట్ట ప్రకారంగా ధాన్యం కొనుగోలు చేయాలి
- మాజీ ఎంపీ వినోద్ కుమార్



**గంగాధర నవంబర్ 18 (జనం సాక్షి) :** ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని రైతులు అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలకు తెస్తే తరుగు పేరిట బస్తాకు మూడు కిలోలు ఎక్కువ తూకం పెట్టి లారికి ఆరు బస్తాల చొప్పున కోతలు పెట్టి రైతులను మిల్లర్లు దోచుకుంటున్నారని మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు మంగళవారం మండలంలోని వెంకంపల్లిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తో కలసి పరిశీలించారు, టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మధ్యవర్తులు బ్రోకర్లు ఆర్తిదారుల దగ్గర రైతులు మోసపోకూడదని టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కోవిడ్ సమయంలో కూడా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించిందని అన్నారు. ధాన్యం కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని అన్నారు ప్రైవేట్ మిల్లులకు ధాన్యాన్ని అమ్ముకొని రైతులు పూర్తిగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి స్పందించి కలెక్టర్లను, తహసీల్దారులను,వ్యవసాయ శాఖ అధికారులను, ఆదేశించి కొనుగోలు కేంద్రాలను నియంత్రించాలని కొనుగోలు కేంద్రాలలో దోపిడీ జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు,తరుగు పేరిట అధికార యంత్రాంగానికి కూడా డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని అందుకే కోతలు పెట్టాల్సి వస్తుందని మిల్లర్లు అంటున్నారని అన్నారు,చట్ట ప్రకారముగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతుకు నష్టం జరిగిందని పిర్యాదు చేయగానే అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్ రావు,నాయకులు నాగి శేఖర్,కంకణాల విజేందర్ రెడ్డి,సాగి మహిపాల్ రావు,కరభూజ తిరుపతి గౌడ్,ఆకుల మధుసూదన్,వేముల దామోదర్,రామిడి సురేందర్,ముక్కెర మల్లేశం, వడ్లూరి ఆదిమల్లు,శ్రీమల్ల మెగరాజ్, ఆకుల శంకర్, కోరుకండ్ల నరేందర్ రెడ్డి, లింగాల దుర్గయ్య, సామంతుల శ్రీనివాస్, మడ్లపెల్లి రమేష్, తూం మల్లయ్య,దోమకొండ మల్లయ్య, సముద్రాల అజయ్, మామిడి అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడికి సైన్స్ ల్యాబ్, మూడు కొత్త గదులు

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ప్రారంభం!
- ప్రతి విద్యార్థిలో ప్రతిభ ఉంది.. మౌలిక వసతులతో వెలికితీయండి
- ఉపాధ్యాయులు అంకితభావంతో బోధించాలి
- సీఎం రేవంత్ కృషిని కొనియాడిన ఎమ్మెల్యే



**పెద్దకొడప్గల్, నవంబర్ 18 జనంసాక్షి :** పెద్దకొడప్గల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్, మూడు అదనపు తరగతి గదులను జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంత రావు మంగళవారం ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిలోనూ ఓ ప్రతిభ దాగి ఉంటుందని, అవకాశాలు సక్రమంగా అందకపోతేనే అది బయటపడదని అన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో విద్యాశాఖ నిర్లక్ష్యానికి గురైందని, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ బడులు మళ్లీ కళకళలాడుతున్నాయని కొనియాడారు. జుక్కల్ నియోజకవర్గం లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ తెచ్చిన ఘనతను గుర్తుచేసుకున్నారు. సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ విద్య, తరగతి గదులతో సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను ఆదేశించారు. ఉపాధ్యాయులు తమ వృత్తిని అంకితభావంతో బాధ్యతగా తీసుకోవాలని, దేశ భవిష్యత్తు వారిపైనే ఆధా రపడి ఉందని గుర్తుచేశారు. పాటలు పాడి, ఉపన్యాసాలు ఇచ్చిన విద్యార్థులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో బీఆర్ అభినవ్ చందర్, ఎంఈవో ప్రవీణ్ కుమార్, ఎస్సై అరుణ్ కుమార్, ఉపాధ్యాయ బృందం, కాంగ్రెస్ నాయకులు మోహ న్, శామప్ప పటేల్, నాగిరెడ్డి, సంజీవ్, మల్లప్ప పటేల్, మొగులగౌడ్, హైమద్, బస్వరాజ్ దేశాయ్, మహిళా నాయకురాలు ఇందిరమ్మ, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, యువనాయకులు శ్రీనివాస్ గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
19 నవంబర్ 2025

# సరుకుల సరఫరాలో జాప్యం చేస్తే కాంట్రాక్టులు రద్దు

- పది రోజులకోసారి తప్పనిసరిగా కోడిగుడ్లు సరఫరా చేయాలి
- బెస్ట్ ప్రైస్ ఇస్తున్నాం..బెస్ట్ క్వాలిటీ ఇవ్వండి
- అంగన్వాడీ సరుకుల నాణ్యతపై మంత్రి సీతక్క సమీక్ష
- సరఫరాలో జాప్యంపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకుల సరఫరాలో జాప్యం చేస్తే కాంట్రాక్టులు రద్దు చేస్తామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హెచ్చరించారు. హైదరాబాద్, వెంకలరావు నగర్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్‌లో అంగన్వాడి కేంద్రాలకు సరఫరా అవుతున్న కోడిగుడ్లు, పప్పు, మంచి నూనె, పాలు, ఇతర అవసరమైన సరుకులపై మంత్రి జిల్లాల వారీగా సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారులు, సరఫరాదారులు, మిల్క్ సప్లయర్లు పాల్గొన్నారు. కోడి గుడ్లు, సరుకుల సరఫరా పరిస్థితులు, జాప్యాలు, నాణ్యత సమస్యలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. సరుకుల సరఫరాలో జరుగుతున్న జాప్యం పై మంత్రి సీతక్క కఠినంగా తప్పుబట్టారు. "మాకు కారణాలు చెప్పకండి. అంగన్వాడి చిన్నారుల కోసం కోడి గుడ్లు పది రోజులకు ఒకసారి తప్పనిసరిగా సరఫరా కావాలి. సాకులు చెప్పి జాప్యం చేస్తే కాంట్రాక్టులు రద్దు చేస్తాం," అని ఆమె హెచ్చరించారు. చిన్నారుల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన, నిర్దిష్ట సైజు గుడ్లను సరఫరా చేయడం తప్పనిసరి అని కూడా అన్నారు. "చిన్న గుడ్లు, నాసిరకం గుడ్ల సరఫరా మహా పాపం," అని మంత్రి స్పష్టం చేశారు. మారుతున్న వాతావరణంలో గుడ్లు త్వరగా పాడవుతుండటంతో పది రోజులకు ఒకసారి సప్లై వ్యవస్థ తప్పనిసరి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంగన్వాడి సిబ్బంది గుడ్ల నిల్వపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పిల్లల బరువు, ఎత్తు పెరగడానికి నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. సరుకుల నాణ్యతలో లోపాలు కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో గుడ్ల సప్లై దారులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. సంక్షేమ హాస్టల్స్‌తో కలిపి సరఫరా చేయడం వల్ల సమన్వయం కుదరక ఇబ్బందులు వస్తున్నాయని, కొన్ని సందర్భాల్లో అంగన్వాడి కేంద్రాలకు కేటాయించిన గుడ్లను హాస్టల్ నిర్వాహకులు ఒత్తిడి చేసి తీసుకుంటున్నారని వివరించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపిస్తానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. అంగన్వాడి కేంద్రాలకు సరఫరా అయ్యే జిలకర, ఆవాలు, పసుపు, ఉప్పు, కారం పొడి, చింతపండు వంటి వస్తువుల నాణ్యత ఆశించిన స్థాయిలో లేక పోవడాన్ని మంత్రి సీతక్క తీవ్రంగా పరిగణించారు. "అంగన్వాడి కేంద్రాలకు రెస్టారెంట్ లుగా భావించి నాసిరకం వస్తువులు ఇస్తే అస్సలు సహించము. నాణ్యత లేని వస్తువులు పిల్లల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడతాయి" అని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వ సంస్థ ఆయిల్ ఫెడ్‌కు సరుకుల కాంట్రాక్టులు ఇచ్చినా నాణ్యత పరంగా ఆశించిన ఫలితాలు రాలేదని మంత్రి సీతక్క తెలిపారు. సమీక్ష సమావేశంలో శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, టీజీ ఫుడ్స్ ఎండి చంద్రశేఖర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణకు అవార్డుల పంట

- జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో దేశంలోనే తెలంగాణ టాప్
- తెలంగాణ అధికారులకు పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలకు వరుసగా 3 ర్యాంకులు..




**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం టాప్‌లో నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ జల అవార్డులు-2024లో.. తెలంగాణ జాతీయ స్థాయిలో తొలి ర్యాంకును సాధించింది. కేంద్ర ప్రభుత్వం 2024లో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. తెలంగాణ మొత్తం 5,20,362 పనులు పూర్తిచేసింది. జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇవాళ (నవంబర్-18న) పురస్కారాలు ప్రదానం చేశారు. జల్ సంచయ్ జన్ భాగీదారీని ఉత్తమంగా అమలు చేసిన రాష్ట్రాలు, జిల్లాలు, స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం 100 అవార్డులను ప్రకటించింది. ఇందులో మూడు రాష్ట్రాలు, 67 జిల్లాలు, 6 మున్సిపల్ కార్పొరేషన్లు, ఒక పట్టణ స్థానిక సంస్థ, రెండు భాగస్వామ్య మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రెండు పరిశ్రమలు, మూడు ఎన్‌జీఓలు, ఇద్దరు దాతలు, 14 మంది నోడల్ అధికారులు ఉన్నారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మున్సిపల్ కార్పొరేషన్లను మూడు కేటగిరీలుగా విభజించి అవార్డులు ప్రకటించారు. మొదటి కేటగిరీలో ఎంపికైన వాటికి రూ.2 కోట్లు, రెండో దాని కింద కోటి రూపాయలు, మూడో కేటగిరీ కింద రూ.25 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. జిల్లాల విభాగంలో కేటగిరీ-1 కింద దక్షిణ జోన్ నుంచి మూడు జిల్లాలను ఎంపిక చేయగా.. ఆ మూడింటినీ తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. ఒక్కో జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున మొత్తం రూ.6 కోట్ల నగదు బహుమతి అందింది. ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలు ఈ నగదు బహుమతిని సాధించాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఏరియాలో జల సంరక్షణ చర్యలు చేపట్టినందుకు.. హైదరాబాద్ మెట్రో కార్పొరేషన్ నీటి సరఫరా, మురుగునీటి బోర్డు మున్సిపల్ కార్పొరేషన్ల విభాగంలో రెండో ర్యాంకు సాధించింది. రూ.2 కోట్ల నగదు బహుమతిని సొంతం చేసుకొంది. ఈ విభాగంలో కేటగిరీ-2లో వరంగల్, నిర్మల్, జనగామ, జిల్లాలు దక్షిణ జోన్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచి రూ.కోటి చొప్పున బహుమతి గెలుచుకున్నాయి. కేటగిరీ-3లో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ 1, 3 ర్యాంకుల్లో నిలిచి.. రూ.25 లక్షల చొప్పున నగదు బహుమతి సొంతం చేసుకున్నాయి. ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కుమురం భీం ఆసిఫాబాద్, మెదక్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలకు నోడల్ అధికారిగా వ్యవహరించిన కేంద్ర జల సంఘానికి చెందిన ఎ.సతీష్‌కు కూడా అవార్డు దక్కింది.

# విపక్షనేతగా ఉండడానికి తేజస్వి విముఖత

- పార్టీని నడపాల్సిందేనని లాలూ సూచన

**పాట్నా, నవంబర్18 (జనంసాక్షి) :** బీహార్ ఎన్నికల్లో లాలూ ప్రసాద్ యాదవ్‌కు చెందిన ఆర్జేడీ ఘోర పరాజయం పాలైంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్-ఆర్జేడీ కూటమిని ముందుండి నడిపించిన, సీఎం అభ్యర్థిగా ఉన్న తేజస్వీ యాదవ్ ఒకానొక దశలో ఓడిపోయే పరిస్థితి ఏర్పడింది, చివరకు స్వల్ప మెజారిటీతో గట్టెక్కారు. 243 సీట్లు ఉన్న బీహార్ అసెంబ్లీలో ఆర్జేడీ కేవలం 25 సీట్లకు మాత్రమే పరిమితమైంది. మహాఘట్బంధన్ కూటమి కేవలం 35 సీట్లను మాత్రమే సాధించింది. మరోవైపు, ఎన్డీయే కూటమి 202 స్థానాలు కైవసం చేసుకుంది. నితీష్ కుమార్ సీఎంగా మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది.ఇదిలా ఉంటే, ఈ ఘోర పరాజయం తర్వాత తేజస్వీ యాదవ్ ప్రతిపక్ష నాయకుడిగా ఉండటానికి నిరాకరించినట్లు తెలుస్తోంది. అయితే, ఆయన తండ్రి లాలూ పట్టుబట్టడంతో ఈ పదవిని చేపట్టడానికి అంగీకరించారు. సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో తాను ఎమ్మెల్యేగానే కొనసాగుతానని, ప్రతిపక్ష నాయకుడి బాధ్యతలు చేపట్టడానికి నిరాకరించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, లాలూ మాత్రం సభలో పార్టీని నడిపించాలని తేజస్వీని కోరారని చెప్పారు. ఆర్జేడీ ఓటమికి కూడా తేజస్వీ యాదవ్ తానే బాధ్యత తీసుకున్నాడు. ఈ ఎన్నికల్లో చాలా ప్రయత్నించానని, కానీ విఫలమయ్యానని అన్నారు. అయితే, సమావేశంలో సీనియర్ నాయకులు తేజస్వీ యాదవ్ వెంటే ఉన్నామని, అతడితోనే ఉంటామని చెప్పారు. తేజస్వీ యాదవ్ సన్నిహితుడు, ఆర్జేడీ ఎంపీ సంజయ్ యాదవ్ ఈ సమావేశంలో ఆయనను సమర్థించారు. ఇటీవల, లాలూ ఫ్యామిలీ డ్రామాలో సంజయ్ యాదవ్ పేరు ప్రముఖంగా వినిపించింది. లాలూ కుమార్తె రోహిణి ఆచార్య, ఇటీవల తన కుటుంబంతో సంబంధాలు తెంచుకున్నట్లు చెప్పింది. దీనికి సంజయ్ యాదవ్ రమీజ్ నేమత్ ఖాన్‌లు కారణమని వెల్లడించింది.

# టీ-సాట్ ద్వారా పోటీ పరీక్షల కంటెంట్

- టి-సాట్ నెట్వర్క్ కంటెంట్ అన్ని స్థాయిల్లో ఉపయోగం
- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్, నవంబర్ 18 (జనంసాక్షి) :** పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు నాణ్యమైన కంటెంట్ అందిస్తున్న టి- సాట్ ను రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందించారు. ఉపాధ్యాయ ఉద్యోగ పరీక్ష డీఎస్సీకి టెట్ అర్హత తప్పనిసరి కావడంతో అభ్యర్థులందరూ టి-సాట్ డిజిటల్ కంటెంట్ ద్వార సంసిద్ధులు కావాలని సూచించారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఉపాధ్యాయ అర్హత పరీక్షలను ప్రతీ ఏటా రెండు సీజన్లలో నిర్వహిస్తుండగా నిత్యం అందుబాటులో ఉండే టి-సాట్ నెట్వర్క్ కంటెంట్ అన్ని స్థాయిల్లో అభ్యర్థులకు ఉపయోగ పడుతుందని మంత్రి గుర్తుచేశారు. టి-సాట్ టీజీ టెట్-2026 డిజిటల్ కోచింగ్ పోస్టర్ ను సచివాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల కాలంలో మూడు టెట్ పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం, 2026 జనవరి నెలలో నిర్వహించే టెట్-2026 పరీక్ష కోసం టి-సాట్ నెట్వర్క్ స్పెషల్ డిజిటల్ కంటెంట్ అందిస్తోందని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి విద్యాశాఖకు మెరుగైన వసతుల్ని కల్పిస్తున్నారని, 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు రికార్డు కాలంలో పూర్తి చేసారన్నారు. కేంద్ర గైడ్ లైన్స్ ప్రకారం టెట్ అర్హత ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడికీ తప్పనిసరి అయిన నేపథ్యంలో టెట్ కు హాజరయ్యే అభ్యర్థులతో పాటు ఉపాధ్యాయుల కోసం సైతం ప్రత్యేక కంటెంట్ అందిస్తున్నామని సీఈవో బోధనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన పరీక్షల తేదీలను అనుసరించి టెట్ పరీక్షలకు నవంబర్ 18,19వ తేదీలు మంగళ, బుధవారాల్లో లైవ్ ఓరియంటేషన్ తో పాటు మరో 44 రోజులు 200 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నట్లు సీఈవో తెలిపారు. టి-సాట్ నిపుణ ఛానల్ లో సాయంత్రం 5గంటల నుండి ఏడు గంటల వరకు, విద్య ఛానల్లో ఉదయం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు ప్రతి రోజు నాలుగు గంటల పాటు ప్రత్యేక ప్రసారాలుంటాయని సీఈవో ప్రకటించారు. టీచర్స్ ఎలిజబిలిటీ టెస్ట్ కు అవసరమైన సబ్జెక్టులు చైల్డ్ డెవలప్మెంట్, సైకాలజీ, ఫిజికల్, బయాలాజికల్ సైన్స్, మాథ్స్, సోషల్ స్టడీస్ తో పాటు ఇంగ్లీష్, తెలుగు ఇతర సబ్జెక్టులకు సంబంధించిన డిజిటల్ లెసన్స్ ప్రసారమౌతాయన్నారు. టెట్ పేపర్-1, 2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు టి-సాట్ అందించే ప్రసారాలను సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి కోరారు. టెట్ అర్హత పరీక్ష కోసం టి-సాట్ నెట్వర్క్ ప్రసారం చేసే ప్రత్యేక కంటెంట్ టి-సాట్ శాటిలైట్ ఛానళ్లతో పాటు, టి-సాట్ యాప్, యూట్యూబ్ లో అందుబాటులో ఉంటాయన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టి-సాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాధిక్ పాల్గొన్నారు.

# పత్తికి మద్దతు ధర ఇచ్చి కొనాలి

- ఢిల్లీకి వెళ్లి పత్తి సమస్యలు ప్రధానికి తెలిపాలి
- లేదంటే సిఎం ఇంటిముందే పత్తిపోసి ధర్నా చేస్తా
- వరంగల్ ఎనుమాముల మార్కెట్ సందర్శించిన హరీష్ రావు



**వరంగల్ ఈస్ట్, నవంబరు18 (జనంసాక్షి) :** పత్తి రైతుకు మద్దతు ధర ఇవ్వకపోతే తెల్ల బంగారాన్ని రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలస్ ముందు పోసి ఇంటిని ముట్టడిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను హరీష్ రావు, బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. అనంతరం ఆయన విరీడియాతో మాట్లాడుతూ... పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరితో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. సీసీఐ తుగ్లక్ చర్యల వల్ల రైతులు రోడ్డున పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు విధిలేక దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నిలువునా ముంచుతున్నాయని మాజీ మంత్రి విమర్శించారు. రేవంత్ రెడ్డి అరవైసార్లు ఢల్లీకి వెళ్లారని.. మూటలు పంపుతున్నారు గానీ రైతుల సమస్యలు బడేబాయ్‌కు చెప్పరా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టారని.. మరి రైతులకు మద్దతు ధర ఇప్పించరా అంటూ నిలదీశారు. కపాస్ యాప్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలకంటే పంటపొలాల్లో దిష్టి బొమ్మలు నయమంటూ వ్యాఖ్యలు చేశారు. విదేశాల నుంచి పత్తి దిగుమతి చేసుకునేందుకు నిబంధనలు సడలించారని.. కానీ రైతులకు మాత్రం న్యాయం చేయడం లేదని మండిపడ్డారు. ఇప్పటి వరకూ 406 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటే సీఎం రేవంత్ రెడ్డి విజయోత్సవాలు జరుపుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తుఫానుతో పంటలు నష్టపోయిన రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని రైతులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. కాగా.. హరీష్ రావుతో పాటు పత్తియార్డును బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్ రావు, మధుసూదనాచారి, చల్లా ధర్మారెడ్డి, మాలోత్ కవిత పరిశీలించారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు నుంచి కాంట దాకా అన్నీ సమస్యలేనని ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సమయానికి ఎరువులందవు, కరెంటు సరిగ్గా రాదు, రైతుబంధు రాదు, రుణమాఫీ లేదు, బోనస్, పంటల బీమా ఊసేలేదని మండిపడ్డారు. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ఒక్క హావిరీ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లు, కార్పొరేట్లకు లాభం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి మేలుకోకపోతే తెల్ల బంగారం పత్తిని తెచ్చి జూబ్లీహిల్స్ ప్యాలెస్ ముందు పోస్తామని హెచ్చరించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందన్నారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ని సందర్శించాక పత్తి రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. రాష్ట్రంలో పత్తి రైతులు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. తెలంగాణలో 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల, బీజేపీ తప్పుడు విధానాల వల్ల పత్తి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. సీసీఐ తుగ్లక్ వంటి పిచ్చి నిర్ణయాలు తీసుకొని రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులన్నీ రెండు రోజులుగా మూతపడ్డాయి. పత్తి రైతులంతా అయోమయంలో ఉన్నారు. ఈరోజు రైతులకు పత్తిని అమ్ముకోవడానికి అవకాశం లేక అడ్డగోలుగా దళారులకు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. పత్తికి మద్దతు ధర రూ. 8,100. కానీ, రూ.6 వేలకే రైతులు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిరది. క్వింటాల్ విరీద రూ.2000ల చొప్పున పత్తి రైతులు నష్టపోతున్నారు. మాటల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరచేతిలో వైకుంఠం చూపించి, చేతల్లో నరకం చూపిస్తున్నాయని అన్నారు. వరదలు, తుఫాన్ల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతే తుగ్లక్ నిర్ణయాలతో మరింత ఇబ్బంది పెట్టడం సరికాదు. ఒకవైపు అకాల వర్షాలతో పంట దిగుబడి తగ్గిపోయింది. పంట చేనులన్నీ దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడులు రాక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చింది. ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. 8 నుంచి 12 శాతం తేమ విధానాన్ని సవరించి, కపాస్ యాప్ ని రద్దు చేయండి. స్మార్ట్ ఫోన్లు లేకపోవడం వల్ల కపాస్ యాప్‌లో నమోదు చేయడం రైతులకు కష్టమైన పని. గత సంవత్సరం లాగానే 12 క్వింటాల పత్తి కొనాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. బీజేపీ ఎంపీలు ఒక్కసారి కూడా నోరు విప్పరు. రైతుల గురించి కేంద్ర ప్రభుత్వాన్ని అడగరు. కేసీఆర్‌ని, బీఆర్ఎస్‌ని తిట్టడం తప్ప బీజేపీ ఎంపీలకు మరో పని చాతకాదు. కాంగ్రెస్ ప్రశ్నించదు. బీజేపీ అడగదు అంటూ మండిపడ్డారు. రైతులను తీవ్రంగా ఇబ్బందులు పెట్టినందుకు విజయోత్సవాలు చేస్తున్నారా?. యూరియా బస్తాల కోసం రైతులను లైన్‌లో నిల్చోపెట్టినందుకు విజయోత్సవాలా?. ములుగు నియోజకవర్గంలో చింతకుంట, మంగపేట మండలాల నుంచి వచ్చిన రైతు వెంకటేశ్వర్లు, రైతు లక్ష్మయ్య మక్కలు అమ్మడానికి ఎనుమాముల మార్కెట్‌కి వచ్చారు. క్వింటల్ మక్కలు రూ.1800 కు రైతులు అమ్ముతున్నారు, రూ.2400 మక్కకు మద్దతు ధర. మక్క రైతులు ఒక క్వింటాలకు రూ.570 నష్టపోతున్నారు. ఎవరికైనా మక్క రైతులకు పైసలు విడుదల చేశారా అని మార్క్ ఫెడ్ అధికారులను అడిగితే.. రాష్ట్ర ప్రభుత్వం ఒక రూపాయి కూడా విడుదల చేయలేదని సమాధానం ఇచ్చారు. పోయిన యాసంగిలో రైతులకు రావలసిన రూ.1,100 కోట్ల బోనస్‌ని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఈ సంవత్సరం కొన్న రైతులకు కూడా రూ.1,400 కోట్ల బకాయిలు పడ్డాయి. పంటల భీమా తెస్తామన్న కాంగ్రెస్ పార్టీ రెండేళ్లు అయినా పంటల బీమాను రైతులకు అందించడంలో విఫలమైంది. పంటల బీమా ఉండి ఉంటే నష్టపోయిన పంటకు రైతులకు నష్టపరిహారాలు అందేది కదా. బోనస్ ఎగ్గొడివితి. రైతుబంధు రెండు పంటలకు ఎగబెట్టింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. కరెంటు నుండి కాంట దాకా అన్నీ సమస్యలే. కరెంటు లోవోల్టేజ్ వల్ల ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నాయన్నారు. రైతుబంధు రాదు. రుణమాఫీ జరగదు. బోనస్ ఎగ బెడతావు. పంటల బీమా లేదు. ఇంతే కదా రేవంత్ రెడ్డి. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ఒక్క హావిరీ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందా? అని ప్రశ్నించారు. సిఎం రేవంత్ ఢల్లీకి పోయి ప్రధానమంత్రిని కలిసి నిబంధనలు ఎత్తివేసి పత్తికొనే విధంగా చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. వరంగల్ వరదల్లో 20 వేల ఇండ్లు మునిగిపోయాయి. సకాలంలో గేట్లు ఎత్తి ఉంటే వరంగల్ నగరం మునిగిపోయేది కాదు. మునిగిపోయిన ఇళ్లకు రూ. 15 వేలు ఇస్తామన్నారు. రెండు నెలలు అయింది ఒక రూపాయి ఇవ్వలేదు. వెంటనే నష్టపరిహారం విడుదల చేయాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## బస్సు యజమానులుగా మహిళలు

### ఆర్థిక శక్తికి చోదకంగా పథకం

**హైదరాబాద్, నవంబర్18 (జనంసాక్షి) :** తెలంగాణలోని రేవంత్ రెడ్డి సర్కార్ గ్రామీణ మహిళల సాధికారత కోసం మరో అద్భుతమైన స్కీమ్ ప్రవేశపెట్టింది. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ కింద, మహిళల స్వయం సహాయక బృందాలకు మొత్తం 600 బస్సులు అందించనుంది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళలు బస్సుల యజమానులుగా మారి, స్థిరమైన ఆదాయాన్ని సంపాదించే అవకాశం లభిస్తుంది. వారిని బస్సులకు యజమానులు చేయడం ద్వారా ఆర్థికాభివృద్ధి కలుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇది మహిళల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని బలోపేతం చేస్తూ, గ్రామీణ పేదరిక నిర్మూలనకు కీలకంగా నిలవనుందన్నారు. ఈ స్కీమ్ ప్రకారం, ఒక్కో బస్సు ధర సుమారు రూ.36 లక్షలు. మహిళా బృందాలు రూ.6 లక్షలు ఇన్వెస్ట్ చేస్తాయి. మిగిలిన మొత్తాన్ని కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ద్వారా ప్రభుత్వం అందిస్తుంది. బస్సులు మహిళల యాజమాన్యంలో ఉంటాయి. ఈ బస్సులను తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ నడిపిస్తుంది. ప్రతి బస్సుకు నెలకు రూ.69,648 చెల్లిస్తుంది. ఇందులో రూ.19,648 ఆపరేషనల్ ఖర్చులకు, మిగిలినది లోన్ తిరిగి చెల్లింపునకు వాడతారు. ఇలా 7 సంవత్సరాలపాటు రిస్క్ లేకుండా స్థిర ఆదాయం లభిస్తుంది. కార్యక్రమం దశలవారీగా అమలవుతోంది. మొదటి దశలో 17 జిల్లాల్లో 151 మహిళా బృందాలు 151 బస్సులు పొందాయి. రెండో దశలో మిగిలిన 449 బస్సులు కొనుగోలు చేస్తారు. ఈ బస్సులు తెలంగాణలో అమలవుతున్న మహాలక్ష్మి స్కీమ్ కింద ఉచిత ప్రయాణాలకు సహాయపడతాయి. గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని బస్సులు అందేలా చేస్తాయి. ఇది ప్రైవేట్ బస్సులపై ఆధారపడకుండా, మహిళల యాజమాన్య బస్సులపై ఆధారపడేలా మార్చుతుంది. ప్రభుత్వం ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా రూ.5 కోట్లు కేటాయించింది.

## మార్చికి ముందే మావోల అంతానికి ప్రణాళిక

- అమిత్ షా గడువుకు ముందే హిడ్మా హతం

**న్యూఢిల్లీ, నవంబర్18 (జనంసాక్షి) :** నవంబరు 30లోపు హిడ్మా ఆటకట్టించాలని భద్రతా బలగాలను అమిత్‌షా ఆదేశించినట్లు సమాచారం. మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించాలని అమిత్ షా గడువు విధించారు. ఈ క్రమంలో జరిగిన భద్రతా సమీక్షా సమావేశంలో నవంబర్ 30లోగా హిడ్మా పనిపట్టాలని భద్రతా బలగాలకు ఆదేశాలు ఇచ్చారు. అయితే ఆ డెడ్‌లైన్ కన్నా ముందుగానే ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో హిడ్మా మృతిచెందడం గమనార్హం. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు-మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా మృతిచెందాడు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా విధించిన డెడ్‌లైన్ కంటే ముందే హిడ్మా ను ఎన్‌కౌంటర్ చేశారు. ప్రస్తుతం జరుగుతోన్న ఆపరేషన్లను చూస్తుంటే.. మార్చి కంటే ముందుగానే నక్సలిజం తుడిచిపెట్టుకుపోతుందని అంచనావేశాయి. దేశంలో మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయించారని గతంలో అమిత్ షా పేర్కొన్న సంగతి తెలిసిందే. హింసను, ఆయుధాలను వదిలేసి వారు లొంగిపోవాలని లేకపోతే మావోయిస్టుల అంతానికి ఆల్-అవుట్ ఆపరేషన్ నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370